


# పెన్ పవర్

## తెలంగాణ రౌండప్




# అధికారుల 'లేఖలు'..!

# అధికారులే 'బేఖాతర్'..?

- జనవరి 9నే ఫిర్యాదు.. అదే రోజు నీటిపారుదల శాఖ క్షేత్రస్థాయి పరిశీలన..
- జనవరి 23నే హైడ్రా, సీఎంసీకి లేఖలు.. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో పనులపై ఫిర్యాదు.
- బాచుపల్లి లేక్‌ఐడి నెం.2821 బైరోని చెరువు 33.281 ఎకరాల విస్తీర్ణం..!
- చుట్టూ 30 మీటర్ల బఫర్‌జోన్ తప్పనిసరి అని అధికారుల స్పష్టీకరణ..
- చర్యలకు లేఖలు.. నిర్మాణాలకు హెచ్చరికలు ఉన్నా దర్జాగా పనుల కొనసాగింపు..
- సర్వే నెంబర్లు 59, 60, 61లో పనులు ప్లింత్ బీమ్ స్థాయికి చేరినట్లు గుర్తింపు..
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో మట్టినింపి పూడ్చివేతలపై ఇరిగేషన్ ఆగ్రహం..
- నీటిపారుదల శాఖ ముందే లేఖ రాసినా..! నెలల తరబడి పనులు ఎలా సాగాయి..?
- నిజాంపేట్ 'సిఎంసి-హైడ్రా' చర్యల్లో ఎందుకింత జాప్యం..? సిఫార్సులా..?
- పత్రికా కథనాలతో ఇరిగేషన్ కీలక నిర్ణయం. గతనెల(ఆగస్టు)18న పోలీసులకు ఫిర్యాదు..
- ఆగస్టు 24న ఎస్‌ఐఆర్.. పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభం..

## ఇరిగేషన్ లేఖలు- కబ్జాదారులపై కేసులు..! చర్యలు నీరుగార్చేందుకా..?

నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి పరిధిలోని, బాచుపల్లి లేక్‌ఐడి నెం.2821 బైరోని చెరువు (పెద్దచెరువు-బీన్ చెరువు) కబ్జా వ్యవహారంలో నీటిపారుదల శాఖ సకాలంలోనే స్పందించింది..అనంతరం క్షేత్రస్థాయి పరిశీలనతో కబ్జాను గుర్తించిన వెంటనే, చర్యలు చేపట్టవల్సిందిగా.. ఈ ఏడాది (2026) జనవరి 23న చర్యలు చేపట్టేందుకు, అటు హైడ్రాకమిషనర్‌కు, ఇటు నిజాంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌కు లేఖలను రాసింది.. అయినప్పటికీ లేఖను అందుకున్న హైడ్రా, సిఎంసి అధికారులు దాదాపు 9 నెలలుగా చర్యలు తీసుకోకపోవడం, చెరువుకబ్జాలో పనులు అభివృద్ధి చెందటంపై అనేక అనుమానాలను రేకెత్తిస్తుంది.. చర్యలు లేకపోవడానికి అధికారపార్టీ నాయకుల సిఫార్సులు చేసి ఉంటారని స్థానికుల ఆరోపణలు వినిపిస్తున్నాయి.. దీంతో పత్రికల్లో వచ్చిన కథనాలతో నీటిపారుదల శాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు.. గత నెల (ఆగష్టు) 18న కబ్జాదారులపై ఇరిగేషన్ ఏఈఈ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.. కేసునమోదు చేసుకుని, విచారణ చేపట్టిన పోలీసులు ఆగష్టు 24న ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలుస్తోంది.. సిఎంసి బ్యూరో, పెన్ పవర్, సెప్టెంబర్ 16:

- బాచుపల్లి బైరోని చెరువు 'కబ్జా'పై చర్యలు చేపట్టడంలో "హైడ్రా-సిఎంసి" నిర్లక్ష్య వైఖరి..?
- కబ్జాను నిర్ధారించిన ఇరిగేషన్.. చర్యలు చేపట్టాలని రెండు శాఖలకు లేఖలు..
- 9 నెలలుగా చర్యలు తీసుకోక పోగా.. పనులు చేసుకునే వెసులుబాటు..?
- అక్రమార్కులకు లేని ఆంక్షలు.. అధికారులకు ఉండటం బాధాకరం..

-4లో

బాచుపల్లి బైరోని చెరువు ఆక్రమణ.. గత జూలై నెలలో ఇలా..



చర్యలు లేక ప్రస్తుతం ఇలా..




# నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలనకై.. ఉన్నతస్థాయి అధికారుల పర్యటన..

### సూరారం చెరువు వద్దకు సైబరాబాద్ సీపీ రమేష్..! సిఎంసి కమిషనర్ సృజన..!

- సూరారం లింగం చెరువు వద్ద పకడ్బందీగా గణేష్ నిమజ్జన ఏర్పాట్లు..
- కుత్బుల్లాపూర్ సిఎంసి జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ పర్యవేక్షణలో నిఘా..
- నిత్యం అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన.. భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం..
- బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ సూచనలు..
- చెరువు పరిసరాలపై లైటింగ్, పారిశుధ్య నిర్వహణపై సమీక్ష..
- ప్రశాంతంగా నిమజ్జనం నిర్వహించేందుకు శాఖలు సమన్వయంతో పనిచేయాలి: సీపీ..

-5 లో



# భూ వ్యవహారాలపై... సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించండి

- 22ఏ సమస్యపై కమిటీల పేరిట కాలయాపనా?
- మీ ఇల్లు అయితే నిషేధిత జాబితా నుంచి తక్షణమే తొలగిస్తారా?
- ప్రజల ఇళ్లను తొలగించడానికి అడ్డమేంటి..
- మీ అక్రమాలను ప్రశ్నిస్తున్నామనే... కేసీఆర్‌పై, నాపై, మా కుటుంబ సభ్యులపై ఆరోపణలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై హరీశ్‌రావు ధ్వజం

-4 లో

హైదరాబాద్ పెన్ పవర్:ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి 22ఏ సమస్య పరిష్కారంపై స్పష్టమైన ప్రకటన వస్తుందని ప్రజలు ఆశించారని, కానీ కేవలం కమిటీల పేరిట కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని భారాస శాసనసభాపక్ష ఉపనేత హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ధరణి, భూభారతి... 22ఏ వ్యవహారంపై భారాస ప్రభుత్వ హయాం నుంచి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇప్పటి వరకూ సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. "ప్రజల సమస్యలు, ఆరు





# నా భూమి ఎంతుందో అఫిడవిట్‌లోనే చెప్పా

### దాని కంటే గజం ఎక్కువున్నా ప్రభుత్వానికే ఇస్తా: కవిత



హైదరాబాద్ పెన్ పవర్: తనకు ఎంత భూమి ఉందనే వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లోనే వెల్లడించానని, అందులో చెప్పిన దాని కంటే గజం ఎక్కువున్నా.. ప్రభుత్వానికే సరెండర్ చేస్తానని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. అసెంబ్లీలో 22ఏపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి.. తన కుటుంబానికి ఎక్కడో భూములు ఉన్నట్టుగా చేసిన వ్యాఖ్యలపై బుధవారం 'ఎక్స్' వేదికగా కవిత స్పందించారు. "సీఎం అసెంబ్లీలో ఎవరెవరికి అక్రమ భూములు ఉన్నట్టు చెప్పారో.. వారందరిపై సరైన విచారణ జరిపిస్తారన్న నమ్మకం నాకు లేదు. సీఎం చదివిన భూముల చిట్టాలో నిజాలు నిగ్గు తేలాలంటే.. సీబీఐ విచారణ జరిపించాలి. నిబంధనలు అతిక్రమించి నాకు ఒక్క గజం భూమి అదనంగా ఉన్నట్టు తేలినా.. ఆ భూములు సర్కారుకే ఇచ్చేస్తానని మరోసారి స్పష్టం చేస్తున్నా" అని కవిత పేర్కొన్నారు.

# అధికారుల 'లేఖలు'..! అధికారులే 'బేఖాతర్'..?



GOVERNMENT OF TELANGANA
IRRIGATION & CAD DEPARTMENT

From,
Sri V. Vidyasuman, B.Tech.,
Executive Engineer, I&CADD.,
Irrigation Division No.1,
Red Hills, Hyderabad.

To,
The Commissioner,
Hyderabad Disaster Response and Asset Protection Agency,
6th and 7th Floors, Buddha Bhavan,
Secunderabad-03.

The Zonal Commissioner,
Kukatpally Zone.

Lr.No. EE/Irrg Divn No.1/HYD/DB/DEE-T/ JTO-12026-27/ Dt:23.01.2026.

Madam/Sir,

Sub:- I&CAD Department - Nizampet Circle - Illegal construction of building and compound wall within the FTL / Buffer Zone of Bin Cheruvu, near Bachupally Village, Bachupally Mandal - Request to stop work and revoke permissions, if any - Reg.

Ref: Lr.No.DEE/ISD No.3/medchal/2026/951 dated 12.01.2026.

With reference to the subject cited above, it is to submit that a complaint was received through a phone call on 09.01.2026 regarding illegal construction of a building and compound wall within the Full Tank Level (FTL) / buffer zone of Bin Cheruvu, near Bachupally Village, Bachupally Mandal. In complaince of the same, the site was inspected on the same day by the Deputy Executive Engineer, Irrigation sub-Division No.3 along with the concerned field staff and reported as follows:

The Bin Cheruvu is a preliminary notified tank bearing Lake ID No. 2821, having a Full Tank Level (FTL) submergence area of about 33.281 acres. Since the FTL area exceeds 10 hectares, a 30.00-metre buffer zone around the tank is mandatory, as per G.O. Ms. No.168, MA & UD Department, dated 07.04.2012.

It was further reported that construction activities are being taken up in the vicinity of Bin Cheruvu. On physical verification and assessment of geo-coordinates using a hand-held GPS, it was conclusively established that RCC footing works of a building and construction of a compound wall have been carried out and are continuing within the FTL as well as within the stipulated 30.00-metre buffer zone of Bin Cheruvu.

Further, the FTL and buffer zone contours have been tampered by dumping and levelling of soil, thereby altering the natural profile, storage capacity, and hydrology of the tank and its buffer area. Google extract maps indicating the FTL boundary, buffer zone, and extent of encroachment are enclosed herewith for ready reference.

As per provisions of the Telangana Irrigation Act, 1357 Fasli, any construction, encroachment, or activity that alters, obstructs, or damages a notified water body or its components, including the FTL and buffer zone, is illegal and punishable.

In view of the above, The Commissioner, Hyderabad Disaster Response and Asset Protection Agency & zonal commissioner is hereby requested to immediately stop the ongoing construction activities within the FTL and buffer zone of Bin Cheruvu, at an early date to safeguard the water bodies & it is also requested to revoke any permissions, if issued, for the said constructions and ensure that no permissions are granted in future for any development activity in the vicinity of water bodies without obtaining prior clarification / NOC from the Irrigation Department.It is requested to remove the encroachments in the FTL/Buffer area at an early date to safeguard the water bodies.


Encl: Google extract copy

Yours faithfully,
Sd/-
Executive Engineer,
Irrigation Division No.1,
Hyderabad.

Copy to the Deputy Executive Engineer, I&CADD., Irrigation Sub Division No.3 Medchal for information.

Executive Engineer, 22/1/26
Irrigation Division No.1,
Hyderabad.

బాచుపల్లి బైరోని చెరువు కబ్జాపై ఇరిగేషన్ అధికారులు, హైడ్రా-సిఎంసి రాసిన లేఖ..



GOVERNMENT OF TELANGANA
IRRIGATION & CAD DEPARTMENT

From,
Sri. D.Ravi, B.Tech.,
Asst. Executive Engineer,
Irrigation Sub Division No.3,
Medchal.

To,
The Station House Officer,
Bachupally Police Station,
Bachupally Mandal,
Medchal-Malkajgiri Dist.

Lr.No.AEE/ISD No.3/ Bachupally/Baironi(Bin) Cheruvu/ 2 Dt:18.08.2026

Sir,

Sub: - I&CAD Department - Bachupally Mandal - Bachupally Village - Baironi (Bin) Cheruvu (Lake ID No.2821) - Verification of complaints regarding unauthorized developmental activities within the notified FTL/Buffer Zone of Baironi (Bin) Cheruvu - Request to take necessary action - Reg.

Ref:- 1. Deputy Executive Engineer, Irrigation Sub-Division No.3, Medchal vide Lr.No.DEE/ID No.3/Medchal/2026/951 Dt.12.01.2026.
2. Deputy Executive Engineer, Irrigation Sub-Division No.3, Medchal vide Lr.No.DEE/ID No.3/Medchal/2026/1021 Dt.16.02.2026.

With reference to the 1st and 2nd references cited above, it is respectfully submitted that this office had earlier brought to the notice of the Deputy Commissioner, Nizampet Circle, and the Tahsildar, Bachupally Mandal, regarding the unauthorized construction of a building and compound wall within the Full Tank Level (FTL)/Buffer Zone of Baironi (Bin) Cheruvu, near Bachupally Village, Bachupally Mandal, based on a complaint received on 09.01.2026 and the subsequent site inspection conducted on the same day.

Further, it is submitted that the Municipal authorities had stopped the ongoing construction activity and seized the property as per the applicable rules. However, despite repeated instructions and warnings to stop the unauthorized construction activity, the persons concerned have continued the construction works at the site. It has also been observed that the construction activities are being carried out on public holidays.


In this regard, it is further submitted that, during subsequent verification, the said construction was found to be located within the notified FTL/Buffer Zone of Baironi (Bin) Cheruvu. The construction activity has been carried out up to the plinth beam level of the Ground Floor without obtaining the necessary permission from the competent authorities. The said construction works are falling in Sy.Nos.59, 60 and 61.

However, the matter has been brought to the notice of the concerned authorities and the construction activity was stopped on several occasions, the persons concerned are repeatedly resuming the construction works. If the construction activity is allowed to continue at this stage, it may become extremely difficult to remove the unauthorized structures at a later stage.

The extent of encroachment into the notified tank area and the existing construction activity have been verified at site. Google Earth imagery/extract maps and photographs of the seized property are enclosed herewith for ready reference.

It is pertinent to state that, under the provisions of the Telangana Irrigation Act, 1357 Fasli, any construction, dumping, filling, obstruction, encroachment, excavation or alteration affecting a notified water body, its tank bund, FTL area or Buffer Zone is unauthorized and liable for action under the relevant provisions of the Act.


గతనెల ఆగష్టు 18న బాచుపల్లి పోలీసులకు ఇరిగేషన్ ఇచ్చిన ఫిర్యాదు..



FIRST INFORMATION REPORT
(Under section 173 and 176 BNSS)
T.S.P.M. Orders 470,500

1. District Cyberabad P.S. Bachupally Year 2026 FIR No. 776/2026 Date 24-08-2026
2. Acts & Section(s): 329(3),326(a),223,r/w 3(5) BNS,3 PDPPA
3. a) Occurrence of Offence: Day Monday Date & Time From
Date & Time To Prior To 24-08-2026 14:00:00 Time Period
b) Information Received at P.S.: Date & Time 24-08-2026 15:30:00
General Diary Reference: Entry No 13 Date & Time 24-08-2026 15:30:00
4. Type of Information: Written
5. Place of Occurrence:
a) Distance and Direction From P.S.: 0.3 km, North Beat No.
b) Address Place at Baironi (Bin) Cheruvu (Lake ID No.2821), Sy.Nos.59, 60 and 61, Bachupally Village Area/Mandal Bachupally Street/Village
City/District MEDCHAL MALKAJGIRI State Telangana PIN
c) In case, outside the limit of this Police Station, then
Name of P.S. District
6. Complainant / Informant:
a) Name Sri D. Ravi Ravi
b) Father's /Husband's Name
c) Date/Year of Birth Age 44 Years
d) Nationality India e) Caste Others
f) Passport No Date of Issue Place of Issue
g) Occupation Govt. official Non-Gazetted Mobile No. 7989572602
h) Address House No Bachupally Area/Mandal Bachupally Street/Village
City/District MEDCHAL MALKAJGIRI State TELANGANA PIN
7. Details of known/suspected/unknown accused with full particulars:
Serial No : 1
a) Name Responsible persons for carrying out the unauthorized construction

గతనెల ఆగష్టు 24న బాచుపల్లి పోలీసుల ఎస్ఐఆర్ నమోదు..




సర్కిల్ అధికారులు సీల్ వేసినది.. (ఫైల్‌ఫోటో)

## ఆగస్టు 24న ఎఫ్ఐఆర్ నమోదు..!

నీటిపారుదల శాఖ ఫిర్యాదు అనంతరం బాచుపల్లి పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టి ఆగస్టు 24, 2026న ఎస్ఐఆర్ నెంబర్: 776/2026 నమోదు చేసినట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి.. ఎస్ఐఆర్‌లో బైరొని చెరువు ప్రభావిత సర్వే నెంబర్లు: 59, 60, 61ను పేర్కొన్నారు. అనధికార నిర్మాణాలకు సంబంధించిన ఆరోపణలపై బిఎన్ఎస్ సెక్షన్లు 329 (3), 326(ఎ), 223 రెడ్ విత్ 35తో పాటు 'పిడిపిపిఎ' నిబంధనలను నమోదు చేసినట్లు ఎఫ్ఐఆర్‌లో ఉంది.. కేసు దర్యాప్తు కొనసాగుతుంది..

## అధికారిక లేఖలు.. అధికారులే బేఖాతర్ చేస్తే..?

తెలంగాణ ఇరిగేషన్ యాక్ట్ 1357 ఫస్లీ నిబంధనలు ప్రస్తావిస్తూ నోటిఫైడ్ నీటివనరు, ట్యాంక్‌బండ్, ఎఫ్‌టీఎల్ ప్రాంతం లేదా బఫర్‌జోన్‌ను ప్రభావితం చేసే నిర్మాణాలు, మట్టి నింపడం, ఆక్రమణలు, తవ్వకాలు, సహజ స్వరూపాన్ని మార్చే చర్యలు అనధికారమైనవని నీటిపారుదల శాఖ లేఖలో స్పష్టం చేసింది.. ఇటువంటి కార్యకలాపాలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని పేర్కొంది.. జనవరి 9న ఫిర్యాదు.. అదే రోజు క్షేత్రస్థాయి పరిశీలన.. జనవరి 23న హైడ్రా, మున్సిపల్ అధికారులకు నీటిపారుదల శాఖ లేఖ.. అయినప్పటికీ అక్రమ నిర్మాణంలో పనులు చేపట్టడం అంటేనే.. సిఎంసి-హైడ్రా విఫలమైందని స్థానికులు ఆరోపిస్తున్నారు.. సంబంధిత శాఖల మధ్య సమన్వయం లోపించిందా..? లేక చర్యలు ఆలస్యం కావడానికి మరేదైనా కారణముందా..? అన్న ఆరోపణలు వినవస్తున్నాయి.. ఇరిగేషన్ అధికారుల లేఖలు..! సిఎంసి-హైడ్రా అధికారులే బేఖాతర్ చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..

ప్రభుత్వ సీలింగ్ భూములు, చెరువులు కుంటలు, ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలు ఏవైనా చర్యలు అంతంత మాత్రమే.. అదేంటో కబ్జాదారులకు సహకరించినంత, మేరకు, చర్యలు తీసుకోవడంలో వెనకడుగు వేస్తారు.. కారణం ఏదైనా పక్కనపెట్టి, అధికారులు తమ విధులను పారదర్శకంగా నిర్వర్తిస్తే బాగుంటుందని పలువురి అభిప్రాయం.. బాచుపల్లి లేక్‌ఐడి నెం.2821 బైరోని చెరువు ఆక్రమణను, ఈ ఏడాది 2026 జనవరి 9నే ఇరిగేషన్ అధికారులు కబ్జాను నిర్ధారించారు.. తక్షణ చర్యల కోసం "సిఎంసి-హైడ్రా" అధికారులకు స్పష్టమైన లేఖలు అందజేశారు. ఇంతవరకు నీటిపారుదల శాఖ వారి విధులు సక్రమంగానే నిర్వర్తించారు.. అటు నిజాంపేట్ సర్కిల్-58 కూడా ప్రశ్నించే వారికి చెప్పుకోవడానికి అన్నట్లు "సీజింగ్" ప్రక్రియతో మమః అనిపించారు.. సిఎంసి 'సీల్' వేసినా పనులు ఎలా కొనసాగాయి..? అంతకంటే ముందే (2026 జనవరి 23న) లేఖలు స్వీకరించిన 'హైడ్రా-సిఎంసి' బైరోని చెరువు కబ్జాను ఎందుకు కూల్చివేయలేదు..? హడావుడి చేసే హైడ్రా కూడా 9 నెలలుగా చర్యల ప్రస్తావనే లేదు..! నిజాంపేట్ సర్కిల్ సిఎంసి గురించి కొత్తగా చెప్పేది ఏముంది.. ఎలాంటి అనుమతుల్లేని ప్రమాదకర ఆకాశహర్మ్యాలనే ప్రోత్సహించిన కరప్షన్ అధికారులు, ఈ చెరువును కాపాడాలనే సామాజిక బాధ్యత ఉంటుందా..? అన్న ప్రశ్నలు లేవనెత్తుతోంది.. సిఎంసి-హైడ్రా అధికారులు చర్యలు తీసుకోవాలనే సంకల్పమే ఉంటే..! బైరోని చెరువు కబ్జాను గంటలో నామ రూపాలు లేకుండా చేయగలరు.. ఒకవైపు నేతల సిఫార్సులు.. మరోవైపు అవినీతి అధికారుల స్వార్థం.. వెరసి ఇలా 9 నెలలుగా చర్యలు లేవేమో..! అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.. ఆశలు చాలించిన ఇరిగేషన్ పోలీసులకు ఫిర్యాదు చేయడం అంటేనే..! చర్యలు చేపట్టడంలో సిఎంసి-హైడ్రా విఫలమైందని సంకేతంగా పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.. ఇలాంటి అధికార యంత్రాంగం భావితరాలకు బంగారు బాట వేస్తారా..? అంటూ వ్యంగ్య వ్యాఖ్యలు చేస్తున్నారు..




గత జూన్ నెలలో ఇలా పనులు..(ఫైల్‌ఫోటో)

-3 పేజి తరువాయి

బాచుపల్లి మండలంలోని లేక్‌ఐడీ నెంబర్ 2821 బైరొని (బిన్) చెరువు కబ్జా వ్యవహారంలో నీటిపారుదల శాఖ సకాలంలోనే స్పందించినట్లు అధికారిక లేఖలు స్పష్టం చేస్తున్నాయి. చెరువుఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంక్ లెవెల్), 30 మీటర్ల బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు, మట్టి పూడ్చివేతలు జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు.. వాటిని వెంటనే నిలిపివేయాలని ఈ ఏడాది జనవరి 23న హైడ్రా కమిషనర్‌తో పాటు నిజాంపేట్ సర్కిల్ సిఎంసి డిప్యూటీ కమిషనర్‌కు లేఖలు రాశారు.. అయితే ఆ లేఖలు జారీచేసిన తర్వాత కూడా నిర్మాణ పనులు యధావిధిగా కొనసాగటం, పనుల అభివృద్ధిపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.. ఇరిగేషన్ లేఖలను స్వీకరించిన సిఎంసి-హైడ్రా అధికారులు చర్యలు తీసుకోలేదు.. చివరకి పత్రికల్లో వరుస కథనాలు రావడంతో, నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించారు.. సిఎంసి-హైడ్రాను నమ్ముకుంటే చర్యల సంగతేమో కానీ..! అక్రమ నిర్మాణం పూర్తి అయ్యేటట్లు ఉందని ఇరిగేషన్ శాఖ భావించి, 2026 ఆగస్టు 18న పోలీసులకు ఫిర్యాదు చేశారు.. దీంతో ఆగస్టు 24న బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైనట్లు రికార్డులు వెల్లడిస్తున్నాయి..

## చర్యలు చేపట్టడానికి అడ్డంకులు ఏంటి..?


నిజాంపేట్ సర్కిల్-58 సిఎంసి అధికారులు, బాచుపల్లి బైరోని చెరువు కబ్జాపై చర్యలు చేపట్టలేదంటే దానికో అర్థం ఉంది.. కూట్లో రాయి తీయలేనోళ్ళు- ఏట్లో రాళ్ళు తీస్తారా..? తమ పరిధిలోని ప్రమాదకర అక్రమ నిర్మాణాల పైనే నిర్లక్ష్యం వహించే నిజాంపేట్ సర్కిల్ అధికారులు.. చెరువుల కబ్జాలపై కూల్చివేతలు సాధ్యమేనా..? అంటూ పలువురు వ్యంగ్యారోపణలు చేస్తున్నారు.. చెరువుల పరిరక్షణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం హైడ్రా అధికారులు కూడా.. చర్యలు తీసుకోకుండా గత 9 నెలలుగా కాలయాపన చేయడం అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది.. ఈ ఏడాది 2026 జనవరి 9నే ఇరిగేషన్ శాఖ అక్రమ నిర్మాణాలు గుర్తించి లేఖలు రాసింది.. ఇకపై చర్యలు చేపట్టరనే భావించిన నీటిపారుదల శాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారా..? బైరోని చెరువు కబ్జాపై 9 నెలలుగా చర్యలకు వెనకడుగుకు కారణం..? రాజకీయ ఒత్తిళ్ళేనా..? ఒకవేళ అదే నిజమైతే..! చెరువుల ఆక్రమణకు అండగా ఉండే పనికిమాలిన నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఏముంది..? అన్న విమర్శలు కీలకంగా వినిపిస్తున్నాయి..

## 10 హెక్టార్లలకు పైనే విస్తీర్ణం..! నోటిఫైడ్ చెరువు..

బాచుపల్లి లేక్‌ఐడి నెంబర్ 2821 బైరోని (బిన్ చెరువు, పెద్దచెరువు) చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో భవనం, కాంపౌండ్‌వాల్ నిర్మిస్తున్నాని నిర్ధారణకు వచ్చాకే "సిఎంసి-హైడ్రా" ఇరిగేషన్ చర్యలకు లేఖలు రాసింది.. బైరొని చెరువు ప్రాథమికంగా నోటిఫైడ్ ట్యాంక్‌గా ఉందని నీటిపారుదల శాఖ పేర్కొంది. చెరువు ఎఫ్‌టీఎల్ సబ్‌మెర్జెన్స్ (చెరువు నీరు విస్తరించే పరిధిలో) ప్రాంతం 33.281 ఎకరాలుగా ఉందని, ఇది 10 హెక్టార్లకు పైగా ఉండటంతో చెరువు చుట్టూ 30 మీటర్ల బఫర్‌జోన్ తప్పనిసరి అని సంబంధిత అధికారులు తమ లేఖలో స్పష్టం చేశారు..

## పత్రికా కథనాలతో కేసు నమోదుకు ఫిర్యాదు..

**చెరువు కబ్జా, ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలపై సిఎంసి-చర్యల లేమితో.. నిరాటంకంగా పనులు చేపట్టడంపై పత్రికల్లో వరుస కథనాలు వెలువడిన నేపథ్యంలో వ్యవహారం మరో మలుపు తిరిగింది.. నీటిపారుదల శాఖ అధికారులు ఆగస్టు 18, 2026న బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.. చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు, మట్టి పూడ్చివేతలు, ఆక్రమణలకు పాల్పడుతున్న బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు..**




బాచుపల్లి బైరోని చెరువు కడస్టల్ మ్యాప్..

# భూ వ్యవహారాలపై... సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించండి

-3 పేజి తరువాయి

గ్యారంటీల అమలుపై భారాస ప్రశ్నిస్తుంటే... ముఖ్యమంత్రి దృష్టి మళ్లింపు రాజకీయాలకు తెరలేపుతున్నారు. నిషేధిత జాబితాలో ఉన్న భూములను తొలగించడానికి కమిటీలు వేస్తాం.. మార్గదర్శకాలు ఇస్తామని చెబుతున్నారే తప్ప స్పష్టమైన పరిష్కారం చూపలేదు. ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసేందుకే ఈ దాటవేత ధోరణి. ముఖ్యమంత్రి ఇల్లు రాత్రికి రాత్రి నిషేధిత జాబితా నుంచి ఎలా తొలగించారో.. అదేవిధంగా ప్రజల ఆస్తులను కూడా 22ఏ నుంచి తొలగించడానికి మీకొచ్చిన అడ్డంకి ఏమిటి? చట్టం సామాన్యుడికైనా, ముఖ్యమంత్రికైనా ఒకటే ఉండాలి. మీ ప్రభుత్వం చేస్తున్న భూ అక్రమాలను ప్రశ్నిస్తున్నామనే కక్షతో... దురుద్దేశపూరితంగా కేసీఆర్‌పై, నాపై, మా కుటుంబ సభ్యులపై ఆరోపణలు చేస్తున్నారు. 2023 డిసెంబరు 7 నుంచి ఇప్పటి వరకు ఎన్ని భూములు నిషేధిత జాబితాలో పెట్టారు? ఎన్ని తొలగించారు? అనే దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలి. ధరణి లేదా భూభారతి.. 22ఏ జాబితా వ్యవహారంపై భారాస పాలన నుంచి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఇప్పటివరకు సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి. అసెంబ్లీలో ముఖ్యమంత్రి మాట్లాడినవన్నీ అర్ధసత్యాలు, అబద్ధాలు. రాహుల్‌గాంధీ లోక్‌సభకు టీషర్ట్, స్టిక్కర్లు వేసుకుని వెళ్తే ఒప్పు.. భారాస ఎమ్మెల్యేలు టీ షర్ట్ వేసుకుని వస్తే తప్పా? లోక్‌సభ, అసెంబ్లీ నియమాలు వేర్వేరా? పక్కా పథకం ప్రకారం మమ్మల్ని అసెంబ్లీ నుంచి గెంటేశారు. మా మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డితో అనుచితంగా ప్రవర్తిస్తే.. కనీసం మైక్ ఇవ్వాలని అడిగినందుకు సస్పెండ్ చేశారు. 22ఏ నిషేధిత భూముల విషయంలో భారాస చేసిన ఆరోపణలు అక్షర సత్యమని సీఎం అసెంబ్లీలో ఒప్పుకొన్నారు. 3.71 లక్షల ఎకరాలు నిషేధిత జాబితాలో పెడితే.. అది 30 లక్షల ఎకరాలకు పెరిగిందని ముఖ్యమంత్రే చెప్పారు. దీనివల్ల ఎన్ని లక్షల కుటుంబాలు ఇబ్బందులు పడ్డాయో సమాధానం చెప్పాలి? కలెక్టర్లు దబా.. దబా సంతకాలు పెట్టి అప్‌లోడ్ చేశారని, అందుకే ఈ పరిస్థితి ఏర్పడిందని సీఎం స్వయంగా అంగీకరించారు. మరోవైపు కాంగ్రెస్ వచ్చాక ఒక్క ఎకరా కూడా నిషేధిత జాబితాలో పెట్టలేదని మంత్రి పొంగులేటి అన్నారు. ఇందులో ఎవరిది నిజం? అధికారులే 30 లక్షల ఎకరాలు అప్‌లోడ్ చేశారని ముఖ్యమంత్రి చెబుతున్నారు. తప్పు చేసిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? దీనికి కారణం మీరే కదా? భూభారతిలో 9,200కు పైగా భూముల రిజిస్ట్రేషన్లు యజమానులకు తెలియకుండానే జరిగిపోయాయి. ఇంత పెద్ద స్కామ్‌పై ముఖ్యమంత్రి ఎందుకు మాట్లాడరు? నాదర్‌గుల్‌లో రూ.10 వేల కోట్ల భూ కుంభకోణాన్ని సాక్ష్యాధారాలతో బయటపెడితే... ప్రభుత్వం ఎందుకు సమాధానం చెప్పలేదు? ముఖ్యమంత్రి సోదరుడికి సంబంధించిన కంపెనీకి కోట్ల విలువైన భూ కేటాయింపు, పసుమాములలో మరో సోదరుడి భూమి నాలా కన్వర్షన్‌పై ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంది?

### ముఖ్యమంత్రికి ఒక్క గ్రామంలోనే 175 ఎకరాలు!

నాకున్న వ్యవసాయ భూమి వివరాలు ఎన్నికల అఫిడవిట్‌లో, ఇన్‌కమ్ ట్యాక్స్ రిటర్న్‌లో స్పష్టంగా ఉన్నాయి. నా భూమిని సర్వే చేసిన అధికారులే రెండు గుంటలు తక్కువ ఉందని తేల్చారు. మా సోదరుడు అమెరికాలో 30 ఏళ్లుగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. 2010 నుంచి పౌల్ట్రీ వ్యాపారం చేస్తున్నారు. చట్టబద్ధంగా కంపెనీ షేర్లను కొనుగోలు చేశారు. ఇందులో ఎలాంటి అక్రమాలు లేవు. రేవంత్‌రెడ్డి కుటుంబానికి ఒక్క కొ్ట్రా గ్రామంలోనే 308 ఎకరాల ఆస్తులు ఉన్నట్లు గంట వ్యవధిలోనే మాకు సమాచారం అందింది. ఇందులో 175 ఎకరాలకు సంబంధించిన పక్కా డాక్యుమెంట్లు మా దగ్గర ఉన్నాయి. దీనికితోడు కొండారెడ్డిపల్లిలో 77 ఎకరాలు! ఈ ఆస్తులు రేవంత్ కుటుంబం పేరిట ఉన్న మాట వాస్తవం కాదా? దీనికి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

- సూరారం లింగం చెరువు వద్ద పకడ్బందీగా గణేష్ నిమజ్జన ఏర్పాట్లు..
- కుత్బుల్లాపూర్ సిఎంసి జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ పర్యవేక్షణలో నిఘా..
- నిత్యం అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన.. భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం..
- బందోబస్తు, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సీపీ సూచనలు..
- చెరువు పరిసరాలపై లైటింగ్, పారిశుధ్య నిర్వహణపై సమీక్ష..
- ప్రశాంతంగా నిమజ్జనం నిర్వహించేందుకు శాఖలు సమన్వయంతో పనిచేయాలి: సీపీ..


సూరారంలో నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలనలో సీపీ రమేష్, సిఎంసి కమిషనర్ సృజన..

## శాంతిభద్రతలకు ప్రాధాన్యం..

గణేష్ నిమజ్జన సందర్భంగా భక్తుల భద్రతతో పాటు సాధారణ ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసేలా ఏర్పాట్లను పర్యవేక్షించనున్నారు.. లింగం చెరువు, కట్ట మైసమ్మ వద్ద నిమజ్జన ఏర్పాట్లను ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించడం ద్వారా కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు స్పష్టమవుతోంది..


సూరారం చెరువు వద్ద నిమజ్జనం ప్రాంతం..

# నిమజ్జనం ఏర్పాట్లు పరిశీలనకై.. ఉన్నతస్థాయి అధికారుల పర్యటన..

### సూరారం చెరువు వద్దకు సైబరాబాద్ సీపీ రమేష్..! సిఎంసి కమిషనర్ సృజన..!

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, సెప్టెంబర్ 16:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలోని, సూరారం విలేజ్ లింగం చెరువు, కట్ట మైసమ్మ వద్ద నిర్వహించనున్న గణేష్ నిమజ్జనానికి సంబంధించిన, విస్తృత ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులు పరిశీలించారు.. సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్, ఐపీఎస్, సిఎంసి కమిషనర్ శ్రీమతి సృజన ఐఏఎస్, కుత్బుల్లాపూర్ సిఎంసి జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ఐఏఎస్, కుత్బుల్లాపూర్ డీసీపీ శ్రీ ఎన్.కోటిరెడ్డి ఐపీఎస్, పలువురు పోలీసు ఉన్నతాధికారులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు నిమజ్జన ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.. నిమజ్జనానికి పెద్ద సంఖ్యలో భక్తులు, గణేష్ విగ్రహాలు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడంపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు.. నిమజ్జన ప్రాంతంలో పోలీసు బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపులు, వాహనాల రాకపోకల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.. అదేవిధంగా నిమజ్జన ప్రదేశంలో లైటింగ్, పారిశుధ్యం, చెరువు పరిసరాల శుభ్రత, భక్తుల సౌకర్యాలు తదితర ఏర్పాట్లను కూడా అధికారులు సమీక్షించారు..

### నిమజ్జనం సజావుగా సాగేందుకు, శాఖల సమన్వయం..

నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులకు సూచనలు చేశారు... చెరువు పరిసరాల్లో విగ్రహాల తరలింపు, నిమజ్జన ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, పోలీసు సిబ్బంది మోహరింపు, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అధికారులు సూచించారు..





## 8 కోట్లతో భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ ప్రారంభించిన: మంత్రి పొన్నం ప్రభాకర్

**కరీంనగర్: పెన్ పవర్:** కరీంనగర్ పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు ఉదయం ఆకలితో తరగతి గదులకు రాకుండా.. వారికి నాణ్యమైన, పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించి ఆకలిని తరిమి అక్షరానికి అండగా నిలవడమే స్కూల్ బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమం ఉద్దేశమని పేర్కొన్నారు.

కరీంనగర్ మార్కెట్‌యార్డులో తెలంగాణ ప్రభుత్వం, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఇంప్లిమెంటేషన్ పార్ట్‌నర్‌గా కలిసి సుమారు రూ.8 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన భారీ సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్‌ను బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో కలిసి ప్రారంభించారు. అనంతరం కిచెన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన సాంకేతిక పరికరాలను పరిశీలించారు.

**విద్యే పిల్లలకు గొప్ప ఆస్తి**

ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ. గతంలో విద్యార్థుల ఎదుగుదలకు భూములు, నిధులు వంటి ఆస్తులు ఉండేవని, ఇప్పుడు పిల్లలకు ప్రభుత్వం ఇవ్వగలిగే గొప్ప ఆస్తి విద్య మాత్రమేనని అన్నారు. ఇటీవల జరిగిన సిప్ సర్వేలో ఉన్నత స్థాయిలో ఉన్న కుటుంబాలను పరిశీలించినప్పుడు ఉన్నత చదువులు చదివిన కుటుంబాలే మెరుగైన స్థాయిలో ఉన్నట్లు గుర్తించిన విషయాన్ని ప్రస్తావించారు. అందుకే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో అనేక మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, శిక్షణ పొందిన ఉపాధ్యాయులను అందుబాటులో ఉంచుతున్నామని, ఇప్పుడు విద్యార్థులకు ఉదయమే నాణ్యమైన అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా చేపట్టామని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తల్లిదండ్రులు మద్దతు ఇవ్వాలని కోరారు.



ఆకలితో చదువుకు ఆటంకం ఉండొద్దు:

ఆకలితో ఉన్న పిల్లవాడు చదువుపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టలేడని మంత్రి అన్నారు. విద్యార్థులకు ఉదయమే పోషకాహారంతో కూడిన అల్పాహారం అందించడం ద్వారా వారి ఏకాగ్రత, జ్ఞానాత్మక సామర్థ్యం, తరగతి గది భాగస్వామ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. విద్యార్థుల హాజరు, సమయపాలన, విద్యా పనితీరు మెరుగుపడేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు, ముఖ్యంగా ఉదయమే ఉపాధి కోసం వెళ్లే తల్లిదండ్రులకు ఈ కార్యక్రమం ఆర్థికంగా, సమయపరంగా ఉపశమనం కల్పిస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు వంట, ఆహార నిర్వహణ బాధ్యతల నుంచి విముక్తి పొంది బోధనపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

**కరీంనగర్‌లో 49,025 మందికి అల్పాహారం:**

కరీంనగర్‌లో సుమారు రూ.8 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సెంట్రలైజ్డ్ కిచెన్‌కు రోజుకు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం అందించే సామర్థ్యం ఉందని మంత్రి తెలిపారు. 17 మండలాల్లోని 669 ప్రభుత్వ పాఠశాలలు, 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఈ బ్రేక్‌ఫాస్ట్ సేవలు అందుతాయని చెప్పారు. మొత్తం 49,025 మంది విద్యార్థులు ప్రతిరోజూ ప్రయోజనం పొందుతారని వివరించారు. కరీంనగర్, హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాల విద్యార్థులకు ఈ కిచెన్ ద్వారా అల్పాహారం అందుతుందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా హుస్నాబాద్‌లో 16,544 మంది, మానకొండూర్‌లో 8,645 మంది, చొప్పదండిలో 7,481 మంది, కరీంనగర్‌లో 16,355 మంది విద్యార్థులు లబ్ధి పొందుతారని చెప్పారు. రాష్ట్రంలో ఇది ఆరవ కమ్యూనిటీ కిచెన్ అని మంత్రి తెలిపారు. ఇక్కడి నుంచి 17 మండలాల్లో దాదాపు 50 వేల మంది విద్యార్థులకు అల్పాహారం పంపిణీ జరుగుతుందని చెప్పారు.

**అధునాతన యంత్రాలతో ఆహార తయారీ:**

కిచెన్‌లో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఇడ్లీ, దోశ, పూరీ, బోండా, సాంబార్ తయారు చేసే మిషన్లు ఏర్పాటు చేశారని మంత్రి తెలిపారు. పాత్రలు శుభ్రం చేసే మిషన్లు, పాల కేంద్రం, ఆహార పదార్థాల టెస్టింగ్ ల్యాబ్, కూరగాయలు కట్ చేసే మిషన్లు, కూరగాయలు కడిగే మిషన్లు, చట్నీ పౌడర్ తయారీ మిషన్లు కూడా ఏర్పాటు చేశారని చెప్పారు. వాటి పనితీరును స్వయంగా పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అదనపు కలెక్టర్ అశ్వినీ తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కౌంటియా దాస స్వామీజీ, కరీంనగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసన్న, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## కొండా కు దారెటు

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం అత్యంత హాట్ టాపిక్‌గా మారిన పేరు కొండా సురేఖ. మంత్రివర్గం నుంచి అనూహ్య పరిణామాల నేపథ్యంలో బర్తరఫ్ అయిన తర్వాత ఆమె రాజకీయ భవిష్యత్తు ఎటు వైపు పయనిస్తుందనే దానిపై తీవ్ర చర్చ జరుగుతోంది. కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని, పార్టీ మారే ప్రసక్తే లేదని ఆమె బహిరంగంగానే స్పష్టం చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మాత్రం ఇందుకు భిన్నమైన సంకేతాలను ఇస్తున్నాయి. పార్టీలో ఆమె పాత్ర, తీసుకుంటున్న నిర్ణయాలు పలు అనుమానాలకు తావిస్తున్నాయి.మంత్రి పదవిని కోల్పోయిన తర్వాత కొండా సురేఖ అసెంబ్లీ సమావేశాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నారు. అంతేకాకుండా, అత్యంత కీలకమైన సీఎల్పీ సమావేశానికి కూడా ఆమె హాజరుకాకపోవడం రాజకీయ వర్గాల్లో అనేక అనుమానాలకు తావిచ్చింది. ఒక మంత్రిగా చక్రం తిప్పిన వ్యక్తి, అదే సభలో సాధారణ ఎమ్మెల్యేగా అడుగుపెట్టడం మానసికంగా కాస్త ఇబ్బందికరంగా ఉండడం సహజం. కానీ, ఇది కేవలం వ్యక్తిగత ఇబ్బంది మాత్రమే కాదని, పార్టీ నాయకత్వం అవలంబిస్తున్న వైఖరిపై, తనను బర్తరఫ్ చేసిన తీరుపై ఆమె నిరసన గళం వినిపిస్తున్నారనేది రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం. పార్టీ తీరుపై అలిగినందుకే ఆమె సభకు, పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారనే వాదన బలపడుతోంది.మరోవైపు, మాజీ ఓఎస్డీకి సంబంధించిన వ్యవహారం కొండా సురేఖను మరింత ఇబ్బందికర పరిస్థితులోకి నెట్టింది. ఈ అంశానికి సంబంధించి పోలీసులు తనను, తన అనుచరులను అనవసరంగా వేధిస్తున్నారంటూ ఆమె తీవ్ర ఆవేదన చెందుతున్నట్లు సమాచారం. అధికార పార్టీలో ఉంటూనే ఇలాంటి పోలీసు వేధింపులను ఎదుర్కోవాల్సి రావడం, సొంత పార్టీ నుంచి తగిన రక్షణ లేకపోవడం ఆమెను తీవ్ర మనస్తాపానికి



గురిచేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు ఆమెను పార్టీ అధిష్టానానికి దూరం చేస్తున్నాయా లేక మరింత ఒంటరి చేస్తున్నాయా అనేది ప్రశ్నార్థకంగా మారింది.ఈ వివాదాల నేపథ్యంలో, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ స్వయంగా కొండా సురేఖకు ఫోన్ చేశారని, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారంటూ పెద్ద ఎత్తున వార్తలు గుప్పుమన్నాయి. అయితే ఇవన్నీ కేవలం ఊహాగానాలేనని, సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారం మాత్రమేనని పార్టీ వర్గాలు కొట్టిపారేస్తున్నాయి. అధిష్టానం నుంచి ఎలాంటి అధికారిక జోక్యం లేకపోవడం లేదా ఈ అంశంపై హైకమాండ్ మౌనం వహించడం వెనుక వ్యూహం ఏమిటనేది అంతుచిక్కడం లేదు.ఒకవైపు కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని చెబుతూనే, మరోవైపు కీలక సమావేశాలకు, అసెంబ్లీకి పూర్తిగా దూరంగా ఉండడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది. సురేఖ అనుసరిస్తున్న ఈ వ్యూహం భవిష్యత్తులో ఎలాంటి సంచలన నిర్ణయాలకు దారితీస్తుందోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మంత్రి పదవి కోల్పోయిన బాధ, మాజీ ఓఎస్డీ వ్యవహారంలో ఎదురవుతున్న ఒత్తిళ్లు, పార్టీ అంతర్గత సర్దుబాట్ల మధ్య కొండా సురేఖ భవిష్యత్తు ఎలా ఉంటుందనేది అత్యంత ఆసక్తిగా మారింది.

# టీపీసీసీ కొత్త ఇంచార్జీ ఎవరు...

**హైదరాబాద్ సెప్టెంబర్ 16, పెన్ పవర్:** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మరోసారి సంస్థాగత మార్పులు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న మీనాక్షి నటరాజన్ త్వరలోనే ఆ బాధ్యతల నుంచి తప్పుకోనున్నట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఉన్నత చదువులకోసం విదేశాలకు వెళ్లాలని ఆమె నిర్ణయించుకోవడంతో, ఆమె స్థానంలో మరొకరికి బాధ్యతలు అప్పగించేందుకు హైకమాండ్ ఆలోచిస్తున్నట్టు తెలుస్తోంది.కొంతకాలంగా ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో మీనాక్షి నటరాజన్ ఉన్నారు. ఇప్పటికే ఆమె విదేశీ విశ్వవిద్యాలయాల్లో చదువుకునేందుకు అప్లై చేసుకున్నట్టు సమాచారం. గతంలో కూడా ఆమె విదేశాల్లో చదువుకునేందుకు ప్రయత్నించారు. అయితే పార్టీ హైకమాండ్, రాహుల్ గాంధీ సూచనల మేరకు ఆ నిర్ణయాన్ని వాయిదా వేసుకున్నారు. అయితే, ఉన్నత చదువుల కోసం వచ్చిన సువర్ణావకాశాన్ని వదులుకోవడం ఇష్టం లేక ఆమె మరోసారి హైకమాండ్‌కు తన పరిస్థితిని వివరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆమె విదేశీ ప్రయాణానికి పార్టీ నాయకత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. మరో రెండు నెలల పాటు ఆమె ఇంచార్జ్‌గా కొనసాగే అవకాశం ఉంది. ఈ లోపు ఆమె స్థానంలో పూర్తి స్థాయి బాధ్యతలను మరొకరికి అప్పగించేందుకు హైకమాండ్ ఆలోచిస్తున్నట్టు కనిపిస్తోంది.మీనాక్షి నటరాజన్ స్థానంలో తెలంగాణ బాధ్యతలను ఎవరికి అప్పగించాలనే దానిపై ఏఐసీసీ స్థాయిలో కసరత్తు ప్రారంభమైంది. ఈ పోస్టు కోసం పార్టీ హైకమాండ్ కొంతమంది సీనియర్ల పేర్లను పరిశీలిస్తోంది. ముఖ్యంగా




దక్షిణాది రాజకీయాలపై పట్టున్న నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ రేసులో తమిళనాడుకు చెందిన ఇద్దరు కీలక నేతల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. తమిళనాడుతో పాటు జాతీయ స్థాయిలోనూ గుర్తింపు ఉన్న ఎంపీ ఒకరు ఈ రేసులో ముందున్నట్టు సమాచారం. అలాగే తమిళనాడుకు చెందిన మరో సీనియర్ నేత, మాజీ ఎంపీ చల్లకుమార్ పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి.మరోవైపు పార్టీలో సుదీర్ఘ అనుభవమున్న సీనియర్ నాయకుడు ముకుల్ వాస్నిక్ పేరు కూడా ప్రచారంలో ఉంది. తెలంగాణ కాంగ్రెస్‌లోని పలువురు సీనియర్ నాయకులతో ముకుల్ వాస్నిక్‌కు దశాబ్దాలుగా మంచి సంబంధాలున్నాయి. రాష్ట్రంలో పార్టీ అంతర్గత సమీకరణాలను చక్కదిద్దడంలో ఆయన అనుభవం ఉపయోగ పడుతుందని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది.

# ఎవరికి వారే యమునా తీరే... బీజేపీ ఎమ్మెల్యేలు రూటే

**హైదరాబాద్ సెప్టెంబర్ 16, పెన్ పవర్:** తెలంగాణలో అధికారమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామని చెప్పుకునే భారతీయ జనతా పార్టీని క్షేత్రస్థాయిలో అంతర్గత కుమ్ములాటలు, సమన్వయ లోపం తీవ్రంగా వెంటాడుతున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ఎదగడానికి రాజకీయంగా ఎంతో సానుకూల వాతావరణం, ప్రజల్లో ఆదరణ కనిపిస్తున్నప్పటికీ.. పార్టీలోని నేతల వైఖరి మాత్రం అందుకు పూర్తి విరుద్ధంగా ఉంటోంది. ఒకరిపై ఒకరు ఆధిపత్యం ప్రదర్శించుకోవడం, అంతర్గతంగా గోతులు తవ్వుకోవడం వంటి పరిణామాలు పార్టీ ఎదుగుదలకు ప్రధాన అవరోధంగా మారుతున్నాయి. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లో బీజేపీ ఎమ్మెల్యేల వ్యవహారశైలి ఈ వాదనలకు మరింత బలాన్ని చేకూర్చింది.అసెంబ్లీలో ప్రభుత్వంపై సమష్టిగా పోరాడి, ప్రజా సమస్యలపై గళమెత్తాల్సిన బీజేపీ ఎమ్మెల్యేలు ఎవరికి వారే యమునా తీరే అన్న రీతిలో వ్యవహరించడం చర్చనీయాంశమైంది. ప్రభుత్వ విధానాలను ఎండగట్టడంలో ఉమ్మడి వ్యూహం పూర్తిగా కొరవడింది. ఒకవైపు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని భావిస్తున్న తరుణంలో, కొందరు ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రితో ప్రత్యేకంగా బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లలో పాల్గొనడం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపింది. మరికొందరు సభ్యులు సభ సాక్షిగానే మంత్రులపై బహిరంగంగా పొగడ్తల వర్షం కురిపించడం సొంత పార్టీ శ్రేణులకే విస్మయం కలిగించింది.ముఖ్యంగా విధానపరమైన నిర్ణయాలపై కూడా బీజేపీ ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం కనిపించలేదు. కీలకమైన డేటా సెంటర్ల ఏర్పాటు విషయంలో ఒక ఎమ్మెల్యే వ్యతిరేక గళం వినిపిస్తే, మరో ఎమ్మెల్యే అదే వేదికపై స్వాగతిస్తూ మాట్లాడటం తీవ్ర సమన్వయ లోపాన్ని బహిర్గతం చేసింది. ప్రజా సమస్యలపై పోరాటాల్లోనూ ఇదే ఒంటెద్దు పోకడ కనిపించింది. ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పంటల బీమా పథకం అమలు కోరుతూ అసెంబ్లీకి వినూత్నంగా ట్రాక్టర్‌పై ర్యాలీగా రాగా, ఆ నిరసనలో తోటి ఎమ్మెల్యేలెవరూ పాలుపంచుకోకపోవడం



పార్టీలోని విభేదాలను స్పష్టం చేసింది.సమావేశాల ప్రారంభం నుంచి ప్రభుత్వం బీజేపీ పట్ల వ్యవహరించిన తీరుపై పార్టీ నాయకత్వంలో అసంతృప్తి వ్యక్తమైంది. మొదటి మూడు రోజుల పాటు బీజేపీ సభ్యులు ఇచ్చిన వాయిదా తీర్మానాలను స్పీకర్ తిరస్కరించడం, ప్రశ్నలకు సరైన సమాధానాలు రాకపోగా ఎదురుదాడి జరగడంతో ఆఖరి రోజు సభను బహిష్కరించాలని పార్టీ నిర్ణయించినట్లు సమాచారం. అయితే, ఈ నిర్ణయంపై ఎమ్మెల్యేలంతా ఏకతాటిపైకి రాలేకపోయారు. పార్టీ వ్యూహాన్ని లెక్కచేయకుండా నాలుగో రోజు కొందరు ఎమ్మెల్యేలు యథావిధిగా సభకు హాజరయ్యారు. ఒక ప్రజాస్వామ్య వేదికపై పార్టీగా నిలబడాల్సిన కీలక సమయంలో ఇలాంటి క్రమశిక్షణా రాహిత్యం బహిర్గతం కావడం రాజకీయంగా బీజేపీని ఆత్మరక్షణలో పడేసింది.తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్‌కు దీటైన ప్రతిపక్షంగా అవతరించేందుకు బీజేపీకి విస్తృతమైన అవకాశాలున్నాయి. అయితే, సమర్థవంతమైన నాయకత్వ నిర్మాణం లేకపోవడం, ఉన్న నేతలు కలిసికట్టుగా అడుగులు వేయకపోవడం పార్టీకి శాపంగా మారుతోంది. అసెంబ్లీ వేదికగా ప్రజల పక్షాన నిలబడాల్సిన వేళ.. తమ స్వప్రయోజనాలు, భిన్నాభిప్రాయాలకే ప్రాధాన్యం ఇస్తున్న తీరు క్షేత్రస్థాయి కార్యకర్తలను తీవ్ర గందరగోళానికి గురిచేస్తోంది. అసెంబ్లీ సాక్షిగా బట్టబయలైన ఈ అంతర్గత విభేదాలు, వ్యక్తిగత ఎజెండాలు ఇలాగే కొనసాగితే.. ప్రజల్లో పార్టీపై విశ్వసనీయత సన్నగిల్లే ప్రమాదం ఉందని విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

# శంకర్ పై మళ్లీ రౌడీషీట్...

**హైదరాబాద్ సెప్టెంబర్ 16, పెన్ పవర్:** హైదరాబాద్‌లోని పాతబస్తీ, సెంట్రల్ జోన్ పరిధిలో ఒకప్పుడు సంచలనం సృష్టించిన చిన్నబోయిన శంకర్ అలియాస్ అంబర్‌పేట శంకర్ పేరు నగరంలో మళ్లీ హాట్ టాపిక్‌గా మారింది. గతాన్ని మరిచిపోయి మంచివాడిగా మారినట్లుగా నటిస్తున్న ఈ పాత నేరస్తుడిపై అంబర్‌పేట పోలీసులు తాజాగా మరోసారి రౌడీషీట్ రీఓపెన్ చేశారు. గతంలో ఇతనిపై ఉన్న కేసుల తీవ్రత తగ్గడం, కొత్త నేరాలకు దూరంగా ఉన్నాడనే నెపంతో 2019లో రౌడీషీట్‌ను ఎత్తివేసినప్పటికీ.. ఇటీవల కాలంలో వరుసగా వివాదాస్పద సెటిల్మెంట్లు, బెదిరింపులకు పాల్పడుతుండటంతో పోలీసులు మళ్లీ ఫోకస్ పెట్టారు.అంబర్‌పేట శంకర్ నేర చరిత్రను పరిశీలిస్తే.. నగరంలో ల్యాండ్ సెటిల్‌మెంట్లు, కబ్జాలు, బెదిరింపులు , రౌడీయిజంలో ఇతని పేరు ప్రముఖంగా వినిపించేది. అంబర్‌పేట, మలక్‌పేట్, కాచిగూడ తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇతనిపై డజనుకు పైగా తీవ్రమైన కేసులు నమోదయ్యాయి. స్థానిక భూవివాదాల్లో జోక్యం చేసుకుంటూ, తమ వర్గాన్ని బెదిరించి సెటిల్మెంట్లు చేయడం ఇతని ప్రధాన శైలి. ఈ క్రమంలోనే గతంలో ఇతనిపై పోలీసులు రౌడీషీట్ తెరిచి, నగర సరిహద్దుల నుండి బహిష్కరించడం లాంటి కఠిన చర్యలు కూడా తీసుకున్నారు.అయితే ఇటీవల కాలంలో జూబ్లీహిల్స్, బంజారా హిల్స్, మేడిపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో అంబర్‌పేట శంకర్ మళ్లీ పాత దందాలను ప్రారంభించినట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గాజులరామారం ప్రాంతంలో బిల్డర్లకు తెలియకుండా స్థలాలను విక్రయించడం, ఓ ప్రముఖ బిల్డర్‌ను నేరుగా బెదిరించి రూ. కోట్లలో డీల్ కుదుర్చుకోవడానికి ఒత్తిడి తెచ్చాడనే ఆరోపణలపై బంజాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే ఒక ప్రముఖ న్యూస్ ఛానెల్ నిర్వాహకుడు, మధ్యవర్తులతో కలిసి సెటిల్‌మెంట్ పేరిట వ్యాపారులను బెదిరించిన ఘటనల్లోనూ ఇతని పాత్ర బయటపడింది.వరుసగా ఫిర్యాదులు రావడం, మళ్లీ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నాడని నిర్ధారించుకున్న పోలీసులు.. శంకర్‌ను మళ్లీ పోలీస్ రాడార్‌లోకి తీసుకువచ్చారు. ఇందులో భాగంగానే అంబర్‌పేట పోలీసులు అధికారికంగా అతడిపై రౌడీషీట్‌ను పునరుద్ధరించారు. ఇకపై ప్రతి రోజు రాత్రి పోలీస్ స్టేషన్‌కు వచ్చి హాజరు పడటంతో పాటు, అతడి ఆర్థిక మూలాలు, ల్యాండ్ సెటిల్‌మెంట్ల వెనుక ఉన్న నెట్‌వర్క్‌పై ప్రత్యేక నిఘా ఉంచనున్నట్లు ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. నేర చరిత్రను వీడకుండా మళ్లీ రౌడీయిజానికి దిగితే గుండా యాక్ట్ ప్రయోగిస్తామని పోలీసులు తీవ్రంగా హెచ్చరించారు.

## ఎల్‌వోసీ ఎత్తేస్తే లండన్ వెళ్లిపోతా.. నా భర్త రాగానే ఆయనను విచారించండి : యూట్యూబర్ నందన

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎల్‌వోసీ ఎత్తేస్తే లండన్ వెళ్లిపోతా.. నా భర్త రాగానే ఆయనను విచారించండి : యూట్యూబర్ నందన



ముందుగా ఇచ్చిన నోటీసుల ప్రకారం సెప్టెంబర్ 16న హాజరుకావాల్సి ఉన్నప్పటికీ.. న్యాయవాదుల సూచన మేరకు ఒకరోజు ముందుగానే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విచారణలో పాల్గొన్నట్లు సమాచారం.

ప్రముఖ యూట్యూబర్, 'నందూస్ వరల్డ్' ఛానల్ నిర్వాహకురాలు రమానందనకు సంబంధించిన కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని.. వీసాలు, సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ ఇప్పిస్తామని చెప్పి పలువురి నుంచి భారీగా డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న రమానందన తాజాగా మరోసారి ఇబ్రహీంపట్నం పోలీసుల ఎదుట విచారణకు హాజరయ్యారు. ముందుగా ఇచ్చిన నోటీసుల ప్రకారం సెప్టెంబర్ 16న హాజరుకావాల్సి ఉన్నప్పటికీ.. న్యాయవాదుల సూచన మేరకు ఒకరోజు ముందుగానే పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విచారణలో పాల్గొన్నట్లు సమాచారం.

**లుకౌట్ సర్క్యులర్ ఎత్తివేయాలని విజ్ఞప్తి**

విచారణ సందర్భంగా రమానందన పోలీసుల ముందు కీలక అభ్యర్థన చేసినట్లు తెలుస్తోంది. తనపై జారీ చేసిన లుకౌట్ సర్క్యులర్ (ఎల్.ఓసీ)ను రద్దు చేయాలని.. తిరిగి లండన్ వెళ్లేందుకు నిరభ్యంతర పత్రం (ఎన్.ఓసీ) జారీ చేయాలని ఆమె కోరినట్లు సమాచారం. తనపై నమోదైన కేసులో వాస్తవాలు లేవని.. అందువల్ల లండన్‌కు తిరిగి వెళ్లేందుకు అనుమతించాలని పోలీసులను కోరినట్లు తెలుస్తోంది.

గత విచారణలో పోలీసులు అడిగిన ప్రశ్నలకు కూడా ఆమె తన న్యాయవాది సమక్షంలో లిఖితపూర్వకంగా సమాధానాలు ఇచ్చినట్లు సమాచారం. అయితే ఎన్.ఓసీపై పోలీసులు వెంటనే నిర్ణయం తీసుకోలేదు. ఈ అంశంపై న్యాయ నిపుణుల సలహాలు తీసుకున్న అనంతరం తదుపరి చర్యలు చేపట్టాలని పోలీసులు భావిస్తున్నట్లు తెలుస్తోంది.

**'డెస్టినీ కన్సల్టెన్సీతో నాకు సంబంధం లేదు'**

విచారణలో రమానందన చేసిన మరో కీలక వాదనపై కూడా చర్చ జరుగుతోంది. 'డెస్టినీ కన్సల్టెన్సీ'కి సంబంధించిన ఆర్థిక లావాదేవీలతో తనకు ప్రత్యక్ష సంబంధం లేదని ఆమె పోలీసులకు తెలిపినట్లు సమాచారం. కన్సల్టెన్సీ కార్యకలాపాలు, వీసాలు, స్పాన్సర్‌షిప్ ఫీజులు తదితర వ్యవహారాలను తన భర్త మధుకర్, ఆయన అకౌంటెంట్ చూసుకునేవారని ఆమె వివరించినట్లు తెలుస్తోంది.తన భర్త మధుకర్ లండన్ నుంచి భారత్‌కు వచ్చిన తర్వాత ఆయనను నేరుగా విచారించాలని కూడా ఆమె పోలీసులను కోరినట్లు సమాచారం. కేసులో తన పాత్ర లేదని రమానందన చెబుతున్నప్పటికీ.. దర్యాప్తు అధికారులు మాత్రం అందుబాటులో ఉన్న ఆధారాలు, ఆర్థిక లావాదేవీలు, సంబంధిత వ్యక్తుల వాంగ్మూలాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

**అసలు కేసు ఏంటి?**

విదేశాల్లో మంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని, వీసాలు కల్పిస్తామని, సర్టిఫికెట్ ఆఫ్ స్పాన్సర్‌షిప్ అందిస్తామని నమ్మించి పలువురి నుంచి డబ్బులు వసూలు చేశారనే ఆరోపణలు రమానందన దంపతులపై ఉన్నాయి. ఈ వ్యవహారంలో క్రాంతికుమార్ అనే వ్యక్తి ఇబ్రహీంపట్నం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైనట్లు సమాచారం. అనంతరం దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో రమానందన విదేశాల్లో ఉన్న నేపథ్యంలో పోలీసులుఆమెపై లుకౌట్ సర్క్యులర్ జారీ చేసినట్లు తెలుస్తోంది.

**విమానాశ్రయంలో అదుపులోకి..**

ఈ కేసులో భాగంగానే గత నెల 8న రమానందన లండన్ నుంచి హైదరాబాద్‌కు వచ్చిన సమయంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ అధికారులు ఆమెను గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. అప్పట్లో పోలీసులు ఆమెను విచారించారు. తాజాగా మరోసారి విచారణకు హాజరుకావాలని నోటీసులు జారీ చేయడంతో ఆమె ముందుగానే పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు.ప్రస్తుతం రమానందన కోరిన ఎల్.ఓసీ రద్దు, లండన్ వెళ్లేందుకు ఎన్.ఓసీ అంశం పోలీసుల పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది. న్యాయ నిపుణుల సలహా తీసుకున్న తర్వాతే ఈ విషయంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. మరోవైపు కేసు దర్యాప్తు కొనసాగుతున్నందున రమానందన చేసిన వాదనలు.. ఆమెపై వచ్చిన ఆరోపణలపై తుది నిర్ధారణ దర్యాప్తు పూర్తయ్యే వరకు ఉండనుంది.

## ఇండియాలో రూ.10 లక్షల కోట్ల బెట్టింగ్?.. 5 లక్షల మంది లాస్!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియాలో ఆన్‌లైన్ బెట్టింగ్‌పై నిషేదం కొనసాగుతున్నప్పటికీ ఇల్లీగల్‌గా నడుస్తూనే ఉంది. మొన్నటి వరకు ఇండియన్ స్టార్ క్రికెటర్స్, సినీ తారలు, ఎంతో మంది ప్రముఖులు ఆన్‌లైన్ బెట్టింగ్‌ను ప్రమోట్ చేసిన విషయం తెల్సిందే. అయితే ఇప్పుడు అన్ని బెట్టింగ్ యాప్స్‌ను కేంద్ర ప్రభుత్వం బ్యాన్ చేసింది. ఇక మీదట ఎవరు బెట్టింగ్‌ను ప్రమోట్ చేసినా కూడా కఠిన చర్యలు ఉంటాయని రూల్ తీసుకు వచ్చింది. దాంతో ఇండియాలో బెట్టింగ్ ఉండదని అంతా భావించారు. కానీ కేంద్ర ప్రభుత్వం రూల్ తీసుకు వచ్చినా కూడా బెట్టింగ్ అనేది కంటిన్యూ అవుతోంది. దేశ వ్యాప్తంగా కోట్లాది మంది బెట్టింగ్ బారిన పడి సర్వస్వం కోల్పోతున్నారు. చివరికి ఆత్మహత్య వరకు వెళ్తున్నారు. ఈ అక్రమ బెట్టింగ్‌లను అడ్డుకునేందుకు కేంద్రం ఏం చేస్తుందంటూ సామాన్యులు ఆవేదనతో ప్రశ్నిస్తున్నారు.

**ఆన్‌లైన్ బెట్టింగ్‌తో సమస్య...**

దేశంలో ఆన్‌లైన్ బెట్టింగ్‌ను నిషేదించిన తర్వాత కూడా పెద్ద ఎత్తున అదే బెట్టింగ్ జరుగుతున్నట్లు ఒక సర్వేలో వెల్లడి అయింది. ఇటీవల బయటకు వచ్చిన ఒక నివేదిక ప్రకారం దాదాపు ఇండియాలో రూ.10 లక్షల కోట్ల బెట్టింగ్ మార్కెట్ నడుస్తుందట. అంతే కాకుండా ప్రతి రోజు ఇండియా వ్యాప్తంగా కోటిన్నర మంది ఆన్ లైన్ ద్వారా బెట్టింగ్ వేస్తున్నారు. ఇక ప్రపంచ వ్యాప్తంగా లెక్క తీసుకుంటే దాదాపుగా 8 కోట్ల మంది బెట్టింగ్ అడిక్షన్‌తో బాధపడుతున్నారట. వారు తమ వద్ద డబ్బులు ఉన్నా లేకున్నా బెట్టింగ్ పెట్టేందుకు ఎక్కడో ఒక చోట డబ్బులు తీసుకు వచ్చి పెడుతున్నారట. ఆ నివేదిక ప్రకారం 8 కోట్ల మందిఇ బెట్టింగ్‌కు అడిక్షన్ అయ్యి డబ్బులు పెడుతూ ఉంటే, అందులో దాదాపుగా అయిదు కోట్ల మంది వారు పెట్టిన పూర్తి డబ్బులు పోగొట్టుకుంటున్నారు. కోటిన్నర మంది మాత్రం వారు పెట్టిన డబ్బులు అందుకుంటున్నారు. అతి కొద్ది మంది మాత్రమే కొంత మొత్తంలో లాభం ను సొంతం చేసుకుంటున్నారు.

**కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో...**

బెట్టింగ్ వల్ల లక్షలు, కోట్ల ఆధాయం అంటూ కొందరు చేసే ప్రచారం వల్ల ఎక్కువ మంది అటువైపు వెళ్తున్నారు. కానీ బెట్టింగ్‌లో నిజంగా కోట్లు సొంతం చేసుకున్న వారు 0.01 శాతమే అనే అభిప్రాయం ఉంది. కోట్లాది మంది బెట్టింగ్ పెడుతూ ఉంటే వందల్లో కూడా పెద్ద మొత్తంలో డబ్బులు సంపాదించుకోవడం లేదు. కనుక బెట్టింగ్ అనేది ప్రాణాలతో చెలగాటం వంటిది. అందుకే దానికి దూరంగా ఉండటం చాలా ఉత్తమం. ఇప్పటికే ప్రభుత్వం బ్యాన్ చేసినా కొందరు డబ్బు కోసం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా బెట్టింగ్ ను నిర్వహిస్తున్నారు. కొందరు టెలిగ్రామ్ ద్వారా ఈ బెట్టింగ్ దందా నిర్వహిస్తూ ఉంటే, కొందరు యాప్స్ ద్వారా బెట్టింగ్ ను నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు కోట్ల డబ్బు దోచుకుంటున్నారు. పోలీసులకు చిక్కకుండా బెట్టింగ్ నిర్వహిస్తున్న వారిలో పెద్ద వారు ఉన్నారనే అనుమానాలు ఉన్నాయి.

**టెలిగ్రామ్ వల్ల బెట్టింగ్...**

గతంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు బాహాటంగానే బెట్టింగ్‌ను ప్రమోట్ చేయడం మనం చూశాం. టీం ఇండియా స్టార్ క్రికెటర్స్ సైతం బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేశారు. టీం ఇండియా జెర్సీ స్పాన్సర్ సైతం ఒకప్పుడు బెట్టింగ్ యాప్ బ్రాండ్ ఉండేది. అందుకే ఈ స్థాయిలో బెట్టింగ్ ఇండియాలో పెరిగింది. భారీగా పెరిగిన బెట్టింగ్‌ను ఎన్ని చర్యలు తీసుకుంటున్నా తగ్గించడం సాధ్యం కావడం లేదు. టెలిగ్రాం ను బ్యాన్ చేస్తే తప్ప బెట్టింగ్ ను కాస్త అయినా తగ్గించే అవకాశం ఉంటుందని అంటున్నారు. బెట్టింగ్‌కు బలి అవుతున్న వారిలో ఎక్కువ శాతం 25 ఏళ్ల లోపు వయసు వారు ఉన్నట్లు ఒక నివేదికలో వెల్లడి అయింది. యువత బెట్టింగ్ వైపు వెళ్లకుండా ప్రభుత్వం సైతం చర్యలు తీసుకుంటూ, అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

## 22న ఏపీ ఎన్నికలకు నోటిఫికేషన్

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, పెన్ పవర్:** ఏపీలో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధత ప్రక్రియ స్పీడందుకుంది. 12 నగరపాలక సంస్థలు, 29 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో వార్డుల వారీగా ఫొటో ఓటర్ల జాబితాను రూపొందించి, ప్రచురణ చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు రెండు వేర్వేరు నోటిఫికేషన్లను జారీ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా ప్రకటించారు. ఫారం-1 నోటీసుతో పాటు వార్డుల వారీ ఫొటో ఓటర్ల జాబితాలను సెప్టెంబర్ 22న ప్రకటించాలని నిర్ణయించారు. ఈ ఏడాది జనవరి 1వ తేదీని అర్హత తేదీగా పరిగణించి, తాజా అసెంబ్లీ ఓటర్ల జాబితా ఆధారంగా ఈ లిస్ట్‌ను రూపొందించాలని సూచించారు. మొత్తం 17 నగర పాలక సంస్థలకు గాను విజయనగరం కార్పొరేషన్‌లో వార్డుల పునర్విభజన ప్రక్రియ ముందుగా పూర్తి చేయనున్నారు. దీంతో అక్కడ సెప్టెంబర్ 3 నాటికే ఓటర్ల లిస్ట్ ప్రచురణ పూర్తి చేయనున్నారు. రాష్ట్రంలోని 106 పురపాలక, నగర పంచాయతీల్లో డిలిమిటేషన్ పూర్తైన 58 చోట్ల సెప్టెంబరు 3నే ఓటర్ల జాబితాలను ప్రకటించారు. మిగిలిన 12 నగర పాలక సంస్థలు, 29 పురపాలక, నగర పంచాయతీల్లో వార్డుల పునర్విభజన ప్రక్రియ సెప్టెంబరు 14 నుంచి 17 మధ్య పూర్తి చేయనున్నారు. దీంతో ఆయా చోట్ల ఓటర్ల లిస్టుల ప్రచురణకు కొత్త తేదీని ఖరారు చేయాలని పురపాలక శాఖ సెప్టెంబరు 13న ఎలక్షన్ కమిషన్‌కు లేఖ రాసింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు ఎస్ఈసీ.. సెప్టెంబరు 22న ప్రచురణ తేదీగా ఖరారు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఓటర్ల లిస్టుల ప్రచురణతో ఆయా పట్టణ స్థానిక సంస్థల్లో ఎన్నికల నిర్వహణకు ఎస్ఈసీ రెడీ అవుతోంది. మేయర్లు, పురపాలక ఛైర్మన్లు, వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించిన రిజర్వేషన్లు ఖరారు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మార్గం సుగమం అవ్వనుంది. కార్పొరేషన్ కమిషనర్లు , మున్సిపల్ కమిషనర్లు ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ స్పీడందుకోవడంతో ఇప్పటికే రాజకీయ పార్టీల్లో ఆసక్తి నెలకొంది. పురపాలక ఎన్నికలకు అవసరమైన పాలనా, ఎన్నికలపర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేసేందుకు ఎస్ఈసీ చర్యలు ప్రారంభించింది. ఓటర్ల జాబితా ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలపై ఎన్నికల సంఘం దృష్టి సారించనుంది. 12 నగరపాలక సంస్థలు, 29 పురపాలక సంఘాల్లో ఓటర్ల జాబితాల తయారీకి సంబంధించి తాజా నోటిఫికేషన్ల జారీతో పురపాలక ఎన్నికల ప్రక్రియకు ముందడుగు పడింది. ఈ నెల 22న వార్డుల వారీగా లిస్టులు ప్రచురించనున్నారు. పట్టణ ప్రాంతాల్లో రాజకీయ పార్టీల కార్యక్రమాలు ఊపందుకోనున్నాయి.

## ట్రాన్స్ జెండర్లకు లోకల్ బాడీస్ లో రిజర్వేషన్

**హైదరాబాద్ సెప్టెంబర్ 16, పెన్ పవర్:** హైదరాబాద్‌తో పాటు తెలంగాణవ్యాప్తంగా నకిలీ హిజ్రాలు, క్రాస్ డ్రెస్సర్లు శుభకార్యాలు, వ్యాపార సంస్థల వద్దకు వెళ్లి బరితెగించి దందాలు చేయడం, అసభ్యకర ప్రవర్తనతో బెదిరించి డబ్బులు వసూలు చేయడంపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. అదే సమయంలో, సమాజంలో వివక్షకు గురవుతున్న నిజమైన ట్రాన్స్‌జెండర్లను నేర మార్గం లేదా భిక్షాటన నుంచి బయటకు తీసి, వారిని గౌరవప్రదమైన వ్యవస్థలో భాగస్వాములను చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటోంది. కేవలం పోలీసుల లాఠీలతో శాంతిభద్రతల సమస్యను తీర్చడమే కాకుండా, వారికి రాజకీయ, సామాజిక సాధికారత కల్పించే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం వేస్తున్న అడుగులు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి.ట్రాన్స్‌జెండర్ల సాధికారతలో భాగంగా తెలంగాణ అసెంబ్లీ ఇటీవల ఒక విప్లవాత్మక బిల్లుకు ఆమోదముద్ర వేసింది. తెలంగాణ మున్సిపాలిటీల చట్టం-2019 కి అవసరమైన కీలక సవరణలు చేస్తూ తెలంగాణ మున్సిపాలిటీల సవరణ బిల్లును శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ నూతన చట్ట సవరణ ప్రకారం.. హైదరాబాద్ నగరానికి సంబంధించి కోర్ అర్బన్ రీజియన్ వెలుపల ఉన్న రాష్ట్రంలోని 9 ప్రధాన మున్సిపల్ కార్పొరేషన్లలో వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, రామగుండం వంటి కార్పొరేషన్లలలో ట్రాన్స్‌జెండర్లకు స్థానిక పాలనలో అవకాశం కల్పిస్తారు. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ఒక ట్రాన్స్‌జెండర్‌ను కో-ఆప్షన్ సభ్యుడిగా ప్రభుత్వం నేరుగా నామినేట్ చేయనుంది.స్థానిక ప్రభుత్వాల చట్టాల్లో ఒక సామాజిక వర్గానికి, అదీ ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్లకు కౌన్సిల్స్ లేదా కార్పొరేషన్లలో చట్టబద్ధంగా కో-ఆప్షన్ సభ్యత్వాలు కల్పించడం భారతదేశంలోనే ఇది మొదటిసారి. నిర్ణయాధికారం ఉన్న స్థానిక పాలకమండళ్లలో వారు కూర్చోవడం ద్వారా తమ సామాజిక వర్గం ఎదుర్కొంటున్న ఆవాస, విద్యా, ఆరోగ్య సమస్యలను నేరుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం లభిస్తుంది. ఉనికి కోల్పోయిన వర్గానికి చట్టసభలు, పాలనా వ్యవస్థల్లో భాగస్వామ్యం కల్పించడం ద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పాలనా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.కేవలం రాజకీయ ప్రాతినిధ్యానికే పరిమితం కాకుండా, రేవంత్ రెడ్డి ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వ రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఇటీవల తెలంగాణ హైడ్రా వ్యవస్థలో ట్రాన్స్‌జెండర్లను కమాండోలుగా నియమించడం, నిరసనలు, ఆక్రమణల తొలగింపు వేళ వారి సేవలను వాడుకోవడం నగరంలో పెద్ద ట్విస్ట్‌గా మారింది. అంతేకాకుండా, ట్రాఫిక్ నిర్వహణ కోసం ట్రాఫిక్ వాలంటీర్లు గా కూడా ట్రాన్స్‌జెండర్లను నియమించి వారికి నిలకడైన వేతనాలు అందిస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లుగా, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన అవకాశం కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి.ఒకవైపు క్రాస్ డ్రెస్సర్లు, నకిలీ హిజ్రాల పేరుతో అమాయక ప్రజలను, నవ దంపతులను వేధిస్తున్న ముఠాలపై ఖాకీలు కఠిన చర్యలు తీసుకుంటుంటే.. మరొకవైపు అర్హులైన ట్రాన్స్‌జెండర్లకు ప్రభుత్వమే అధికారిక గుర్తింపు, ఉద్యోగాలు, రాజకీయ అవకాశాలు ఇవ్వడం వల్ల స్పష్టమైన గీత ఏర్పడుతోంది. కఠినమైన లా అండ్ ఆర్డర్ చర్యలతో పాటు సమాంతరంగా సామాజిక పునరావాసం, ప్రజాస్వామ్య ప్రాతినిధ్యం కల్పించడం తెలంగాణ ప్రభుత్వ దార్శనికతకు అద్దం పడుతోంది. నకిలీ దందాలను అరికడుతూనే, చట్టసభల్లో సవరణల ద్వారా 9 కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా చట్టబద్ధమైన స్థానం కల్పించడం తెలంగాణ మోడల్‌ను దేశంలోనే ప్రత్యేకంగా నిలబెట్టింది. ఈ నిర్ణయాలు క్షేత్రస్థాయిలో సంపూర్ణంగా అమలైతే, నగరంలో హిజ్రాల వేధింపుల సమస్య శాశ్వతంగా రూపుమాసిపోవడానికి ఎంతో సమయం పట్టకపోవచ్చునని అంచనా వేస్తున్నారు.

## రూ. 2 కోట్లు దాటేసిన ఇళ్లు...

**హైదరాబాద్ సెప్టెంబర్ 16, పెన్ పవర్:** హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో కొనుగోలుదారుల ప్రాధాన్యతలు వేగంగా మారుతున్నాయి. ఇటీవల క్రెడాయ్, క్రే మ్యాట్రిక్స్ విడుదల చేసిన నివేదికల ప్రకారం.. నగరంలో ఇళ్ల విక్రయ సంఖ్య కంటే విక్రయాల వ్యాపార విలువ గణనీయంగా పెరిగింది. గత ఏడాదితో పోలిస్తే సగటు ఇంటి కొనుగోలు ధర ఏకంగా 10 శాతం మేర పెరిగి, రూ.1.85 కోట్ల నుంచి రూ.2.03 కోట్లకు చేరింది. ఏటా సుమారు 2,300 చదరపు అడుగుల సగటు విస్తీర్ణం కలిగిన పెద్ద ఇళ్లకు డిమాండ్ ఉండటమే ఈ సగటు ధర పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచిందిప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌ను పరిశీలిస్తే.. చిన్న సైజు ఫ్లాట్లు లేదా 2బీహెచ్‌కే అపార్ట్‌మెంట్ల కంటే పెద్ద విస్తీర్ణం కలిగిన 3బీహెచ్‌కే, 4బీహెచ్‌కే లగ్జరీ అపార్ట్‌మెంట్లు, విల్లాల కొనుగోలుకే నివాసదారులు మొగ్గు చూపుతున్నారు. కరోనా మహమ్మారి తదుపరి ఏర్పడిన వర్క్ ఫ్రమ్ హోమ్ సంస్కృతి, జీవనశైలి మార్పులు , ఐటీ, /కార్పొరేట్ ఉద్యోగుల ఆర్థిక స్థిరత్వం కారణంగా ప్రీమియం, గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులకు డిమాండ్ పెరిగింది. విశాలమైన హాల్స్, హోమ్ ఆఫీస్ స్పేస్, క్లబ్ హౌస్ వసతులు ఉన్న లగ్జరీ గృహాలనే కొనుగోలుదారులు ఎంచుకుంటున్నారు.ఈ ఏడాది మొదటి అర్ధభాగంలో నగరవ్యాప్తంగా సుమారు 26,000 పైచిలుకు ఇళ్లు అమ్ముడుపోగా, వాటి మొత్తం వ్యాపార విలువ రూ.52,913 కోట్లు దాటాయి. విక్రయించిన మొత్తం ఇళ్ల విస్తీర్ణంలో సుమారు 60 మిలియన్ చదరపు అడుగులను నమోదు చేసి దేశంలోనే హైదరాబాద్ అగ్రస్థానంలో నిలిచింది. గచ్చిబౌలి, కొండాపూర్, కోకపేట్, తెల్లాపూర్ , నార్సింగి వంటి వెస్ట్ హైదరాబాద్‌లోని ప్రధాన ఐటీ కారిడార్లలోని లగ్జరీ ప్రాజెక్టుల విక్రయాలే ఈ రికార్డు స్థాయి విక్రయాల విలువను నడిపించాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.కొనుగోలుదారుల మైండ్‌సెట్‌లో వచ్చిన ఈ ఊహించని మార్పుకు అనుగుణంగా రియల్ ఎస్టేట్ బిల్డర్లు, డెవలపర్లు కూడా తమ సరికొత్త ప్రాజెక్టులను ప్లాన్ చేస్తున్నారు. చిన్న ఫ్లాట్ల నిర్మాణం తగ్గించి, ఆధునిక సదుపాయాలు మరియు ప్రాక్టికల్ డిజైన్‌తో కూడిన పెద్ద ఇళ్ల నిర్మాణానికే పెద్దపీట వేస్తున్నారు. మౌలిక వసతుల విస్తరణ, కనెక్టివిటీ మరియు మెట్రో కారిడార్ల పనులతో ముడిపడి ఉన్న హైదరాబాద్ ప్రాపర్టీ మార్కెట్.. కేవలం విక్రయాల సంఖ్యలోనే కాకుండా విలువ పరంగా కూడా ప్రపంచ స్థాయి గ్లోబల్ సిటీ స్థాయికి ఎదుగుతోందని భావిస్తున్నారు.

## పాలిటిక్స్ లోకి హైడ్రా రంగనాథ్.. పోటీ అక్కడి నుంచే..

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, పెన్ పవర్:**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరంలో చెరువులు.. కుంటలు.. నాలాల ఆక్రమణ లేకుండా హైడ్రా అనే వ్యవస్థను తెరమీదకు తీసుకొచ్చారు. దీనికి కమిషనర్ గా సీనియర్ ఐపీఎస్ అధికారి రంగనాథ్ ను నియమించారు.రంగనాథ్ కు ముక్కుసూటిగా పని చేస్తారు అనే పేరు ఉంది. పైగా ఆయన గతంలో తెలంగాణలో అనేక ప్రాంతాలలో పోలీసు ఉన్నతాధికారిగా పని చేశారు. అనేక కీలకమైన కేసులను సాల్వ్ చేశారు. భూ అక్రమలకు పాల్పడే వ్యక్తుల గుండెల్లో నిద్రపోయారు. అంతటి కేసీఆర్ కూడా వరంగల్ లాంటి నగరానికి కమిషనర్ పోలీస్ గా రంగనాథ్ ను నియమించారు.రంగనాథ్ ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మానస పుత్రిక హైడ్రాకు కమిషనర్ గా వ్యవహరిస్తున్నారు. అనేక చెరువులను రక్షించారు. కుంటలను బాగు చేశారు. నాలాలను పరిరక్షించారు. ఒక ముక్కలో చెప్పాలంటే విప్లవాత్మక విధానాలకు శ్రీకారం చుడుతున్నారు. కోర్టుల ద్వారా కొంతమంది వ్యక్తులు ఆయనకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నప్పటికీ.. రంగనాథ్ కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నుంచి బలమైన సపోర్టు లభిస్తుంది. ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పు సవాల్ చేస్తూ మళ్ళీ ప్రభుత్వం హైకోర్టులో వేరే బెంచ్ ను ఆశ్రయించడంతో రంగనాథ్ మీద వచ్చిన వ్యతిరేకత ఒక్కసారిగా పత్తా లేకుండా పోయింది.రంగనాథ్ గురించి ఇప్పుడు ఆసక్తికరమైన విషయం ఒకటి చర్చకు దారి తీస్తోంది. హైదరాబాద్ నగరంలో మున్నూరు కాపుల ఆత్మీయ సమ్మేళనానికి రంగనాథ్ హాజరయ్యారు. ఈ సమయంలో కూటమిలో ఉన్న నాయకులు మొత్తం హాజరు కావడం విశేషం. ఎంపీలు సానా సతీష్.. లక్ష్మణ్.. ఇంకా మున్నూరు కాపు సామాజిక వర్గంలో కీరకమైన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వంటి వారి హాజరయ్యారు. దానికి రంగనాథ కూడా హాజరయ్యారు. వాస్తవానికి కుల సంఘాల సమావేశాలకు.. ఇతర భేటీలకు రంగనాథ్ హాజరవుతూనే ఉంటారు. ఈ విషయంలో ఆయన మీద విమర్శలు ఉన్నప్పటికీ పట్టించుకోరు. అయితే కూటమిలో ఉన్న ఎంపీలు. ఇతర నాయకులు హాజరైన నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో రంగనాథ్ ఎంపీగా పోటీ చేస్తారని తెలుస్తోంది.ఏపీలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి ఆయన బరిలో ఉంటారని ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి పోలీసు అధికారులు రాజకీయ నాయకులుగా మారిన ఉదాహరణలు అనేక ఉన్నాయి. దీనికి రంగనాథ్ మినహాయింపు కాదు. పైగా రంగనాథ్ కు కూడా పొలిటికల్ లక్ష్యాలు ఉన్నాయని తెలుస్తోంది. ఈ ప్రకారం చేసుకుంటే

వచ్చే ఎన్నికల్లో కూటమి లో ఉన్న ఏదో ఒక పార్టీ నుంచి ఆయన పోటీ చేసే అవకాశం ఉంది. గతంలో ఆయన పవన్ కళ్యాణ్ ను కలిశారు. చిరంజీవి కుటుంబానికి అత్యంత ఆప్తుడిగా ముద్రపడ్డారు. ఈ నేపథ్యంలో జనసేనలో చేరి.. ఎంపీగా పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి తెలుస్తోంది. అయితే ఇది ప్రచారమేనా.. ఊహాగానామా అనేది త్వరలోనే తేలనుంది.

# 22ఏపై డైరక్ట్ ఫైట్..

**హైదరాబాద్, సెప్టెంబర్ 16, పెన్ పవర్:**




శాసనమండలి సమావేశాలు నిరవధికంగా వాయిదా పడినప్పటికీ.. శాసనసభను మాత్రం పొడిగించి, రిజిస్ట్రేషన్ చట్టంలోని సెక్షన్ 22ఏ అంశంపై స్వల్పకాలిక చర్చను కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించడం వెనుక కాంగ్రెస్ పక్కా రాజకీయ, వ్యూహాత్మక లెక్కలు ఉన్నట్లు స్పష్టమవుతోంది. సాధారణంగా ఒక సెషన్ ముగింపు దశకు చేరినప్పుడు ఉభయ సభలూ ఒకేసారి నిరవధికంగా వాయిదా పడటం ఆనవాయితీ. కానీ, అసెంబ్లీని ప్రత్యేకంగా కొనసాగించడం ద్వారా.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం భూ వివాదాలు, ధరణి చుట్టూ గత బీఆర్ఎస్ పాలనలో జరిగిన చీకటి ఒప్పందాలను అసెంబ్లీ రికార్డుల్లో అధికారికంగా నమోదు చేయించేందుకు ఒక భారీ రాజకీయ వేదికను సిద్ధం చేసుకుందని భావిస్తున్నారు.ఈ చర్చ కాంగ్రెస్ ప్రభుత్వానికి రెండు విధాలుగా కలిసివచ్చే అస్త్రం. మొదటిది.. అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులు సస్పెన్షన్‌కు గురికావడంతో, సభలో ప్రభుత్వ దూకుడును అడ్డుకునే లేదా ప్రతిపక్ష వాణిని బలంగా వినిపించే ప్రధాన ప్రతిపక్ష గొంతు లేకుండా పోయింది. స్పీకర్ వివాదం, అరెస్టులతో వచ్చిన రాజకీయ రగడను పక్కకునెట్టి.. ప్రజలతో నేరుగా ముడిపడి ఉన్న భూ సమస్యల వైపు ప్రజా దృష్టిని మళ్లించేందుకు ఇది అద్భుతమైన అవకాశం. తెలంగాణ సమాజంలో ధరణి పోర్టల్, సెక్షన్ 22ఏ కింద లక్షలాది ఎకరాల పట్టా భూములు నిషేధిత జాబితాలో చిక్కుకుపోయి రైతులు, మధ్యతరగతి ప్రజలు పడిన వేదన అంతా ఇంతా కాదు. ఈ సున్నితమైన అంశంపై రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా వివరాలు బహిర్గతం చేస్తే, అది ప్రజల్లో బీఆర్ఎస్‌పై ఉన్న పాత వ్యతిరేకతను మళ్లీ తాజా పరుస్తుందన్నది ప్రభుత్వ వ్యూహం.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని జరిగిన భూ బదలాయింపులు, హైదరాబాద్ శివార్లతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో విలువైన అసైన్డ్, ఇనాం, వక్ఫ్, దేవాదాయ భూములను సెక్షన్ 22ఏ నుంచి ఎలా తప్పించారు? వాటిని ఎవరి బినామీలకు కట్టబెట్టారు? అన్న రికార్డులను రేవంత్ రెడ్డి సభ ముందు ఉంచే అవకాశాలు మెండుగా ఉన్నాయి. గతంలో ధరణి వ్యవహారాలను నడిపిన ఒకరిద్దరు ఉన్నతాధికారులు, కీలక నేతల కనుసన్నల్లోనే వేల కోట్ల విలువైన భూముల నిషేధాలను ఎత్తివేశారనే ఆరోపణలు ఉన్నాయి. వాటికి సంబంధించిన సర్వే నంబర్లు, రికార్డుల సవరణ తేదీలు, అక్రమ రిజిస్ట్రేషన్ల ఫైళ్లను స్వయంగా ముఖ్యమంత్రి అసెంబ్లీలో ప్రవేశపెట్టి ధరణి బండారాన్ని బట్టబయలు చేయనున్నారన్న ప్రచారం జరుగుతోంది.అదే సమయంలో, కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న భూ భారతి వ్యవస్థ ద్వారా తాము ఆ సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నామో ప్రజలకు వివరించడం రేవంత్ రెడ్డి లక్ష్యం. నిషేధిత జాబితాలో అన్యాయంగా చిక్కుకుపోయిన నిజమైన రైతుల భూములను విముక్తి చేసేందుకు విధివిధానాలను, కలెక్టర్లకు ఇచ్చిన అధికారాలను వివరిస్తూ.. తాము పరిష్కారకర్తలు అనే ఇమేజ్‌ను సొంతం చేసుకోవాలని చూస్తున్నారు. మండలిని పక్కనపెట్టి అసెంబ్లీలో 22ఏ చర్చను కొనసాగించడం అనేది బీఆర్ఎస్‌ను పూర్తిగా డిఫెన్స్‌లోకి నెట్టే పక్కా పొలిటికల్ చెక్‌మేట్. స్పీకర్ నిరసనలతో మైలేజ్ సాధించాలనుకున్న గులాబీ పార్టీకి, అసెంబ్లీ సాక్షిగా 'ధరణి స్కామ్' రూపంలో ఎదురుదెబ్బ కొట్టేందుకు రేవంత్ రెడ్డి రంగం సిద్ధం చేశారు.

# ఎవరీ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్

**హైదరాబాద్ సెప్టెంబర్ 16, పెన్ పవర్:** ఆగాఖాన్ 5 తెలంగాణ పర్యటన రాష్ట్ర అభివృద్ధి ముఖచిత్రంలో ఒక కీలక మైలురాయిగా నిలిచింది. హైదరాబాద్ పర్యటనకు విచ్చేసిన ఆయనకు తెలంగాణ ప్రభుత్వం ఘన స్వాగతం పలికింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా చారిత్రక ఫలక్‌నుమా ప్యాలెస్‌కు వెళ్లి ప్రిన్స్ రహీమ్‌తో సమావేశమయ్యారు. తెలంగాణను అంతర్జాతీయ స్థాయి పెట్టుబడుల కేంద్రంగా నిలిపే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహించనున్న 'తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'కు ముఖ్య అతిథిగా హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు. మరోవైపు, తెలంగాణ గవర్నర్ సైతం ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ అందిస్తున్న సేవలను కొనియాడుతూ, రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.5 కోట్ల మందికి పైగా ఉన్న షియా ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక గురువుకు ఇచ్చే వంశపారంపర్య గౌరవ నామమే 'ఆగా ఖాన్'. ప్రవక్త ముహమ్మద్ వారసత్వ పరంపరలో ఇస్మాయిలీ ఇమామ్‌ల నాయకత్వం కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్ 5 ఈ ప్రతిష్టాత్మక బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రపంచ వేదికలపై పేదరిక నిర్మూలన, విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ, చారిత్రక కట్టడాల సంరక్షణలో తన వంశ ప్రతిష్టను చాటుతున్నారు.ఆగా ఖాన్ డెవలప్‌మెంట్ నెట్‌వర్క్ అనేది లాభాపేక్ష లేని ప్రపంచంలోనే అతిపెద్ద ప్రైవేట్ అంతర్జాతీయ అభివృద్ధి సంస్థల్లో ఒకటి. మతం, కులం, జాతితో సంబంధం లేకుండా నిరుపేదలు, అణగారిన

వర్గాల జీవన ప్రమాణాలను పెంచడమే దీని ప్రధాన లక్ష్యం. అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలు, పరిశోధనా కేంద్రాలు, నాణ్యమైన ఆసుపత్రుల నిర్వహిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో మైక్రోఫైనాన్స్, పర్యావరణ అనుకూల మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. ఆగా ఖాన్ ట్రస్ట్ ఫర్ కల్చర్ ద్వారా ప్రపంచ ప్రఖ్యాత చారిత్రక కట్టడాలు, హెరిటేజ్ ప్రదేశాల పునరుద్ధరణ చేపట్టింది.హైదరాబాద్ నగరంతో ఈ సంస్థకు దశాబ్దాల బంధం ఉంది. కుతుబ్ షాహీ సమాధుల పునరుద్ధరణ ప్రాజెక్టును అత్యంత శాస్త్రీయంగా చేపట్టి, ప్రపంచ స్థాయి వారసత్వ సంపదగా తీర్చిదిద్దడంలో ఆగా ఖాన్ ట్రస్ట్ కీలక పాత్ర పోషించింది. అలాగే శంషాబాద్ సమీపంలో ఏర్పాటైన 'ఆగా ఖాన్ అకాడమీ' ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందుతోంది.


తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం సాంప్రదాయ పారిశ్రామిక అభివృద్ధి మాత్రమే కాకుండా సుస్థిర అభివృద్ధి, హెరిటేజ్ టూరిజం, సామాజిక మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో భాగస్వామ్యం రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తుందని భావిస్తోంది. ఆగా ఖాన్ సంస్థలతో అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు, పరస్పర సహకార వేదికలు 'తెలంగాణ

గ్లోబల్ సమ్మిట్'కు అంతర్జాతీయ విశ్వసనీయతను తెస్తాయి. హైదరాబాద్‌లోని చారిత్రక కట్టడాల పరిరక్షణ, మూసీ నది పునరుజ్జీవనం, అర్బన్ ప్లానింగ్ వంటి ప్రాజెక్టుల్లో ఆగాఖాన్ అనుభవాన్ని ప్రభుత్వం వినియోగించుకోవచ్చు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలన, నాణ్యమైన విద్య, ఆరోగ్య రంగాల్లో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాలకు ఇది బాటలు వేస్తుంది. వాతావరణ మార్పులను తట్టుకునే సుస్థిర పట్టణాభివృద్ధి విధానాల్లో సాంకేతిక సహకారం లభిస్తుంది. అందుకే ఆగాఖాన్ ఫౌండేషన్ తో తెలంగాణ బలమైన బంధాన్ని కోరుకుంటోంది.

# మంత్రి పదవుల కోసం మతం మార్చుకున్నారు!! - విజయసాయిరెడ్డి సంచలన ఆరోపణలు

**హైదరాబాద్ పెన్ పవర్:** విపక్షం వైసీపీని లక్ష్యంగా చేసుకుని మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి చేస్తున్న ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశం అవుతున్నాయి. కొత్త రాజకీయ పార్టీ పెడతానని కొన్నిరోజులుగా చెబుతున్న విజయసాయిరెడ్డి సమయం, సందర్భం లేకుండా విపక్షంపై ఘాటు విమర్శలతో విరుచుకుపడుతుండటం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. కొత్త పార్టీ ప్రారంభిస్తానని గతంలో ప్రకటించిన సందర్భంలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిపై మత మార్పిడి ఆరోపణలు చేసిన విజయసాయిరెడ్డి తాజాగా రెండేళ్ల క్రితం నాటి ఒక వీడియోను షేర్ చేశారు. వైసీపీలో ఎమ్మెల్యే, మంత్రి పదవులు పొందాలంటే జగన్ ను ఆకట్టుకునేందుకు మతం మార్చుకోవాల్సివచ్చేదని ఆరోపించడమే కాకుండా, ఇలా ఎంతోమంది మార్చుకున్నారో వైసీపీలో నెంబర్ వన్ చెప్పాలంటూ పోస్టు పెట్టారు.రెండేళ్ల క్రితం ఏపీ అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారపురెడ్డి చంద్రశేఖరరెడ్డి ప్రసంగించిన వీడియోను విజయసాయిరెడ్డి తాజాగా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశారు. "వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఒక మాజీ, సీనియర్ ఎమ్మెల్యే 2024 ఎన్నికల ముందు చేసిన ఈ ప్రసంగంపై రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలు తమ అభిప్రాయం తెలియజేయాలి" అంటూ కోరారు. అంతేకాకుండా "గతంలో ఎంతమంది నాయకులు తమ ఎమ్మెల్యే టికెట్ల కోసం, ఆ తర్వాత ప్రభుత్వంలో మంత్రి పదవుల కోసం జగన్ గారిని ఆకట్టుకునేందుకు మతం మార్చుకున్నారో ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్‌లో నంబర్ వన్ సమాధానం చెప్పాలని కోరుతున్నా." అంటూ రాశారు.

ఉన్నట్టుండి విజయసాయిరెడ్డి చేసిన ఈ పోస్టు రాష్ట్ర రాజకీయాల్లో విస్తృత చర్చకు దారితీస్తోంది. సహజంగా రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలకు తగిన సమయం సందర్భం ఉంటుందని, కానీ ఇప్పుడు ఎలాంటి చర్చ లేని మత మార్పిడుల అంశాన్ని విజయసాయిరెడ్డి తెరపైకి తేవడం వెనుక ఆయన ఉద్దేశం ఏమైవుంటుందో అర్థం కావడం లేదని



పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. రాజకీయ పార్టీ పెట్టాలని భావిస్తున్న విజయసాయిరెడ్డి విపక్షంలో ఉన్న వైసీపీ స్థానంలో ఎదగాలని భావించడంలో తప్పు లేదని, కానీ ఎప్పటిదో వీడియోను బయటకు తీసి ఇప్పుడు వివిధ రాజకీయ పార్టీల అభిప్రాయం చెప్పాలంటూ నిలదీయడమే ఆశ్చర్యంగా ఉందని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.వైసీపీలో తనకు అన్యాయం జరిగిందని ఆరోపణలు చేస్తున్న విజయసాయిరెడ్డి ఆ పార్టీని అధినేత జగన్మోహనరెడ్డిని రాజకీయంగా దెబ్బతీయాలనే వ్యూహంతో ఇటువంటి పోస్టులు చేస్తున్నారని వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. పాత వీడియోలు బయటకు తీసి కావాల్సిన విధంగా ఎడిటింగ్ చేసుకుని వైరల్ చేయాలని చేయాలని భావించడం కరెక్టు కాదని అంటున్నారు. అదే సమయంలో ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శలు చేస్తున్నారు. తన స్థానంలో పార్టీలో ఎదిగిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని చూసి ఓర్వలేకే విజయసాయిరెడ్డి ఇటువంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైసీపీ నేతలు మండిపడుతున్నారు.

ఇదే సమయంలో విజయసాయిరెడ్డి విమర్శలను అధికార పార్టీ హైలెట్ చేస్తోందని అంటున్నారు. కొద్దిరోజుల క్రితం వైసీపీకి చెందిన జోగి రమేష్ కుటుంబం మతం మార్చుకుందన్న విషయం వెలుగు చూడగా, మంత్రి పదవి కోసమే ఆయన మత మార్పిడి జరిగిందని ప్రత్యర్థులు ప్రచారం చేశారు. ఇప్పుడు ఆ ప్రచారానికి బలం చేకూర్చేలా విజయసాయిరెడ్డి ప్రశ్నలు సంధిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు రాస్తుండటం ద్వారా ఒక వ్యూహం ప్రకారం వైసీపీ వ్యతిరేక రాజకీయాలు చేస్తున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

# జగన్ రాజకీయం చెయ్...సీనియర్లు కోరేది ఇదేనా ?

**హైదరాబాద్ పెన్ పవర్:** అదేంటి జగన్ రాజకీయాల్లోనే కదా ఉన్నది, మళ్లీ ఇదేమిటి అన్న సందేహం రావచ్చు. అయితే జగన్ రాజకీయాల్లో ఉన్నా కూడా పక్కా వ్యూహాలతో ఎత్తుగడలతో రాజకీయం చేయాల్సిన అవసరం ఉంది అన్నదే సీనియర్ల మాట. వైసీపీ విషయం తీసుకుంటే జగన్ అధినేతగా ఉన్నారు. ఇక పార్టీ దైనందిన వ్యవహారాలు చూసేందుకు పార్టీ నుంచి వెళ్ళిపోయిన విజయసాయిరెడ్డి లాంటి వారు చెప్పే కోటరీ ఒకటి ఉందని అంటున్నారు. అన్ని విషయాలను సజ్జల రామక్రిష్ణారెడ్డి వంటి వారే చూసుకుంటున్నారు అని అంటున్నారు. ఇక జిల్లాల విషయానికి వచ్చేసరికి రీజనల్ కో ఆర్డినేటర్లను మూడేసి జిల్లాలకు నియమించారు. వారు అక్కడి విషయాలను పర్యవేక్షిస్తారు. ఇలా కొందరు సీనియర్ నేతల చేతిలో పార్టీని పెట్టేసినట్లుగా ఉందని అంటున్నారు. అక్కడ వారు ఏమి చెబితే అదే జరుగుతోందని అంటున్నారు. దాంతో జగన్ మీద వైసీపీ మీద అభిమానం ఉన్న వారు కూడా వైసీపీలో కొనసాగే పరిస్థితులు లేకుండా పోతున్నాయని అంటున్నారు.

**నేరుగా అనుసంధానం :**

అధినాయకుడు పార్టీ నాయకులకు ఎల్ల వేళలా అందుబాటులో ఉండాలని కోరుకుంటారు. అలాగే పార్టీలో ఎక్కడ ఏమి జరుగుతుంది అన్నది కూడా ఆయన గమనిస్తూ ఉండాలని అంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలి అంటే ఫస్ట్ హ్యాండ్ ఇన్ఫర్మేషన్ నాయకుడి చెవికి చేరాలి. అయితే వైసీపీలో ఆ పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. ఎన్నో అంచెలను వైసీపీలో ఏర్పాటు చేశారు. వాటిని దాటుకుని జగన్ ని చేరడం కష్టం అవుతోంది అని అంటున్నారు. అధికారంలో ఉన్నపుడు కూడా జగన్ అపాయింట్మెంట్ చాలా మంది పెద్దలకే దొరకడం కష్టంగా మారింది అని చెబుతారు. ఇప్పుడు ఓడిన తరువాత కూడా అంతే అన్నట్లుగా ఉందని గుర్తు చేస్తున్నారు.

**పార్టీని నమ్ముకుని :**

ఒక రాజకీయ పార్టీని ఎవరైనా స్థాపించవచ్చు. అయితే ఆ పార్టీని నమ్ముకుని ఎంతో మంది చేరుతారు. వారి ఆకాంక్షలు అన్నీ కూడా పార్టీ అధినాయకత్వం పార్టీ నడిపే తీరుని బట్టే నెరవేరే అవకాశం ఉంది. అందరి అభిప్రాయాలను తెలుసుకుంటూ ఆమోదయోగ్యమైన తీరులో పార్టీని నడిపితేనే మంచి ఫలితాలు వస్తాయని చెబుతున్నారు. పార్టీ తీరుని



మార్చుకునేందుకు నిరంతరం సమీక్షలు కూడా అవసరం అని అంటున్నారు. ఇదిలా ఉంటే వర్గ పోరు ప్రతీ జిల్లాలో ప్రతీ నియోజకవర్గంలో ఉంది. దాంతో వైసీపీ బలంగా ఉన్న చోట కూడా వీక్ అయిపోతోంది అని అంటున్నారు.

**అధినాయకత్వం జోక్యంతో :**

శ్రీకాకుళం జిల్లాలో చూస్తే ధర్మాన సోదరులే జిల్లా పార్టీ మీద మొత్తం పెత్తనం చేస్తున్నారు అని తమ్మినేని సీతారాం కుమారుడు చిరంజీవి నాగ్ ఆరోపిస్తున్నారు. ఈ ధోరణి మంచిది కాదని ఆయన అంటున్నారు. ఇలా రెండు కీలక వర్గాలు రెండు సామాజిక వర్గాల మధ్య వైసీపీ జిల్లాలో చీలిపోయి అవస్థలు పడుతోంది. వైసీపీ అధినాయకత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉంది కదా అని అంటున్నారు.విజయనగరం జిల్లాలో కూడా అసంతృప్తి తారస్థాయికి చేరిన మీదటనే చిన్న శ్రీను పార్టీని వీడారని గుర్తు చేస్తున్నారు. ఇపుడు శ్రీకాకుళంతో పాటు అనేక జిల్లాలలో ఇదే రకమైన వాతావరణం ఉందని అంటున్నారు.

**రాజకీయమే చేయాలి :**

రాజకీయం అనేది ఒక క్రీడ. ఇక్కడ ఎవరికి నచ్చినట్లుగా వారు ఆడడానికి లేదు. ఈ ఆటకు సిద్ధపడితే ప్రత్యర్థి వ్యూహాలను ఎత్తులను గమనించి దానికి తగినట్లుగా పై ఎత్తులు వేయాలి. అంతే స్థాయిలో రాజకీయం చేయాలి. అలా కాదు అని మడి కట్టుకుని కూర్చుంటే రాజకీయం ఎప్పటికీ పండదని అంటున్నారు. తాజాగా మాజీ మంత్రి కొడాలి నాని కూడా జగన్ విషయంలో మాట్లాడుతూ ఆయన రాజకీయ నాయకుడు కారు అనేశారు. తన తండ్రి ఆశయ సాధన కోసం పార్టీ పెట్టుకుని నడుపుతున్నారని చెప్పారు. అలా అనుకుంటే వైసీపీ రాజకీయ క్షేత్రంలో ప్రత్యర్థి వేసే ఎత్తులకు చిత్తు అవుతూనే ఉంటుంది అన్నది కూడా సీనియర్ల మాటగా ఉంది. జగన్ తీరు మారాలని అంటున్నారు. ముల్లుని ముల్లుతోనే కోయాలి అన్నట్లుగా ఏపీలో రాజకీయానికి తగిన విధంగా వైసీపీ కూడా ధీటుగా స్పందించాలని కోరుతున్నారు.

# కాంగ్రెస్ కు లైఫ్ వచ్చేనా

**విజయవాడ సెప్టెంబర్ 16, పెన్ పవర్:**

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో మరోసారి అధిష్ఠానం ఇన్‌ఛార్జ్‌ల మార్పు ప్రక్రియను పూర్తి చేసింది. శరవేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాల నడుమ, మాణిక్యం ఠాగూర్ స్థానంలో కర్ణాటకకు చెందిన సీనియర్ నేత పీసీ మోహన్‌ను ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా ఏఐసీసీ నియమించింది. అయితే, 2014 రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ ఘోరంగా పడిపోయిన విషయాన్ని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. పునాదులు కదిలిపోయిన చోట కేవలం పర్యవేక్షకులను, ఇన్‌ఛార్జ్‌లను మార్చడం వల్ల పార్టీకి కొత్త ఊపిరి వస్తుందా అంటే.. ప్రయోజనం శూన్యమనే సమాధానమే వస్తోంది. ఏపీ విభజనకు ముందు కాంగ్రెస్ పార్టీకి అత్యంత బలమైన కోర్ ఓట్ బ్యాంక్ ఉండేది. ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలు , దివంగత వైఎస్ రాజశేఖర రెడ్డి అభిమానులు కాంగ్రెస్‌కు వెన్నెముకగా నిలిచారు. కానీ, విభజన పర్యవసానాలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోగా.. ఆ సాంప్రదాయ ఓటు బ్యాంక్ మొత్తాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన ఖాతాలోకి మళ్లించుకుంది. గత పదేళ్లుగా వైఎస్సార్‌సీపీకి అదే ప్రధానమైన బలంగా మారింది. కాంగ్రెస్ పునర్వైభవం సాధించాలంటే ఆ కోల్పోయిన పునాదిని మళ్లీ దక్కించుకోవడం ఒక్కటే మార్గం, కానీ ఆ దిశగా పార్టీ కేంద్ర నాయకత్వం సీరియస్ ప్రయత్నాలు చేయడంలో పూర్తిగా విఫలమవుతోందనే విమర్శలు ఉన్నాయి.రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి స్పష్టమైన క్షేత్రస్థాయి వ్యూహం లేకపోవడమే అతిపెద్ద బలహీనత. కేవలం ఎన్నికలు వచ్చినప్పుడు లేదా అసెంబ్లీ వేళల్లో ప్రెస్ మీట్లు పెట్టడం, సోషల్ మీడియా వేదికగా విమర్శలు చేయడానికే రాష్ట్ర నాయకత్వం పరిమితమవుతోంది. వైఎస్ షర్మిలకు ఏపీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన తర్వాత కొంతవరకు మీడియా మైలేజ్, క్యాడర్‌లో కొంత చలనం వచ్చినా.. అది ఓట్ల రూపంలోకి లేదా వైఎస్సార్‌సీపీ కోర్ ఓటు బ్యాంకును ఆకర్షించే స్థాయిలోకి మారలేదు. అసలైన జనాకర్షక నేతలు, క్షేత్రస్థాయిలో బలం ఉన్న స్థానిక నాయకత్వం లేకపోవడం వల్ల పార్టీ విస్తరణ ఆగిపోయింది. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌కు, రాష్ట్ర స్థాయిలో వైఎస్సార్‌సీపీకి ఉన్న ఓటు బ్యాంకు స్వరూపం ఒకటే. కానీ ఏపీలో వైఎస్ఆర్‌సీపీని విమర్శించే క్రమంలో కాంగ్రెస్ పార్టీ టీడీపీ–బీజేపీ–జనసేన కూటమికి అనుకూలంగా ఉందనే భావన సాధారణ ప్రజల్లోకి వెళ్తోంది. ప్రత్యేకించి బీజేపీతో టీడీపీ పొత్తులో ఉన్న తరుణంలో, బీజేపీ వ్యతిరేక ఓటు బ్యాంకును తమవైపు తిప్పుకునేందుకు కాంగ్రెస్‌కు మంచి అవకాశం ఉన్నప్పటికీ, కూటమి వైఫల్యాలపై ధ్వజమెత్తడంలో కాంగ్రెస్ వైఖరి స్పష్టంగా ఉండటం లేదనే విమర్శ ఉంది. ఈ వ్యూహాత్మక అయోమయం వల్ల మైనారిటీ, దళిత వర్గాలు కాంగ్రెస్ వైపు చూడటానికి వెనుకాడుతున్నాయి.కర్ణాటకకు చెందిన పీసీ మోహన్ నాయకత్వంలోనైనా ఏపీ కాంగ్రెస్ రూట్ మ్యాప్ మారుతుందా అన్నది ఇప్పుడు సవాలు. కర్ణాటకలో కాంగ్రెస్ సాధించిన విజయం, అక్కడ అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాల మోడల్‌ను ఏపీ ప్రజల్లోకి తీసుకెళ్లడం మోహన్‌కు కొంతవరకు కలిసివచ్చే అంశం. అయితే, కేవలం విజయవాడ లేదా అమరావతిలోని పార్టీ కార్యాలయాల్లో సమీక్షలు నిర్వహించడానికే ప్రాధాన్యత ఇస్తే ఎలాంటి ఫలితం ఉండదు. బూత్ స్థాయి నుంచి కమిటీలను పునర్నిర్మించడం, కూటమి ప్రభుత్వం , ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ రెండింటికీ సమదూరం పాటిస్తూ సొంత అజెండాతో ప్రజల్లోకి వెళ్లడం తక్షణ అవసరం. రూట్ లెవల్‌లో నాయకత్వాన్ని తయారు చేయకుండా, డివైడ్ అయిన సాంప్రదాయ ఓటు బ్యాంకును ఆకట్టుకునేలా స్పష్టమైన ఆర్థిక–సామాజిక విధాన ప్రకటనలు చేయకుండా.. ఇన్‌ఛార్జ్‌లను ఎంతమందిని మార్చినా ఏపీలో కాంగ్రెస్ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మిగిలిపోతుంది. కొత్తగా వచ్చిన పీసీ మోహన్ అయినా కేవలం ఢిల్లీ మార్గదర్శకాలను అమలు చేసే ప్రతినిధిగా మిగలకుండా, ఏపీ కాంగ్రెస్‌కు కొత్త శ్వాస ఊదేలా కఠిన నిర్ణయాలు తీసుకుంటారో లేదో వేచి చూడాలి.

## అడ్డగోలు విద్యా సంస్థలపై యాక్షన్ షురూ

**గుంటూరు, సెప్టెంబర్ 16, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో ఉద్యోగ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులను పావులుగా వాడుకుంటూ ప్రభుత్వంపై బురదజల్లేందుకు యత్నిస్తున్న కొన్ని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పి, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేయాల్సిన సంస్థలు రాజకీయ ప్రయోజనాల కోసం విద్యార్థులను రోడ్లపైకి ఎక్కించి ఆందోళనలు, నిరసనలు చేయిస్తుండటంపై ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇలాంటి అవాంఛనీయ చర్యలకు పాల్పడుతున్న నిర్వాహకులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.పోటీ పరీక్షల అభ్యర్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఇప్పటికే తెచ్చిన ఆంధ్రప్రదేశ్ కోచింగ్ సంస్థల నియంత్రణ నిబంధనలు 2026 , జీవో నెంబర్ 9 మార్గదర్శకాలకు అనుగుణంగానే ప్రతి ప్రైవేటు కోచింగ్ సెంటర్ నడుచుకోవాల్సి ఉంటుంది. అయితే, నిబంధనలను బేఖాతరు చేస్తూ కొన్ని సంస్థల యజమానులు తెరవెనుక రాజకీయ వ్యవహారాలు నడుపుతున్నట్లు నిఘా వర్గాల పరిశీలనలో తేలింది. సంస్థలలో చేరిన అభ్యర్థులపై మానసిక ఒత్తిడి తెచ్చి, వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేలా ప్రేరేపిస్తున్నారని సీఎం దృష్టికి వచ్చింది.కొన్ని కోచింగ్ సెంటర్ల నిర్వాహకులు స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అభ్యర్థులను ఉద్దేశపూర్వకంగా ఆందోళనలకు పురిగొల్పుతున్నారని ప్రభుత్వం తేల్చింది. కెరీర్ నిర్మించుకోవాల్సిన అమూల్యమైన సమయంలో విద్యార్థులను రాజకీయ ప్రేరేపిత నిరసనల్లో భాగస్వాములను చేయడం తీవ్రమైన నేరమని ప్రభుత్వం హెచ్చరించింది. నిబంధనలను ఉల్లంఘించి విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే సంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.విద్యార్థులు, నిరుద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా కట్టుబడి ఉందని, వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అయితే ప్రైవేటు కోచింగ్ సెంటర్ల ముసుగులో రాజకీయ కుట్రలు పన్నుతూ వ్యవస్థలను అస్థిరపరచాలని చూస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పింది. నిబంధనల పరిధిలోనే సంస్థలు కార్యకలాపాలు సాగించాలని, విద్యా వాతావరణాన్ని దెబ్బతీసే ప్రయత్నాలను ఉక్కుపాదంతో అణచివేస్తామని హెచ్చరించింది.

## లోకల్ ఎన్నికల కోసం రిజర్వేషన్ వివాదం

**తిరుపతి, సెప్టెంబర్ 16, పెన్ పవర్:** జీవో జారీ చేసినా ఏపీలో లోకల్ బాడీ ఎన్నికలు జరగవు.. బీసీలకు ఇచ్చిన 34 శాతం రిజర్వేషన్లను కోర్టు కొట్టేస్తుంది, ఆ తర్వాత నెపాన్ని న్యాయస్థానాలపైకి నెట్టి ప్రభుత్వం నాటకాడుతుంది అని వైఎస్ఆర్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆరోపణలు గుప్పిస్తున్నారు. మరోవైపు, ఎన్ని న్యాయపరమైన అడ్డంకులు వచ్చినా బీసీలకు 34 శాతం కోటా అమలు చేసి తీరుతాం అని టీడీపీ నాయకత్వం స్పష్టం చేస్తూ 'జయహో బీసీ' సభల ద్వారా తమ బీసీ ఓటు బ్యాంక్‌ను పటిష్టం చేసుకునే పనిలో పడింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్ వివాదం ఏమిటి? చంద్రబాబు సవాలు వెనుక ఉన్న రాజకీయ వ్యూహమేంటి? స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జీవోలు విడుదల చేసింది. అయితే, సుప్రీంకోర్టు గతంలో పలు తీర్పుల్లో.. ఎస్సీ, ఎస్టీ, బీసీల స్థానిక సంస్థల రిజర్వేషన్ల మొత్తం శాతాన్ని 50 శాతం పరిమితి దాటకూడదని స్పష్టమైన గీత గీసింది. ప్రస్తుతం ఏపీలో ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6% రిజర్వేషన్లు ఉన్నందున, బీసీలకు 34% ఇస్తే మొత్తం రిజర్వేషన్లు 55% నుండి 61% వరకు చేరుకుంటాయి. 2019లో కూడా అప్పటి ప్రభుత్వం 34% ఇస్తే హైకోర్టు , సుప్రీంకోర్టులు దాన్ని కొట్టివేశాయి. దీనివల్ల రిజర్వేషన్లు 50% దాటితే న్యాయపరంగా మళ్లీ చిక్కులు వస్తాయన్నది జగన్ వాదనకు ప్రాతిపదిక.చంద్రబాబు నాయుడు అనుభవజ్ఞుడైన నాయకుడు. కోర్టు తీర్పుల పరిమితి ఆయనకు తెలియనిది కాదు. అయినా 34% జీవో ఇవ్వడం వెనుక మూడు ప్రధాన కారణాలు ఉన్నాయి. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు 34% రిజర్వేషన్లు ఇస్తామని కూటమి హామీ ఇచ్చింది. ప్రభుత్వం తమ వైపు నుంచి 34% అమలుకు సిద్ధపడింది అన్న సందేశాన్ని ప్రజలకు ఇవ్వడం. ఒకవేళ కోర్టు దీనిని అడ్డుకుంటే, మేము ఇవ్వాలనుకున్నాం కానీ న్యాయస్థానాల పరిమితుల వల్ల కుదరలేదు అని చెప్పి బీసీల్లో సానుభూతి సాధించడం. సీలు టీడీపీకి సాంప్రదాయ వెన్నెముక. జీవో ఇవ్వడం, సభలు నిర్వహించడం ద్వారా తమ ప్రభుత్వం బీసీల పక్షపాతి అని బలంగా స్థాపించడంవైఎస్ జగన్ విమర్శలు కేవలం న్యాయ సూత్రాల గురించే కావు. దాని వెనుక స్పష్టమైన ప్రతిపక్ష వ్యూహం దాగి ఉంది. 2019–2024 మధ్య వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం 50% పరిమితికి లోబడి బీసీ రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించి ఎన్నికలు నిర్వహించింది. అప్పట్లో టీడీపీ దీనిని బీసీల నోళ్లు కొట్టారు అని విమర్శించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం 34% జీవో ఇస్తే, తాము గతంలో చేసింది కోర్టు నిబంధనల కోసమేనని నిరూపించుకోవాల్సిన అవసరం జగన్‌కు వచ్చింది. అలాగే, రిజర్వేషన్ల వివాదం వల్ల ఎన్నికలు ఆలస్యమైతే, కూటమి ప్రభుత్వం ఎన్నికల నుంచి పారిపోతోందని ప్రజల్లోకి తీసుకెళ్లాలనేది వైఎస్ఆర్‌సీపీ ఆలోచన.న్యాయ కోణం నుంచి చూస్తే, ఎంపిక చేసిన ప్రాతిపదికన ఎంపిరికల్ డేటా అంటే సామాజిక, ఆర్థిక సర్వే డేటా ఆధారంగా బీసీల వెనుకబాటుతనాన్ని నిరూపిస్తే తప్ప 50% సీలింగ్ దాటడం సాధ్యం కాదు. ఈ విషయంపై ఏపీ హైకోర్టు కూడా ప్రభుత్వం వైపు నుంచి ఆధారాలను, ఎంపిరికల్ డేటాను కోరింది. ప్రత్యేక కమిషన్ల నివేదికలు లేకుండా జీవో ఆధారంగా 50% మించి రిజర్వేషన్లు ఇస్తే, గతం తరహాలోనే న్యాయస్థానాలు దానిని నిలిపివేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఏపీ స్థానిక పోరులో బీసీ రిజర్వేషన్ల అంశం చట్టపరమైన సవాలు కంటే రాజకీయ అస్త్రంగా ఎక్కువ ఉపయోగపడుతోంది. 34% కోటాను దక్కించుకోవడం ద్వారా బీసీల గుండెల్లో చెరగని ముద్ర వేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తుంటే.. ఇది సాధ్యం కాని రాజకీయ గిమ్మిక్ అని తేల్చిచెప్పడం ద్వారా టీడీపీ–బీజేపీ–జనసేనల ఇమేజ్‌ను దెబ్బతీయాలని వైఎస్ఆర్‌సీపీ చూస్తోంది. అంతిమంగా, కోర్టు ఇచ్చే తీర్పు స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను నిర్ణయించడమే కాకుండా, రాబోయే రోజుల్లో ఏపీ రాజకీయాల్లో బీసీ ఓటు బ్యాంక్ ఎటువైపు మొగ్గుతుందో స్పష్టం చేయనుంది.

## ఆరోపణలు... ప్రత్యారోపణలు డీఎస్సీకి కథ ముగింపు ఎప్పుడు

**విజయవాడ సెప్టెంబర్ 16, పెన్ పవర్:** ఏపీ ప్రభుత్వం ఎంత ఓపికగా, పారదర్శకంగా వివరణలిస్తున్న కొద్దీ.. వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి వర్గం ఉద్దేశపూర్వకంగానే నిరాధార ఆరోపణల రాళ్లు విసురుతోంది. ప్రభుత్వం ఇస్తున్న ప్రతి సమాచారానికి వాస్తవాలతో కూడిన రివర్స్ కౌంటర్లు వస్తున్నాయని, తాము లేవనెత్తుతున్న అంశాలన్నీ గాల్లో దీపాలేనని ఆ పార్టీ నాయకులకు కూడా బాగా తెలుసు. అయినప్పటికీ ప్రజల్లో ఏదో ఒక అభూతకల్పనను నిరంతరం సజీవంగా ఉంచాలనే దుర్బుద్ధితో జగన్ రెడ్డి అండ్ కో ఈ తప్పుడు ప్రచారాలను నిరంతరం కొనసాగిస్తూనే ఉంది. కేవలం తమ అబద్ధాలను పదే పదే ప్రచారం చేసుకుంటూ కాలం వెళ్లదీయడమే లక్ష్యం.ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన రాకపోతే తాము ఆడే డ్రామాలే నిజమని జనం నమ్ముతారనే భయంతో, ప్రభుత్వం ప్రతి చిన్న అంశానికీ ఆధారాలతో సహా వివరంగా సమాధానమిస్తోంది. అయితే దీన్ని తమకు అనుకూలంగా మలుచుకుంటున్న వైసీపీ, అదే అలుసుగా తీసుకుని ప్రతి దానిని డీఎస్సీ స్కాం అంటూ ప్రజల మైండ్‌లో రుద్దడానికి సర్వశక్తులూ ఒడ్డుతోంది. ప్రజా సమస్యలపై సద్విమర్శలు చేయడం మానేసి, కేవలం నిరుద్యోగుల ఆశలతో ఆడుకునేలా నిత్యం ఏదో ఒక వివాదాన్ని రగిలించడమే ఏకైక అజెండాగా మార్చుకుంది.ఈ కుట్రపూరిత ప్రచారంలో భాగంగా మొదట పేపర్ లీక్ అంటూ నానా హంగామా సృష్టించారు; కానీ అది ఎక్కడా నిలవకపోవడంతో వెంటనే యూటర్న్ తీసుకుని ఒకే కులానికి చెందినవారికి ఉద్యోగాలొచ్చాయంటూ' విషం చిమ్మారు. ఆ విమర్శ కూడా పటాపంచలు కావడంతో, ఇప్పుడు ఏకంగా స్పోర్ట్స్ కోటా అంశాన్ని పట్టుకుని వేలాడుతున్నారు. అసలు ఖోఖో కూడా ఒక ఆట కింద లెక్కేనా అంటూ జగన్ రెడ్డి స్వయంగా ఎద్దేవా చేయడం, క్రీడాకారుల ప్రతిభను కించపరిచేలా మాట్లాడటం చూస్తుంటే.. వినేవాళ్లు నవాబుల కాలం నాటి ఈ జోకులను ఎందుకు సీరియస్‌గా తీసుకోవాలో అర్థం కాని దుస్థితి ఏర్పడింది. కేవలం తమ రాజకీయ మనుగడ కోసం రాష్ట్రంలోని క్రీడాకారుల భవిష్యత్తును, పారదర్శకంగా భర్తీయవుతున్న ఉపాధ్యాయ నియామకాలను బలిపెట్టడానికి కూడా ఆ పార్టీ వెనుకాడటం లేదు.వైసీపీ ఆడుతున్న ఈ విషపూరిత డ్రామాలు, పన్నే ప్లాన్లకు ప్రభుత్వం ఇకనైనా పూర్తిస్థాయిలో చెక్ పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. రోజువారీ రాజకీయ మైలేజ్ కోసం చేస్తున్న ఈ ఆరోపణలను ఎక్కడికక్కడ చట్టపరంగా, కఠినంగా నిలువరించాల్సిన అవసరం ఉంది. కేవలం మీడియా చర్చలకు వదిలేయకుండా, కోర్టుల్లో ఏమాత్రం నిలవని, కేవలం బురదజల్లే ఈ నకిలీ డిబేట్లను తక్షణం న్యాయపరమైన చర్యలతో అడ్డుకోవాలి. లేదంటే ఈ అబద్ధాల ప్రచారమే నిజమనే భ్రమను కల్పించడంలో వారు సఫలమయ్యే ప్రమాదం ఉంది. ప్రభుత్వం తన పాలనా దక్షతను, పారదర్శకతను చాటుకుంటూనే.. వ్యవస్థలను అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్న ఈ పాత రాజకీయ శైలిని ఉక్కుపాదంతో అణచివేయాలి. నిరుద్యోగుల ఉసురుపోసుకునేలా రోజుకో డ్రామా ఆడుతున్న వైసీపీకి ప్రజాక్షేత్రంలోనూ, చట్టం ముందూ తగిన బుద్ధి చెప్పినప్పుడే ఇలాంటి నిరాధార రాళ్ల క్రీడలకు శాశ్వత బ్రేక్ పడుతుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# ఏజింగ్ సమస్యకు కొత్త సొల్యూషన్.. గ్లోబల్ మోడల్‌గా మారిన దేశం!



ప్రపంచవ్యాప్తంగా జనాభా పెరుగుదల గురించి మాట్లాడుకుంటుంటే, మరోవైపు వృద్ధుల సంఖ్య పెరగడం అనేది పెద్ద సామాజిక సవాలుగా మారుతోంది. అయితే ఈ వృద్ధాప్య సమస్యను ఒక సంక్షోభంలా చూడకుండా, అద్భుతమైన అవకాశంగా మార్చుకుంది జపాన్. వృద్ధులను సమాజానికి భారంగా భావించకుండా, వారి అనుభవాన్ని ఒక శక్త్యాత్మక ఆస్తిగా మార్చడమే కాకుండా వృద్ధాప్య సంరక్షణను ఒక గ్లోబల్ ఇండస్ట్రీగా తీర్చిదిద్దింది. ఆసియా దేశాలకు జపాన్ అందిస్తున్న ఈ రోల్ మోడల్ మరియు సరికొత్త పాఠాల గురించి ఇప్పుడు వివరంగా తెలుసుకుందాం.

**సమస్య కాదు.. సామాజిక ఆస్తి:**
చాలా దేశాల్లో వృద్ధాప్యం అనగానే పెన్షన్లు, మెడికల్ ఖర్చులు పెరిగే భారం అనే కోణంలోనే ఆలోచిస్తారు. కానీ జపాన్ ఈ ఆలోచనను పూర్తిగా మార్చేసింది. సీనియర్ సిటిజన్లను కేవలం విశ్రాంతి తీసుకునేవారిగా కాకుండా, వారిలోని నైపుణ్యాన్ని తిరిగి సమాజానికి ఉపయోగపడేలా చేసే ప్రత్యేక కార్యక్రమాలను తెచ్చింది. ఇక విశ్రాంత ఉద్యోగులను కొత్త తరం యువతకు మార్గదర్శకులుగా, స్థానిక కమ్యూనిటీ సర్వీసుల్లో భాగస్వాములుగా మార్చి ఒక కొత్త విప్లవానికి తెరలేపింది.

**జెరియాట్రిక్ ఇన్నోవేషన్:**
వృద్ధుల సంరక్షణ కోసం జపాన్ సాంకేతికతను మరియు వైద్య రంగాన్ని అనుసంధానించిన తీరు అద్భుతం. దీనినే 'జెరియాట్రిక్ ఇన్నోవేషన్' అని పిలుస్తున్నారు. ఇక వృద్ధులకు సహాయంగా ఉండే కేర్‌గివింగ్ రోబోట్లు, సులభంగా నడవడానికి తోడ్పడే పరికరాలు మరియు అధునాతన హెల్త్‌కేర్ ప్రొడక్ట్స్ ఉత్పత్తులను పెద్ద ఎత్తున తయారు చేస్తోంది. ఈ సాంకేతికత జపాన్‌లోనే కాకుండా, ప్రపంచ మార్కెట్‌లోనూ కోట్లాది డాలర్ల వ్యాపారంగా మారి ఆ దేశ ఆర్థిక రంగానికి ఊతమిస్తోంది.

**భారత్‌కు నేర్పించే పాఠాలు:**
ప్రస్తుతం మన భారతదేశం యవ్వనంలో వున్నా వారి సంఖ్య ఎక్కువ ఉన్నప్పటికీ, మరో రెండు మూడు దశాబ్దాల్లో మన దేశంలో కూడా వృద్ధుల సంఖ్య గణనీయంగా పెరగనుంది. మన దగ్గర కుటుంబ వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ, మారుతున్న జీవనశైలి వల్ల వృద్ధుల ఆరోగ్య సంరక్షణ ప్రధాన సమస్యగా మారుతోంది. ఇక జపాన్ తరహాలోనే మనం కూడా ఇప్పటినుంచే ప్రాథమిక హెల్త్‌కేర్, ఆటోమేషన్ మరియు వృద్ధులకు అనుకూలమైన ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను డెవలప్ చేసుకోవడం చాలా అవసరం.

**సంరక్షణే ఒక పరిశ్రమ:**
వృద్ధుల సంరక్షణను కేవలం ఒక సేవగా మాత్రమే కాకుండా, 'సిల్వర్ ఎకానమీ' పేరుతో ఒక పెద్ద పరిశ్రమగా మలిచింది జపాన్. సీనియర్ ఫ్రెండ్లీ గృహాలు, ప్రత్యేక డైట్ ఫుడ్స్, మరియు వ్యాయామ కేంద్రాలు వంటివి అక్కడ పెద్ద వ్యాపార రంగాలుగా అభివృద్ధి చెందాయి. ఇక ఇది ఆర్థికంగా కొత్త ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా, సీనియర్ సిటిజన్లు స్వతంత్రంగా మరియు గౌరవప్రదంగా బ్రతకడానికి తోడ్పడుతోంది.

**ముందస్తు ప్రణాళికే సమాధానం:**
వృద్ధాప్యం అనేది ప్రతి మనిషికి, ప్రతి దేశానికి తప్పనిసరిగా వచ్చే ఒక సహజమైన దశ. దాన్ని చూసి భయపడటం లేదా ఉపేక్షించడం కాకుండా, ఒక పక్కా విజన్‌తో ముందస్తు ప్లానింగ్ చేసుకోవడమే నిజమైన పరిష్కారం. ఇక జపాన్ వేసిన బాటను అనుసరిస్తూ భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు కూడా వృద్ధాప్య సంరక్షణకు అవసరమైన మౌలిక వసతులను ఇప్పుడే ఏర్పాటు చేసుకోవడం భవిష్యత్తుకు ఎంతో శ్రేయస్కరం.

# ఇది రాకేష్ రెడ్డి హెచ్చరిక !



కాంగ్రెస్ పాలనలో నిజామాబాద్ జిల్లా అనాథగా మారింది. అన్యాయానికి గురవుతుంది. నిజమాబాద్ జిల్లాకు నిధులు కేటాయించడం లేదు. ప్రభుత్వం ఈ విషయంలో చిన్నచూపు చూస్తుంది. సీఎం నియోజకవర్గం కొడంగల్, సీతక్క నియోజకవర్గం ములుగు, ఇతర మంత్రుల నియోజకవర్గాలకు మాత్రమే నిధులు కేటాయిస్తారా ? నాకు పది నిమిషాలు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వండి. నేను రాజీనామా చేయాలని అనుకుంటున్నా' అంటూ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తెలంగాణ శాసనసభలో సంచలన వ్యాఖ్యలు చేశాడు. కొడంగల్‌తో పాటు మంత్రుల నియోజకవర్గాలకు ఎన్ని నిధులు తీసుకెళు తున్నారో, నిజామాబాద్ జిల్లాకు ఎన్ని ఇచ్చారో పూర్తి లెక్కలతో వచ్చాను. నిధుల కేటాయింపులో జరుగుతున్న అన్యాయం, జిల్లా అభివృద్ధి విషయాలపై సభలో అన్ని వివరాలు వెల్లడించిన తరువాత తాను రాజీనామా మీద నిర్ణయం తీసుకుంటానని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను ఉద్దేశించి బీజేపీ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి వ్యాఖ్యానించాడు. తెలంగాణ శాసనసభ సమావేశాల చివరి రోజున రాకేష్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు పొలిటికల్ హీట్ పెంచినట్లు అనిపించినా, ఆయన వ్యాఖ్యలను సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎవరూ సీరియస్ గా తీసుకోలేదు. ఎల్ నినో ప్రభావం, 22ఎ నిషేధిత భూముల విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఈ రోజు కీలక ప్రకటన చేస్తాడని అంటున్నారు. పైడి రాకేష్ రెడ్డి గతంలోనూ శాసనసభ వేదికగా మరియు బయట కీలక వ్యాఖ్యలు చేశాడు. నిజాం సాగర్ కాల్వలకు, సాగునీళ్లకు రూ. 1500 నుండి రూ. 2 వేల కోట్లు కేటాయించాలని, పాలమూరు రంగారెడ్డికి నిధులు కేటాయిస్తూ ఉత్తర తెలంగాణను నిర్లక్ష్యం చేస్తున్నారని గత జనవరి శాసనసభ సమావేశాల్లో విమర్శలు చేశారు. మంత్రులు నవ్వుతున్నారని, వారిని 20 సార్లు కలిసినా పనులు జరగడం లేదని అన్నారు. 'నాకు 2 లక్షల జీతం. ఇద్దరు గన్ మెన్లు. కానీ శాసనసభకు ఎందుకు వచ్చానో అర్థం కావడం లేదు. బస్టాండ్లు, హాస్టళ్లు కూలిపోతున్నాయి అని రాకేష్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ లో ఓడిపోయిన కాంగ్రెస్ అభ్యర్థి పెత్తనం చేయడాన్ని కూడా ప్రశ్నించారు. కొడంగల్, ఆర్మూర్ రెండూ సమానమే. రేవంత్ రెడ్డి ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి ఎలా సహకరిస్తాడని ప్రశ్నించారు. తాజాగా రాజీనామా చేస్తాననడం ఆసక్తికరంగా మారింది.

# అంతర్జాతీయ జలాల్లో పాక్ బరితెగింపు.. భారత నౌకాదళాన్ని ఢీకొట్టిన పాక్ నేవీ.. కేంద్రం సీరియస్



ఉద్రిక్తతల నిప్పురవ్వలపై నడుస్తున్న భారత్–పాక్ సరిహద్దుల్లో అంతర్జాతీయ జలాల సాక్షిగా మరో ఘర్షణ చోటుచేసుకుంది. కంటికి రెప్పలా దేశ తీర సరిహద్దులను కాపాడుతున్న భారత నౌకాదళ నౌకపైకి పాకిస్థాన్ నేవీ నౌక ప్రమాదకర రీతిలో దూసుకొచ్చి ఢీకొట్టడం తీవ్ర కలకలం రేపింది. సముద్రంలో నిరంతరం అప్రమత్తంగా ఉంటూ మాతృభూమి రక్షణే ఊపిరిగా విధి నిర్వహణలో ఉన్న మన నావికుల ప్రాణాలను తెగించి ఆడేలా పాక్ ప్రదర్శించిన ఈ బాధ్యతారాహిత్యం.. బరితెగింపు చర్యపై భారత్ రగిలిపోతోంది. దౌత్యపరమైన సరిహద్దులనే కాక.. కనీస మానవత్వాన్ని, వృత్తిధర్మాన్ని విస్మరించి పాకిస్థాన్ ప్రదర్శించిన ఈ ప్రవర్తనపై కేంద్ర ప్రభుత్వం అత్యంత కఠినంగా స్పందిస్తూ పాక్ రాయబారికి గట్టి హెచ్చరికలు జారీ చేసింది.

భారత్––పాకిస్థాన్ మధ్య ఇప్పటికే ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతున్న వేళ అరేబియా సముద్రంలో ఇరు దేశాల నౌకాదళాలకు సంబంధించిన ఓ ఘటన చోటుచేసుకుంది. అంతర్జాతీయ జలాల్లో భారత నేవీకి చెందిన ఓ నౌకను పాకిస్థాన్ నేవీ నౌక ఢీకొట్టింది. ఈ ఘటనపై భారత్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. పాకిస్థాన్ హైకమిషన్‌లోని ఛార్జ్ డి అఫైర్స్‌ను భారత విదేశాంగ శాఖ బుధవారం పిలిపించి బలమైన నిరసన తెలిపింది. విదేశాంగ శాఖ ప్రకారం.. ఈ ఘటన సెప్టెంబర్ 15న ఉత్తర అరేబియా సముద్రంలోని అంతర్జాతీయ జలాల్లో చోటుచేసుకుంది. భారత నేవీ నౌక సాధారణ నిఘా విధుల్లో ఉండగా పాకిస్థాన్ నేవీకి చెందిన నౌక అధిక వేగంతో సమీపించి.. సురక్షితం కాని విధంగా మానీవర్ చేయడంతో ఢీకొన్నట్లు భారత వర్గాలు తెలిపాయి. అయితే ఈ ఘటనలో భారత నౌకకు ఎలాంటి పెద్ద నష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ వ్యవహారాన్ని భారత విదేశాంగ శాఖ ఆగ్రహం వ్యక్తం చేసింది.. సముద్రంలో సైనిక నౌకలు వ్యవహరించే సమయంలో అత్యంత జాగ్రత్త పాటించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. అంతేకాకుండా ఇలాంటి ఘటనలు మరోసారి చోటుచేసుకోకుండా పాకిస్థాన్ అధికారులకు తగిన సూచనలు చేయాలని ఢిల్లీలోని పాక్ దౌత్య ప్రతినిధికి సూచించింది.

**1991 ఒప్పందం ప్రస్తావన**

ఈ ఘటనకు సంబంధించి భారత్ 1991లో ఇరు దేశాల మధ్య కుదిరిన "మిలిటరీ విన్యాసాలు, కసరత్తులు, దళాల కదలికలపై ముందస్తు నోటీసు" ఒప్పందాన్ని ప్రస్తావించింది. ముఖ్యంగా ఈ ఒప్పందంలోని ఆర్టికల్ 10కు పాకిస్థాన్ నౌక ప్రవర్తన విరుద్ధంగా ఉందని విదేశాంగ శాఖ పేర్కొంది. ఇరు దేశాల సైనిక కార్యకలాపాల విషయంలో పారదర్శకత, ముందస్తు సమాచారం, జాగ్రత్త వంటి అంశాలను ఈ ఒప్పందం నిర్దేశిస్తుంది. ఇదే సమయంలో ఇస్లామాబాద్‌లోని భారత ఛార్జ్ డి అఫైర్స్‌కు కూడా పాకిస్థాన్ విదేశాంగ శాఖ వద్ద ఈ అంశాన్ని అధికారికంగా లేవనెత్తాలని కేంద్రం సూచించింది. అంటే ఢిల్లీతో పాటు ఇస్లామాబాద్‌లోనూ దౌత్య మార్గాల్లో నిరసన నమోదు చేయాలని భారత్ నిర్ణయించింది.

**గతంలోనూ ఇలాంటి ఘటన**

భారత్––పాకిస్థాన్ నౌకాదళాల మధ్య సముద్రంలో ఢీకొన్న ఘటనలు గతంలోనూ నమోదయ్యాయి. 2011లో పాకిస్థాన్ నేవీకి చెందిన పీఎన్ఎస్ బాబర్, భారత నేవీకి చెందిన ఐఎన్ఎస్ గోదావరి మధ్య కూడా ఇలాంటి ఘటన చోటుచేసుకుంది. తాజా ఘటన నేపథ్యంలో 1991 ఒప్పందంలోని నిబంధనలు, ఇరు దేశాల నౌకాదళాల మధ్య సముద్ర భద్రతా విధానాలు మరోసారి చర్చకు వచ్చాయి.

గత ఏడాది పహల్గాం ఉగ్రదాడి, అనంతరం భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు మరింత సున్నితంగా మారాయి. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ జలాల్లో జరిగిన తాజా నౌకా ఢీకొన్న ఘటనపై భారత్ దౌత్యపరంగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం ఈ ఘటనపై పాకిస్థాన్ నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

# అక్కడ వేమిరెడ్డి తోనే వైసీపీ ఢీ కొట్టాలి !



వైసీపీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి రాజ్యసభ సభ్యుడు కూడా అయి వైసీపీకి నెల్లూరు జిల్లాలో ఒక బలమైన నేతగా ఉంటూ వచ్చిన వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని 2024 ఎన్నికల ముందు వైసీపీ పోగోట్టుకుంది. ఆయన కోరినట్లుగా ఎంపీ ఎమ్మెల్యే టికెట్లను ఇచ్చేందుకు అధినాయకత్వం తిరస్కరించడంతో గోల్డెన్ చాన్స్ ని టీడీపీ అందుకుంది. కాంగ్రెస్ జమానా నుంచి కూడా నెల్లూరు జిల్లాలో టీడీపీకి రాజకీయ పట్టు తక్కువ. అలాంటిది వైసీపీ గత రెండు ఎన్నికల్లో బ్రహ్మాండంగా గెలిచిన జిల్లాను 2024 ఎన్నికల్లో టీడీపీ కూటమికి సంపూర్ణంగా సమర్పించేసుకుంది అంటే దానికి ఆ పార్టీ అధినాయకత్వం తీసుకున్న ఏకపక్ష నిర్ణయాలే కారణం అని అంటున్నారు. వేమిరెడ్డి లాంటి బలమైన నేతలను వదులుకు నెల్లూరు జిల్లాలో వైసీపీ ఎంతగా నష్టపోయింది అన్నది ఫలితాలు రుజువు చేశాయి.

**ఒంటి చేత్తో నడిపిస్తూ :**
ఇక టీడీపీలో చేరిన వేమిరెడ్డి నెల్లూరు నుంచి లోక్ సభ సభ్యుడు అయ్యారు. ఆయన సతీమణి వేమిరెడ్డి ప్రశాంతి కోవూరు నుంచి సీనియర్ నేత మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిని ఓడించి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. ఇపుడు నెల్లూరు జిల్లాలో వేమిరెడ్డి హవా నడుస్తోంది. దాంతో నెల్లూరు మునిసిపల్ కార్పోరేషన్ ఎన్నికల్లో కూటమి విజయానికి వేమిరెడ్డి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆయన చుట్టూనే ఆశావహులు అంతా ప్రదక్షిణం చేస్తున్నారు. కార్పోరేషన్ ఎన్నికలు అంటే భారీ బడ్జెట్ వ్యవహారం అందుకే వేమిరెడ్డి మీదనే మొత్తం బాధ్యతలను కూడా అధినాయకత్వం పెడుతోంది అని అంటున్నారు. దాంతో పాటుగా వేమిరెడ్డి తన అనుచరులను మేయర్ పీఠం మీద కూర్చోబెట్టాలని చూస్తున్నట్లుగా చెబుతున్నారు.

**వైసీపీకి కష్టమే :**
వేమిరెడ్డి అంగబలం అర్ధ బలం తట్టుకుని నిలిచి గెలవడం అన్నది వైసీపీకి ఇపుడున్న పరిస్థితుల్లో కష్టమే అని అంటున్నారు. పైగా కూటమికి నెల్లూరు జిల్లాలో ఏకంగా మునిసిపల్ మంత్రి నారాయణ ఉన్నారు. అలాగే నెల్లూరు రూరల్ జిల్లా ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డి వంటి మాస్ లీడర్ ఉన్నారు. ఇలా నెల్లూరు జిల్లాలో ఇపుడు కూటమి అత్యంత పటిష్టంగా ఉంది. అంతా కలసి కూర్చొంటే నూటికి నూరు శాతం స్ట్రైక్ రేటు కూటమికే దక్కుతుందని అంటున్నారు. మరి ఇంతలా పకడ్బందీగా రాజకీయం చేస్తున్న కూటమి నుంచి ప్రత్యేకించి వేమిరెడ్డిని ధీటుగా ఎదుర్కోవడం వైసీపీకి అయ్యే పనేనా అని అంతా చర్చిస్తున్నారు.

**నల్లేరు మీద నడక మాదిరి :**
వైసీపీలో మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ యాక్టివ్ అయ్యారు కానీ ఆయన మొత్తం కార్పోరేషన్ ఎన్నికలను ఒంటి చేత్తో నడిపించగలరా అని ఆలోచిస్తున్నారు. ఇక అనిల్ కుమార్ యాదవ్ నల్లపురెడ్డి ఇద్దరూ కూడా వేమిరెడ్డి మీద విమర్శలు చేస్తూ మరింతగా ఆయన్ని రెచ్చగొడుతున్నారని అంటున్నారు. దీంతో వేమిరెడ్డి కార్పోరేషన్ ఎన్నికలను ప్రతిష్టగా తీసుకోవాలని నిర్ణయించారని అంటున్నారు. ఒక విధంగా చూస్తే కూటమికి ఈ ఎన్నికలు నల్లేరు మీద నడక మాదిరిగా ఉంటాయని అంటున్నారు. అదే సమయంలో మాటలకే తప్ప చేతల దాకా కథను వైసీపీ నేతలు ఎంత మేరకు నడుపుతారు అన్నది కూడా చర్చగా ఉంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# లండన్ వీధుల్లో తమిళుల రథోత్సవం.. వైరల్ వీడియోపై డిబేట్!



లండన్‌లోని వీధుల్లో భక్తులు నిర్వహించిన ఓ మతపరమైన కార్యక్రమానికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దక్షిణ లండన్‌లోని లూయిషమ్ ప్రాంతంలో ఉన్న లండన్ శివన్ కోవిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక తమిళ రథోత్సవం (తిరువింజహా) దృశ్యాలే ఈ వీడియోలో కనిపిస్తున్నాయి.

ఈ ఉత్సవంలో తమిళ హిందూ కమ్యూనిటీకి చెందిన భక్తులు శివుడు, గణేశుడి ప్రతిమలతో అలంకరించిన రథాలను వీధుల్లో ఊరేగించారు. సంప్రదాయ పూజలు, భక్తి కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉత్సవంలో భాగంగా కొందరు భక్తులు అంగప్రదక్షిణం వంటి మొక్కుబడి ఆచారాలను పాటిస్తూ రోడ్డుపై కొంత దూరం లేదా కార్యక్రమం జరిగే మార్గంలో దొర్లుతూ కనిపించారు. మహిళలు కూడా చీరలు ధరించి నడవడం, మోకాళ్లపై కూర్చోవడం, సాష్టాంగ నమస్కారం చేయడం వంటి సంప్రదాయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా వాలంటీర్లు హై-విజిబిలిటీ జాకెట్లు ధరించి జనసందోహాన్ని క్రమబద్ధీకరించడం, భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించడం, అవసరమైన చోట ఫస్ట్ ఎయిడ్ సహాయం అందించడం వంటి బాధ్యతలు చేపట్టినట్లు వీడియోలో కనిపిస్తోంది. అయితే ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో భిన్నమైన స్పందనలకు కారణమయ్యాయి. విదేశాల్లో నివసిస్తున్నప్పుడు తమ మతపరమైన, సాంస్కృతిక సంప్రదాయాలను కొనసాగించడం ఒక వైపు ఉంటే.. మరోవైపు ప్రజా ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించేటప్పుడు స్థానిక చట్టాలు, ట్రాఫిక్, భద్రతా నిబంధనలు, ఇతర ప్రజల సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుంటూ తమ సంప్రదాయాలు పాటించడం.. పర్మిషన్ తీసుకొని విదేశాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు ఈ వీడియోను కేవలం అసాధారణమైన దృశ్యంగా చూడకుండా, తమిళ హిందూ కమ్యూనిటీకి చెందిన ఒక సంప్రదాయ వార్షిక రథోత్సవం సందర్భంలో చూడాలని పలువురు సూచిస్తున్నారు.

మొత్తంగా వైరల్ అవుతున్న వీడియో వెనుక ఉన్న సందర్భం లండన్‌లో నిర్వహించిన వార్షిక తమిళ రథోత్సవం కాగా.. అందులో కనిపిస్తున్న భక్తి ఆచారాలపై సోషల్ మీడియాలో ప్రస్తుతం చర్చ కొనసాగుతోంది.

# ...ద్విధ్రువం వైపు!?

ఢిల్లీలో బ్రిక్స్ సదస్సు ముగియగానే, ప్రపంచ భౌగోళిక-రాజకీయ దృష్టి వాషింగ్టన్ వైపు మళ్లింది. వచ్చేవారం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అక్కడ పర్యటిస్తారు. ఢిల్లీలో "బహుళధ్రువత్వం" ప్రధాన నినాదంగా ఉంటే, వాషింగ్టన్‌లో మాత్రం "ద్విధ్రువత్వం" ప్రధానం కావొచ్చు. ఈ ఏడాది డొనాల్డ్ ట్రంప్, షీ జిన్‌పింగ్ మధ్య జరగనున్న రెండో భేటీ తీవ్రస్థాయిలో సాగుతున్న అమెరికా-చైనా చర్చల పరంపరలో భాగం. వాషింగ్టన్ తర్వాత, ఆసియా-పసిఫిక్ ఆర్థిక సహకార (ఏపీఈసీ) సదస్సు సందర్భంగా చైనాలోని షెన్‌జెన్‌లో ట్రంప్, షీ జిన్‌పింగ్ మళ్లీ కలిసే అవకాశముంది. ప్రస్తుతం వినిపిస్తున్న త్రిపాక్షిక సదస్సు ఊహాగానాలు నిజమైతే, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కూడా అక్కడ చేరవచ్చు. అప్పుడు ప్రపంచం జీ-2 నుంచి సాధ్యమైన జీ-3 నమూనావైపు మళ్లొచ్చు. బ్రిక్స్, ఏపీఈసీ, జీ-20 వంటి ఈ బహుళపక్ష సమావేశాలు చాలావరకు వార్షిక సాధారణ కార్యక్రమాలే. ఢిల్లీ సదస్సుకు అంటుకున్న రాజకీయ మెరుపు ఎంతున్నా, ఇలాంటి సమావేశాల్లో గణనీయమైన సామూహిక పురోగతి అరుదు. అయితే ఇవి కీలకమైన ద్వైపాక్షిక సమావేశాలు జరిగేందుకు ఉపయోగకరమైన వేదికలవుతాయి. ఉదాహరణకు, ఢిల్లీ బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ, అధ్యక్షుడు జిన్‌పింగ్ భారత్-చైనా సంబంధాలను పునరుద్ధరించేందుకు చేసిన ప్రయత్నమే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ ఏడాది బహుళపక్ష సదస్సులకు కొంత ప్రాధాన్యం చేకూరడానికి కారణం, ట్రంప్ అమెరికా విదేశాంగ విధానంలో సృష్టిస్తున్న అలజడే. ఈ అలజడి వెనుక దాగివున్న మరింత ముఖ్యమైన నిర్మాణాత్మక మార్పు ఏమిటంటే, ప్రపంచ శక్తి పంపిణీలో చైనా, అమెరికాలకు అనుకూలంగా జరుగుతున్న మార్పు. బ్రిక్స్, జీ-7 రెండూ క్రమంగా ఒకే ఒక్క శక్తి ఆధిపత్యంతో గుర్తించబడుతున్నాయి. బ్రిక్స్‌లో చైనా, జీ-7లో అమెరికా. 2006లో నలుగురు సభ్యదేశాలతో మొదలైన బ్రిక్ ఫోరమ్‌లో చైనా వాటా బ్రిక్స్ మొత్తం జీడీపీలో సగంకంటే తక్కువగా ఉండేది. ఆ తర్వాత కూటమి 11 సభ్యదేశాలకు విస్తరించినా, ఇప్పుడు చైనా వాటా దాదాపు మూడింట రెండు వంతులకు చేరుకుంది. జీ-7లో కూడా ఇదే తరహా మార్పు కనిపిస్తోంది. మూడు దశాబ్దాల క్రితం జీ-7 మొత్తం నామమాత్రపు ఉత్పత్తిలో ఐదింట రెండు వంతులకంటే తక్కువ వాటా కలిగిన అమెరికా, ఇప్పుడు దాదాపు ఐదింట మూడు వంతుల వాటా కలిగి ఉంది. జపాన్ స్తబ్దత, యూరప్ బలహీన వృద్ధి రేటు, ఇంధనం, మూలధన మార్కెట్లు, కృత్రిమ మేధలో అమెరికా ఆధిక్యత ఈ అంతరాన్ని మరింత విస్తృతం చేశాయి. తన సన్నిహిత భాగస్వాములపై కూడా కఠినంగా వ్యవహరించే ట్రంప్ సుముఖత, ఈ పెరుగుతున్న అమెరికా ఆర్థిక ఆధిక్యతపైనే కొంతమేర ఆధారపడి ఉంది.

బ్రిక్స్‌లో చైనా ఆధిపత్యం, జీ-7లో అమెరికా ఆధిక్యత మనం జీ-2 ప్రపంచం వైపు సాగుతున్నామని అర్థమా? అవసరం లేదు. కానీ ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అమెరికా, చైనా ఆధిపత్యంతో కూడిన జీ-2 నిర్మాణంవైపు అభివృద్ధి చెందుతోందన్నది స్పష్టంగా కనిపిస్తోంది. ప్రపంచ ఆర్థిక క్రమాన్ని, సాంకేతిక ప్రమాణాలను, సరఫరా గొలుసులను రూపొందించగల స్థాయి ఉన్న ఏకైక దేశాలు వాషింగ్టన్, బీజింగ్ మాత్రమే. ఈ రెండు దేశాలూ పరస్పరం లోతుగా ఆధారపడి కూడా ఉన్నాయి. ఒకదానిపై మరొకటి ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని ఇరుపక్షాలూ ప్రయత్నిస్తున్నా, ఒకరి మార్కెట్, సాంకేతికత, మూలధనం నుంచి మరొకరు తేలికగా తప్పించుకోలేరు. ఈ ఏడాది జరిగే ట్రంప్-షీ భేటీలు అమెరికా-చైనా ఉమ్మడి ఆధిపత్యానికి దారితీసే అవకాశం లేదు. వాణిజ్యం, సాంకేతికత, తైవాన్‌పై వారి మధ్య విభేదాలు చాలా లోతైనవి. అయితే నిరంతర ఉన్నతస్థాయి సంప్రదింపుల ద్వారానే తమ మధ్య పోటీని నిర్వహించుకోవాల్సిన అవసరాన్ని రెండు దేశాలూ గుర్తించాయనే విషయంపైనే ఈ భేటీలు ఆధారపడి ఉన్నాయి. అయితే ఈ నిర్వహణ స్వభావం మాత్రం మిగిలిన ప్రపంచంపై తీవ్ర ప్రభావం చూపనుంది. ఆర్థికంగా బలహీనపడినప్పటికీ, ఈ రెండు అగ్రరాజ్యాల మధ్య యురేషియా అంతటా సమతుల్యతను ప్రభావితం చేసేంత సైనిక శక్తిని రష్యా ఇంకా కలిగి ఉంది. అందుకే మాస్కో గతంలోకంటే బీజింగ్‌కు మరింత సన్నిహితమైంది, అదే సమయంలో ట్రంప్ రష్యాతో సాన్నిహిత్యం పెంచుకునే ప్రయత్నం చేస్తున్నారు. అయితే దీనర్థం అమెరికా రష్యాను చైనానుంచి తేలికగా వేరు చేయగలదని కాదు. ఉక్రెయిన్ విషయంలో మాస్కో-యూరప్ మధ్య నెలకొన్న సంఘర్షణ ట్రంప్ రష్యా వ్యూహాన్ని సంక్లిష్టతరం చేస్తోంది. అయితే ఉక్రెయిన్‌లో ట్రంప్ శాంతి కార్యక్రమంలో పురోగతి సాధిస్తే, అది అమెరికా-రష్యా సాన్నిహిత్యానికి, జీ-3 సదస్సుకు వేదికగా మారవచ్చు.

జీ-7 కాకుండా, జీ-20లో చైనా, రష్యా, భారత్, బ్రెజిల్, ఇండోనేషియా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా వంటి ముఖ్యమైన పాశ్చాత్యేతర శక్తులు భాగంగా ఉన్నాయి. బ్రిక్స్ కాకుండా, ఇందులో అమెరికా, యూరప్, జపాన్ కూడా ఉన్నాయి. మారుతున్న శక్తి పంపిణీ కారణంగా జీ-20లో అమెరికా, చైనాల ప్రాధాన్యం గతంలో కంటే మరింత పెరిగింది. ఈ నెలలో వాషింగ్టన్‌లో జరిగిన జీ-20 ఆర్థిక మంత్రుల సమావేశంలో అమెరికా-చైనా మధ్య విభేదాలు వాణిజ్య మిగులు, ఎగుమతుల ఆధారిత వృద్ధిపై భాషపై చైనా అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఉమ్మడి ప్రకటన విడుదల కాకుండా అడ్డుకున్నాయి. అమెరికా, చైనాల మధ్య విభేదాలు తలెత్తినప్పుడు, ఆర్థికరంగంలో సామూహిక చర్య తీసుకునే సామర్థ్యం జీ-20కు ఉందన్న ఆశను అవి దెబ్బతీస్తాయి. అయితే వాషింగ్టన్-బీజింగ్ మధ్య ద్వైపాక్షిక ఒప్పందాలు కూడా జీ-20లోని ఇతర భాగస్వాముల ప్రయోజనాలకు భంగం కలిగించే అవకాశం ఉంది. భారత్ బహుళధ్రువ ప్రపంచాన్ని కోరుకుంటున్నప్పటికీ, మనం ఇంకా ఆ స్థాయికి చేరుకోలేదు. ప్రస్తుతానికి, జీ-2 కానీ జీ-3 కానీ, అంతర్జాతీయ వ్యవస్థ భవిష్యత్తును నిర్దేశించనున్న ఈ తీవ్రమైన మహా క్రీడతో ఢిల్లీ వ్యవహరించాల్సి ఉంటుంది. ఏపీఈసీ, బ్రిక్స్, ఈయూ, జీ-7, నాటోవంటి సంస్థలు ప్రపంచ క్రమాన్ని రూపొందించవు, అవి మహా శక్తుల రాజకీయాలు నిర్దేశించే పరిధుల్లోనే పనిచేస్తాయి. ఢిల్లీలో బ్రిక్స్ వేడుక ముగిసిన నేపథ్యంలో, భారత విదేశాంగ విధాన వర్గం తన స్వీయ సంతృప్తి కలలోనుంచి మేల్కొని, అమెరికా, చైనా, రష్యాల మధ్య మారుతున్న ప్రపంచ శక్తి పంపిణీని, భౌగోళిక-రాజకీయ పునర్వ్యవస్థీకరణను నిశితంగా గమనించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## పనికొచ్చే పలుకు




# నిలకడే.. నిజమైన పవర్

మీరు కోరుకునే జీవితం కేవలం క్షణికమైన ప్రోత్సాహంతో లభించదు. ఒక మోటివేషనల్ రీల్‌చూసి ఉత్సాహపడటం, రెండు రోజులు జిమ్‌కు వెళ్లడం, ఒక వారం కొత్త స్కిల్ నేర్చుకోవాలని ప్రయత్నించడం.. ఇవన్నీ మంచివే. కానీ ఇవి మాత్రమే జీవితాన్ని మార్చవు. మీకు మీరు చేసుకున్న ప్రమాణాలను ఎంత నిలబెట్టుకోగలరు అన్నదే అసలైన మార్పుకు కొలమానం. క్రమశిక్షణతో గడిపే ప్రతి రోజూ మీ భవిష్యత్తుకు బలమైన పునాది రాయి. అలా నిలకడగా కష్టపడుతూ పోతే, ఒకరోజు అసాధ్యమనుకున్న జీవితం కళ్లముందు ఆవిష్కృతమవుతుంది. ఇవాళ్టి తరం అంటే, స్క్రోలింగ్‌తో గడిపే క్షణాల్లో ప్రతిదీ వేగంగా, తక్షణంగా జరిగిపోవాలని ఆశించే తరం. ఒక రీల్ 15 సెకన్లలో కథ చెప్పేస్తుంది, ఒక ఆర్డర్ 10 నిమిషాల్లో ఇంటికొచ్చేస్తుంది. ఈ "తక్షణ సంతృప్తి" అలవాటు మెల్లగా మన మెదడును కూడా అలాగే మార్చేస్తుంది. దేనికైనా వెంటనే ఫలితం కావాలని ఆశించేలా చేస్తుంది. కానీ నిజ జీవితంలో గొప్ప విజయాలు, బలమైన కెరీర్లు, ఆరోగ్యకరమైన శరీరాలు, లోతైన సంబంధాలు.. ఇవేవీ ఒక్క రాత్రిలో పుట్టుకురావు. అవన్నీ నెలలు, సంవత్సరాల తరబడి చేసే చిన్న చిన్న ప్రయత్నాల మొత్తమే. ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవడమే జెన్-జీకి అవసరమైన మొదటి మైండ్‌సెట్ మార్పు.

ఒక మొక్కకు నిత్యం నీళ్లు పోస్తే, మొదటి వారం మార్పు కనిపించదు. నెలల తరబడి ఆ పనిని కొనసాగిస్తే, ఒకరోజు అది పెద్ద చెట్టుగా మారుతుంది. మనుషుల విషయంలోనూ ఇదే జరుగుతుంది. జిమ్‌కు వెళ్లిన మొదటివారంలో అద్దంలో ఎలాంటి మార్పూ కనిపించదు. ఇక్కడే చాలామంది నిరాశ చెంది మధ్యలోనే వదిలేస్తారు. కానీ నిజమైన మార్పు ఎప్పుడూ కంటికి కనిపించని దశలోనే జరుగుతుంది. లోపల్లోపల బలం పెరుగుతుంది, అలవాట్లు స్థిరపడతాయి. ఈ "కనిపించని పురోగతి" దశను ఎవరైతే ఓపికగా దాటగలరో, వారే చివరికి గొప్ప ఫలితాలను అందుకుంటారు. సోషల్ మీడియా మనకు చూపించేది కేవలం ఫలితాలు మాత్రమే. ఒక వ్యక్తి ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫోటో, ఒక స్టార్టప్ విజయగాథ. కానీ ఆ ఫలితం వెనుక ఉన్న వందల రోజుల నిలకడైన కృషిని మనం చూడం. దీనివల్ల "వీళ్లకు అదృష్టం బాగుంది, నాకు మాత్రం ఎందుకు జరగడం లేదు" అనే భావన కలుగుతుంది. ఇది ప్రమాదకరమైన ఆలోచనా విధానం. ఎందుకంటే ఇది మనల్ని నిలకడగా కష్టపడకుండా, తక్షణ షార్ట్‌కట్‌ల వెంట పరిగెత్తేలా చేస్తుంది. వాస్తవానికి ప్రతి విజయగాథ వెనుక లెక్కలేనన్ని విఫలమైన ప్రయత్నాలు, వదిలేయాలనిపించిన క్షణాలుంటాయి. వాటిని దాటుకుని సాగినవారే చివరికి గెలుస్తారు.

జీవనశైలిలో నిలకడను తీసుకురావాలంటే, పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకునే బదులు, చిన్న రోజువారీ అలవాట్లతో మొదలుపెట్టడం మంచిది. "నేను ఆరు నెలల్లో పర్‌ఫెక్ట్ బాడీ తెచ్చుకోవాలి" అనుకునే బదులు, "ఈరోజు 20 నిమిషాలు వ్యాయామం చేస్తాను" అని నిర్ణయించుకోవడం సులభం, సాధించదగినది కూడా. ఈ చిన్న విజయాలే క్రమంగా పెద్ద మార్పులకు దారితీస్తాయి. ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సింది.. ప్రతిరోజూ 100శాతం ఇవ్వాల్సిన అవసరం లేదు. కొన్నిరోజులు 60శాతం శక్తితో అయినా ఆ అలవాటును కొనసాగించడమే అసలైన నిలకడ. అలసిపోయిన రోజు కూడా చిన్నగా అయినా ప్రయత్నం చేయడమే, పూర్తిగా మానేయకుండా ఉండటమే విజయానికి కీలకం. చివరగా, జెన్-జీ తరం గుర్తుంచుకోవాల్సిన ముఖ్య విషయం ఏమిటంటే.. మీరు ఈరోజు చేస్తున్న చిన్న చిన్న ఎంపికలే రేపటి జీవితాన్ని నిర్ణయిస్తాయి. అసాధ్యం అనుకున్న జీవితం అనేది ఒక్క అద్భుతమైన నిర్ణయంతో రాదు. అది వందల సాధారణ రోజుల నిలకడైన కృషితో నిర్మించబడుతుంది. సో, రోజూ మీరు వేసే చిన్న అడుగు, రేపటి మీ పెద్ద గెలుపునకు తొలి మెట్టు అని గుర్తుంచుకోండి.

# ఉచిత ఏఐ వెనుక చైనా వ్యూహం?



భారతీయ స్టార్టప్‌లు తమ ఉత్పత్తులను ఇప్పుడు చైనీస్ పునాదులపై నిర్మించుకుంటున్నాయి. క్వెన్, డీప్‌సీక్, కిమీవంటి చైనీస్ లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లు గణనీయమైన వ్యయ పొదుపును అందిస్తూ, అమెరికా అగ్రశ్రేణి మోడళ్లకు దాదాపు సమానంగా పనిచేస్తూ, వాటికంటే కేవలం ఆరు నెలలు మాత్రమే వెనుకబడి ఉన్నాయి. ఏఐ వ్యయాలను నియంత్రించేందుకు భారతీయ కంపెనీలు క్రమంగా చైనీస్ మోడళ్లవైపు మళ్లుతున్నాయని 2026 జూలైలో నిక్కీ ఏషియా నివేదించింది. స్టార్టప్‌లు తమ వ్యయాలను భారీస్థాయిలో తగ్గించుకుంటున్నాయని ఒక వెంచర్ పెట్టుబడిదారుడు వ్యాఖ్యానించారు. ఈ ఓపెన్-వెయిట్ ఔదార్యం కేవలం దాతృత్వమో, చిప్ ఆంక్షలకు ప్రత్యామ్నాయ మార్గమో కాదు, ఇది వేర్వేరు స్వతంత్ర తర్కాలతో మద్దతు పొందిన, మన్నికైన వ్యూహం! అయితే మన్నిక అంటే శాశ్వతం కాదు. 2028 చివరినాటికి తన అగ్రశ్రేణి ఓపెన్-వెయిట్ మోడళ్లకు ప్రాప్యతను చైనా క్రమంగా పరిమితం చేయడం మొదలుపెడుతుందని విశ్లేషకుల అంచనా. చైనా వ్యూహం ఐదు పరస్పర బలపరిచే తర్కాలపై ఆధారపడి ఉంది. మొదటిది వ్యయం. డీప్‌సీక్ తమ ఆర్1 మోడల్‌ను కేవలం 2,94,000 డాలర్లతో శిక్షణ ఇచ్చింది, ఇది ఓపెన్‌ఏఐ లేదా ఆంత్రోపిక్ ఖర్చు చేసే మొత్తంలో అతిస్వల్ప భాగం. అమెరికన్ మోడళ్ల నుంచి డిస్టిలేషన్, నిర్మాణాత్మక సామర్థ్యంలో పురోగతి పరిశోధన-అభివృద్ధి వ్యయాలను గణనీయంగా తగ్గించాయి. రెండోది ప్రతిష్ఠ. డీప్‌సీక్ 2025 జనవరి విడుదల అమెరికా టెక్ స్టాక్‌ల నుంచి సుమారు ట్రిలియన్ డాలర్లను తుడిచిపెట్టింది. షాంఘై ఏఐ సదస్సులో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పాల్గొనడం, 29 దేశాలతో కూడిన వైకో కూటమి, అభివృద్ధి చెందుతున్న దేశాల కోసం 5,000 శిక్షణ స్థానాలు.. ఇవన్నీ ఓపెన్-వెయిటింగ్‌ను దౌత్యనీతిగా మలచుకున్న ఉదాహరణలే.

మూడోది వస్తువీకరణ. అమెరికన్ ల్యాబ్‌లు తమ యాజమాన్య వెయిట్ల ద్వారా ఆదాయం సంపాదిస్తుండగా, అత్యధిక వాణిజ్య అవసరాలకు సరిపోయే ఉచిత మోడళ్లు వారి ధరల శక్తిని దెబ్బతీస్తున్నాయి. చైనీస్ ఏఐ కంపెనీలు తమ ప్రత్యర్థి ఉత్పత్తిని అధిగమించాల్సిన అవసరం లేదు, దానికి రుసుము వసూలు చేసే సామర్థ్యాన్నే ధ్వంసం చేస్తే సరిపోతుంది. నాలుగోది మూలధనం. చైనీస్ గృహ పొదుపులను ఆర్థిక అణచివేత ద్వారా ప్రభుత్వ బ్యాంకుల్లో బంధించి, వ్యూహాత్మక రంగాలకు చౌకగా రుణాలిస్తారు. దీని ఫలితమే ప్రపంచ సోలార్, ఎలక్ట్రిక్ వాహన మార్కెట్లను చదునుచేసిన అదే రాజ్య సబ్సిడీ సమస్య. ఏఐ రంగంలో ఈ ధోరణి 2026 ఆరంభంనాటికి చైనా సైబర్‌స్పేస్ అథారిటీ వద్ద నమోదైన 820 ఎల్‌ఎల్‌ఎంలకు దారితీసింది. ఐదోది మౌలిక వసతులు. ఉచిత మోడళ్లు ఏఐ వినియోగాన్ని పెంచుతాయి, ఇది శక్తి, క్లౌడ్‌వంటి చైనా ఆధిపత్యం చెలాయించే అనుబంధ ఉత్పత్తులకు డిమాండ్‌ను పెంచుతుంది. క్వెన్‌ను ఉచితంగా ఇస్తూనే అలీబాబా క్లౌడ్ ఆదాయం ఏడాదికి 34 శాతం వృద్ధి చెందింది. చైనా నియంత్రణ సంస్థలు అలీబాబా, బైట్‌డాన్స్, జిపువంటి ప్రముఖ ఏఐ కంపెనీలతో రెండు అంశాలపై సంప్రదింపులు జరుపుతున్నాయని జూలైలో ఫైనాన్షియల్ టైమ్స్ నివేదించింది. విదేశాలకు శిక్షణ డేటా బదిలీని పరిమితం చేయడం, చైనీస్ మోడల్ వెయిట్లను విదేశీ వినియోగదారులు స్వేచ్ఛగా డౌన్‌లోడ్ చేసుకోవడాన్ని కొనసాగించాలా అన్నది ఇందులో ఉన్నాయి. అయితే ఆంక్షలు విధించడం హేతుబద్ధంగా మారాలంటే మూడు షరతులు నెరవేరాల్సి ఉంటుందని స్పష్టమవుతోంది. మొదటిది ఏకీకరణ. బీజింగ్ ఐదు కంపెనీలను సమన్వయం చేసుకోగలదు, కానీ 800 కంపెనీలను చేయలేదు. "వంద మోడళ్ల యుద్ధం" నుంచి "టాప్ ఫైవ్ బేసిక్ మోడళ్లు" వైపు మళ్లుతున్నట్టు జిన్హువా ఇప్పటికే ప్రకటించింది. చిప్ ఎగుమతి ఆంక్షల ద్వారా చైనీస్ ల్యాబ్‌ల వ్యయాలను పెంచుతూ, అమెరికా ఎగుమతి నియంత్రణలు ఈ ఏకీకరణ ప్రక్రియనే వేగవంతం చేస్తుండటం ఒక వ్యంగ్యం.

రెండోది లాక్-ఇన్. ప్రపంచ డెవలపర్లు చైనా క్లౌడ్ వ్యవస్థలో లోతుగా ఇమిడిపోకముందే చైనా యాక్సెస్‌ను పరిమితం చేస్తే, వారు సులభంగా వేరేచోటికి మారిపోతారు. ఈ పరిమితి ప్రస్తుతం చేరుకోవడానికి ఇంకా చాలా దూరంలో ఉంది. మూడోది సంతృప్తత. అమెరికన్ అగ్రశ్రేణి ఏఐ ల్యాబ్‌ల ధరల శక్తి తగినంతగా వస్తువీకరణ చెంది, మెటా, మిస్ట్రల్, ఎన్విడియా వంటి చైనేతర ఓపెన్-వెయిట్ విడుదలలు స్వతంత్రంగా ఈ ఒత్తిడిని కొనసాగిస్తున్నప్పుడు, మరిన్ని చైనీస్ విడుదలలు పెద్దగా ప్రయోజనం చేకూర్చవు. ఇక్కడ కూడా అంతరం తగ్గుతున్నా, అది ఇంకా పూర్తిగా తొలగిపోలేదు. కాబట్టి, ఒకేసారి స్విచ్ ఆఫ్ చేసినట్టు కాకుండా, క్రమానుగత పరిమితులతో కూడిన వేర్వేరు మార్గాలు అవలంబించే అవకాశం ఉంది. ముందుగా అగ్రశ్రేణి మోడళ్లను ఏపీఐ ద్వారా అందించి, ఆరు నెలల నిషేధం తర్వాత వెయిట్లను విడుదల చేయడం; నిర్దిష్ట సామర్థ్య పరిమితికి పైన వాణిజ్య లైసెన్సింగ్ విధించి, చిన్న డిస్టిల్డ్ మోడళ్లను ఉచితంగా వదలడం; వెయిట్లను బహిరంగంగా విడుదల చేస్తూనే టూల్-యూజ్, ఏజెంటిక్ స్కాఫోల్డింగ్‌ను నిలిపివేయడం; వైకో సభ్యదేశాలకు ప్రాధాన్య ప్రాప్యత కల్పించడం వంటివి ఇందులో ఉండవచ్చు. 2028 చివరినాటికి ఈ క్రమానుగత పరిమితి కనిపించడం ప్రారంభమవుతుందని విశ్లేషకుల అంచనా.

ఈ నేపథ్యంలో భారత్ ఏం చేయాలన్నది కీలక ప్రశ్న. మారే వ్యయాలను ముందుగానే అంచనా వేసుకుంటూ, ఈ బహిరంగ పర్యావరణ వ్యవస్థను భారత్ సద్వినియోగం చేసుకోవాలి. ప్రభుత్వ శాఖలు, నియంత్రిత రంగాలు వివిధ వ్యవస్థల్లో పనిచేయగల మోడల్-అజ్ఞాత నిర్మాణాలపై ఆధారపడాలి. జీపీయూ స్లైస్‌లపై కంప్యూట్ సబ్సిడీలు అందించే బదులు, ప్రభుత్వ రంగం కోసం 'ఓపెన్‌రౌటర్' తరహా వ్యవస్థను వినియోగించడాన్ని మెయిటీ పరిగణించాలి. అప్లికేషన్లు, పారిశ్రామిక, భాషా డేటా, ఎడ్జ్ ఇన్‌ఫరెన్స్ సిలికాన్ డిజైన్, రంగాల వారీ ఫైన్-ట్యూనింగ్ వంటి భారత్ నిజంగా గెలవగల రంగాలపై దృష్టి పెట్టాలి. ఇది "ఆత్మశక్తి", కొన్ని ఎంచుకున్న విభాగాల్లో సామర్థ్యాలను పెంచుకోవడం ద్వారా స్వీయ-బలం సాధించడం తప్ప, భారత్‌కు అవసరం లేని సంపూర్ణ స్వావలంబన కాదు. చివరగా, ఈ అవకాశాన్ని దౌత్యపరంగా భారత్ వినియోగించుకోవాలి. బహుళపక్ష వేదికలపై ఓపెన్-వెయిట్ నిబంధనలను రూపొందించే ప్రక్రియలో చురుగ్గా పాల్గొనాలి, ఎందుకంటే ఈ ఉమ్మడి వనరు ఇంకా బహిరంగంగానే ఉంది, దీనికి చట్టబద్ధత కోసం బీజింగ్‌కు ఇప్పటికీ అవసరం ఉంది.

ఎక్కువగా, భారత్ తన అవసరాలను తీర్చే అప్లికేషన్లలో ఏఐని వినియోగిస్తూ, ఏకీకృతం చేస్తోందే తప్ప, అగ్రశ్రేణి మోడళ్లను నిర్మించడం లేదు. వివిధ రంగాల్లో ఉత్పాదకతను పెంచేందుకు వేగవంతమైన వ్యాప్తి, 'ఏఐ సార్వభౌమాధికార ప్రదర్శన'కంటే చాలా ముఖ్యం. ఇందుకు ప్రస్తుతం అమెరికా, చైనా వ్యవస్థల నుంచి లభిస్తున్న ఓపెన్ మోడళ్లే సరిపోతాయి. అయితే ఇవి సరిపోవడానికి కారణం, ఈ మోడళ్లను ఉచితంగా అందించడం ద్వారానే ప్రస్తుతం ఒక వ్యూహాత్మక పోటీ సాగుతోందన్నదే, ఆ పోటీ ఈ దశలోనే శాశ్వతంగా కొనసాగదు. ఈ ఓపెన్ పర్యావరణ వ్యవస్థలను సద్వినియోగం చేసుకుంటూనే, భవిష్యత్తులో ఎదురయ్యే అంతరాయాలను తట్టుకుని నిలబడేలా భారత్ తనను తాను సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ■



మీ ఆహారం, ప్రొటీన్, జిమ్ దుస్తులు, సప్లిమెంట్లు, జిమ్ సభ్యత్వం కోసం ఎంత ఖర్చు చేశారో ఎప్పుడూ లెక్కపెట్టకండి. జీవితంలో కొన్ని సంఖ్యలను లెక్కించకుండా వదిలేయడమే మంచిది. ఎందుకంటే మీ ఆరోగ్యంపై పెట్టే ఖర్చు నష్టం కాదు, అదొక పెట్టుబడి. ప్రతి రూపాయినీ బేరీజు వేస్తూ కూర్చుంటే, అసలు లక్ష్యమైన ఆరోగ్యం, క్రమశిక్షణ వెనక్కి పడిపోతాయి. ఖర్చు కంటే ఫలితమే ముఖ్యం, ఆరోగ్యమే అసలైన సంపద అని గుర్తుంచుకోండి. అదే మిమ్మల్ని బలంగా, ఆరోగ్యంగా ముందుకు నడిపిస్తుంది.

-మహాదేవ

## వింతల్లో వింతలు

# స్టీక్‌హౌస్ కిచెన్‌లో బొద్దింకల విందు!




జార్జియాలోని 'లాంగ్‌హార్న్ స్టీక్‌హౌస్' కిచెన్‌లో బొద్దింకలు స్వైర విహారం చేస్తున్న వీడియో వైరల్ కావడంతో సదరు రెస్టారెంట్ ఇరకాటంలో పడింది! ఉద్యోగి షాన్ హెడ్లీ, పైస్థాయివారికి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో, చివరికి తానే కెమెరా పట్టుకున్నాడు. వంటగదిలో బొద్దింకలు క్యాట్‌వాక్ చేస్తుంటే, పక్కనే చెత్తకుప్పలు వెల్‌కమ్ చెబుతున్నాయి! "పరిస్థితి మనుషులు పనిచేయడానికి తగదు" అంటూ ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేయగానే, నెటిజన్లు రెస్టారెంట్‌పై విరుచుకుపడ్డారు. "మేం మిమ్మల్ని విషపూరితం చేయకుండా చూసుకోవాల్సిన బాధ్యత మాదే" అంటూ ఒకరు వ్యాఖ్యానించారు.

# పురుషుల్లోనూ రొమ్ము క్యాన్సర్... ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త!

**మహిళల్లో అత్యధికంగా కనిపించే క్యాన్సర్లలో ముఖ్యమైనది బ్రెస్ట్ క్యాన్సర్**

**పురుషుల్లోనూ అరుదుగా కనిపించే రొమ్ము క్యాన్సర్**

**ప్రతి 1000 మంది పురుషుల్లో ఒకరు దీని బారినపడే అవకాశం**

**ముందుగా గుర్తించడమే చాలా ముఖ్యం**

రొమ్ము క్యాన్సర్... ప్రపంచవ్యాప్తంగా మహిళల్లో చాలామందిని కబళించే క్యాన్సర్లలో ఇది ముఖ్యమైనది. మహిళలే కాదు, పురుషుల్లోనూ కొందరు రొమ్ము క్యాన్సర్ బారినపడుతుంటారు. ప్రతి 1000 మందిలో ఒకరు రొమ్ము క్యాన్సర్ బాధితులు అయ్యే అవకాశం ఉందని గురుగ్రామ్ కు చెందిన ఆన్ క్వెస్ట్ ల్యాబొరేటరీ మాలిక్యులర్ బయాలజీ అధిపతి డాక్టర్ వినయ్ భాటియా వెల్లడించారు.
అయితే మహిళలకు మమ్మోగ్రామ్ వంటి టెస్టుల ద్వారా రొమ్ము క్యాన్సర్ ను ముందే పసిగట్టే అవకాశం ఉండగా, పురుషులకు నిర్దిష్ట ప్రమాణాలతో కూడిన ముందస్తు పరీక్షలు దాదాపుగా లేవనే చెప్పాలి. దాంతో, పురుషులు తమ రొమ్ము కణజాలంలో జరిగే మార్పులను గుర్తించలేక, అవి సాధారణమైన మార్పులే అనుకుని బ్రెస్ట్ క్యాన్సర్ మరింత ముదిరిపోయే ప్రమాదం తెచ్చుకుంటున్నారని డాక్టర్ వినయ్ భాటియా వివరించారు. పురుషుల్లో 60-70 ఏళ్ల వయసున్న వారిలో రొమ్ము క్యాన్సర్ కేసులు అత్యధికం. కుటుంబ గత చరిత్రను పరిశీలిస్తే, ఆ కుటుంబంలోని మహిళలు ఎవరైనా రొమ్ము క్యాన్సర్ కు గురైతే, ఆ కుటుంబంలోని పురుషులు రొమ్ము క్యాన్సర్ బారినపడే అవకాశాలు ఉంటాయి. మహిళలకు మాదిరే రొమ్ము భాగంలో గడ్డలు ఏర్పడతాయి. రొమ్ము బుడిపెల నుంచి రక్తం కారడం, ఇతర స్రావాలు బయటికి రావడం, రొమ్ము బుడిపెలు కుచించుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అంతేకాదు, రొమ్ము పక్కన ఉండే చర్మంలో మార్పులు, నొప్పి



వంటి అదనపు లక్షణాలు పురుషుల్లో రొమ్ము క్యాన్సర్ కు సంకేతాలు. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సాయం తీసుకోవాలి. పురుషుల్లో రొమ్ము క్యాన్సర్ ను గుర్తించేందుకు పూర్తిస్థాయి శారీరక పరీక్షలు, ఎక్స్ రే, బయాప్సీ, హిస్టోపాథాలనీ, హార్మోన్ రిసెప్టర్ పరీక్షలు నిర్వహిస్తారు.

# ఈ జీవనశైలితో మరణ ముప్పు తక్కువ



ఉన్నంత కాలం ఆరోగ్యంగా జీవించాలి. ఆరోగ్యమే ఉంటే దీర్ఘకాలం పాటు నిశ్చింతగా జీవించొచ్చు. ఆరోగ్యానికి, ఆయుర్దాయానికి మధ్య అనుబంధం ఉంది. అందుకే ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యం ఇవ్వాలి. హార్వర్డ్ టీహెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ నిర్వహించిన తాజా అధ్యయనం ప్రకారం.. మెడిటేరియన్ జీవన విధానాన్ని ఆచరించే వారికి ముందస్తు మరణం ముప్పు తగ్గుతున్నట్టు ప్రకటించారు.
మెడిటేరియన్ లైఫ్ స్టయిల్ అంటే.. మొక్కల ఆధారిత ఆహారానికే పరిమితం కావడం. సామాజిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావడం, ఇతరులతో మంచి స్నేహ సంబంధాలు కొనసాగించడం. శారీరక చర్యలు ఉండేలా చూసుకోవడం. పండ్లు, కూరగాయలు, ముడి ధాన్యాలతోకూడిన ఆహారం తీసుకోవడం. ఈ విధానంలో ఉప్పు, చక్కెరలు గణనీయంగా తగ్గించేయాలి. తగినంత నిద్ర ఉండేలా చూసుకోవడం తప్పనిసరి.
1,10,799 మంది జీవన అలవాట్లను పరిశోధకులు అధ్యయనం చేశారు. ఇంగ్లండ్, వేల్స్, స్కాట్లాండ్ లో ఈ అధ్యయనం జరిగింది. తీసుకుంటున్న ఆహారం ఎలా ఉంటుంది? జీవనశైలిపై ప్రశ్నలు వేసి సమాధానాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా మూడు విభాగాలుగా వర్గీకరించి, వాటిపై ప్రశ్నలు సంధించారు. పండ్లు, కూరగాయలు, ముడి ధాన్యాలతో కూడిన ఆహారం. శారీరకరంగా శ్రమిస్తూ, తగినంత నిద్ర పోవడం, స్నేహితులతో గడపడం, ఉప్పు, చక్కెరలు తగ్గించడం గురించి తెలుసుకున్నారు.
తొమ్మిదేళ్ల తర్వాత గమనిస్తే, 4,247 మంది మరణించారు. ఒక్క కేన్సర్ వల్లే 2,401 మంది ముందస్తుగా ప్రాణాలు కోల్పోతే, 731 మందిని గుండె జబ్బులు బలి తీసుకున్నాయి. మెడిటేరియన్ లైఫ్ స్టయిల్ అనుసరించే విషయంలో మంచి స్కోరు ఉన్న వారికి మరణ ముప్పు 29 శాతం తక్కువగా ఉంటోందని పరిశోధకులు గుర్తించారు. ఇదేదో బావుందని చెప్పి వెంటనే మెడిటేరియన్ డైట్ ప్రారంభించకండి. పోషకాహార నిపుణులను సంప్రదించిన తర్వాతే, తమకు అనుకూలమైన విధంగా మెనూను అనుసరించడం మంచిది.

# నిద్రకు ముందు పసుపు కలిపిన పాలు సేవిస్తే ఎన్నో లాభాలు

పసుపు కలిపిన పాలను తాగడం అన్నది ఎన్నో తరాల నుంచి ఉంది. దీన్ని గోల్డెన్ మిల్క్ అని కూడా పిలుస్తారు. దీన్ని తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. తమ ఆరోగ్యాన్ని సహజసిద్ధంగా పెంచుకోవాలని చూసే వారికి ఇదొక మంచి ఔషధం అవుతుంది. పసుపులో యాంటీ మైక్రోబయల్, రక్తాన్ని శుద్ధి చేసే గుణాలు ఉన్నాయి. కనుక నిద్రించడానికి ముందు ఒక గ్లాసు గోరువెచ్చని పాలలో పసుపు కలుపుకుని తాగాలి. దీనివల్ల శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళతాయి. రక్త ప్రసరణ మెరుగుపడుతుంది. దీనివల్ల మొత్తం మీద ఆరోగ్యం పటిష్ఠమవుతుంది.
పసుపులో యాంటీ బ్యాక్టీరియా, యాంటీ వైరల్, యాంటీ ఫంగల్ ప్రాపర్టీలు ఉంటాయి.
కనుక వ్యాధి నిరోధక శక్తి బలంగా మారడానికి ఇవి తోడ్పడతాయి. పసుపుకు రక్తాన్ని శుద్ధి చేసే సామర్థ్యం కూడా ఉంది. పసుపులోని ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్స్ బరువు తగ్గేందుకు అనుకూలిస్తాయి. చర్మం ఆరోగ్యానికి పసుపు మంచిది. వయసు పెరుగుతున్న దశలో చర్మం ముడతలు పడకుండా కాపాడుతుంది. ముఖ్యంగా పుసుపులోని యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యంలోని వారికి ఎంతో అవసరం.
పసుపులో కర్కుమిన్ ఉంటుంది. ఇది జీర్ణశక్తిని పెంచుతుంది. కడుపుబ్బరాన్ని తగ్గిస్తుంది. గాల్ బ్లాడర్ లో బైల్ తయారికి సాయపడుతుంది. పసుపులో యాంటీ ఇన్ ఫ్లమ్మేషన్ ప్రాపర్టీలు కూడా ఉన్నాయి. దీంతో రోజు రాత్రి పసుపు పాలను తాగడం వల్ల నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

# మూడ్ మార్చేసే ఇంటీరియర్ డిజైనింగ్!

మనం వాడే వస్తువైనా, ధరించే దుస్తులైనా.. మన శరీరానికి సౌకర్యాన్నిచ్చినప్పుడే.. మనసూ ప్రశాంతంగా ఉంటుంది. ఇంటీరియర్‌కూ ఈ సూత్రం వర్తిస్తుందంటున్నారు నిపుణులు. నచ్చిన ఫర్నిచర్‌తో ఇంటిని అలంకరించుకుంటే.. సౌకర్యవంతంగానే కాదు.. మనసుకూ ఎంత సంతోషంగా ఉంటుందో మాటల్లో చెప్పలేం! పైగా ఎంతసేపైనా అక్కడే ఉండాలనిపిస్తుంది. ఇదే పరోక్షంగా మానసిక ఆరోగ్యాన్ని సొంతం చేస్తుందట! అందుకే నచ్చినట్లుగా ఇంటిని అలంకరించుకుంటే.. రోజువారీ ఒత్తిళ్లు, ఆందోళనలు దూరమై హ్యాపీగా ఉండచ్చని పలు అధ్యయనాలూ చెబుతున్నాయి. మరి, ఇంటీరియర్ డిజైనింగ్ మానసిక ఆరోగ్యంపై ఎలాంటి సానుకూల ప్రభావం చూపుతుందో తెలుసుకుందాం రండి..

**గదిని బట్టి.. రంగులు!**

ఇంటి అందాన్ని పెంచడంలో, మనసుకు ఆహ్లాదాన్ని అందించడంలో రంగులది కీలక పాత్ర! నచ్చిన రంగుల్ని ఎంచుకుంటే.. అటు సౌకర్యంగా, ఇటు ప్రశాంతంగా అనిపిస్తుంది. ఈ క్రమంలోనే శరీరంలో డోపమైన్ అనే హ్యాపీ హార్మోన్ విడుదలవుతుంది. తద్వారా సంతోషంగా ఉండగలుగుతాం. అయితే మనకు నచ్చిన రంగుల్ని ఎంచుకుంటే సరిపోదు.. గది అవసరాల్నీ పరిగణనలోకి తీసుకోవాలంటున్నారు నిపుణులు. ఉదాహరణకు.. పడకగదిలో రిలాక్సవుతాం.. కాబట్టి ఇక్కడ మనసుకు ప్రశాంతతను అందించే లేత రంగులు, అందులోనూ ముఖ్యంగా పేస్టల్ షేడ్స్‌ని ఎంచుకోవడం మంచిదంటున్నారు. అదే కిచెన్‌లో పనిచేసే సమయంలో ఉత్సాహంగా, చురుగ్గా ఉంటేనే పనులు సమయానికి పూర్తవుతాయి. కాబట్టి ఈ గదికి ఎరుపు, ఆరెంజ్.. వంటి రంగులు నప్పుతాయంటున్నారు. ఇలా గది ప్రత్యేకతల్ని బట్టి రంగుల్ని ఎంచుకుంటే.. అది ఆటోమేటిక్‌గా మనసుపై సానుకూల ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు.

**'బయోఫిలిక్ డిజైన్' తెలుసా?**

ఇంటి అలంకరణ విషయంలో ఒక్కొక్కరికీ ఒక్కో అభిరుచి ఉంటుంది. కొందరు తమ ఇల్లు మోడ్రన్‌గా ఉండాలని కోరుకుంటే.. మరికొందరు వింటేజ్ థీమ్‌ని ఎంచుకుంటుంటారు. అయితే ఎవరి ఇష్టాయిష్టాలెలా ఉన్నా.. బయోఫిలిక్ ఇంటీరియర్ ట్రెండ్ మాత్రం ఇటు ఆరోగ్యాన్నిస్తూనే, అటు మానసిక ప్రశాంతతను, సౌకర్యాన్ని సొంతం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు కారణం.. ఈ డిజైనింగ్ కోసం వాడే అలంకరణ వస్తువులన్నీ పర్యావరణహితమైన ఉత్పత్తులతో తయారుచేయడమే! చెక్క, మట్టి, ఓక్ చెట్టు బెరడు, రాటెన్ (ఇదో రకమైన కలప), ఉన్ని.. వంటి ప్రకృతి అందించే మెటీరియల్స్‌ని ఈ వస్తువుల తయారీలో ఉపయోగిస్తుంటారు డిజైనర్లు. బయోఫిలిక్ ఇంటీరియర్‌లో భాగంగా ఇలా గృహాలంకరణ వస్తువులే కాదు.. ఇంట్లోనే గోడకు లేదంటే ఓ మూలన చిన్నపాటి గార్డెన్‌లా పచ్చదనాన్ని ఏర్పాటుచేసుకోవడం, ప్రకృతి రమణీయతతో కూడిన ఆర్ట్‌వర్క్‌కి ఇంట్లో చోటివ్వడం.. వంటివీ దీని కిందకే వస్తాయి. ఈ తరహా ఫర్నిచర్/గృహాలంకరణ వస్తువులతో మానసిక ఒత్తిళ్లు, ఆందోళనలు తగ్గి.. ప్రశాంతత చేకూరుతుందని పలు అధ్యయనాల్లోనూ తేలింది.

**వెలుతురు..ఓ ఎక్కడెలా?**

వెలుతురు కూడా మన మనసును ప్రభావితం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అందులోనూ సహజసిద్ధమైన లైటింగ్ కీలక పాత్ర పోషిస్తుందట! అయితే చాలామంది వేడిగా ఉందని, దుమ్ము వస్తుందని.. పగటి పూటే తలుపులు, కిటికీలు మూసేసి.. వెలుతురు కోసం లోపలి లైట్లను ఉపయోగిస్తుంటారు. కానీ పగటి పూట వచ్చే న్యాచురల్ లైటింగ్‌ని ఇలా అడ్డుకోకుండా పూర్తిగా ఆస్వాదించినప్పుడే మనసుకు సాంత్వన చేకూరుతుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే పగటి పూట తలుపులు, కిటికీలు తీసే ఉంచడం మంచిది. అవసరమైతే వాటికి పల్చటి కర్టెన్లు వేలాడదీస్తే.. వేడి, దుమ్ము బెడద లేకుండా ఉంటుంది.. ఇంట్లో వెలుతురు కూడా పడుతుంది. ఇక రాత్రి పూట ఇంట్లో ఉపయోగించే లైటింగ్ కూడా గది అవసరాల్ని బట్టి ఉండాలంటున్నారు నిపుణులు.
లివింగ్ రూమ్‌లో ఎక్కువ సమయం గడుపుతుంటాం కాబట్టి ఈ గదిలో ప్రకాశవంతమైన లైట్లను ఏర్పాటుచేసుకోవాలి. ఇక గోడలపై ఏర్పాటుచేసిన ఫొటో ఫ్రేములు, ఆర్ట్ వర్క్‌పై మినీ స్పాట్ లైట్లను ఏర్పాటుచేసుకుంటే గదికి అందమొస్తుంది.. మనసుకు ఆహ్లాదంగానూ అనిపిస్తుంది.
అదే పడకగదిలో లైటింగ్ ఎంత తక్కువగా ఉంటే మనసుకు అంత ప్రశాంతంగా ఉంటుందంటున్నారు నిపుణులు. పుస్తకాలు చదువుకోవడానికి, వర్క్ చేసుకోవడానికి టేబుల్ ల్యాంప్స్‌ని ఉపయోగించచ్చు.
ఇక డైనింగ్ టేబుల్‌పై షాండ్లియర్/పెండెంట్ లైటింగ్ ఏర్పాటుచేసుకుంటే.. ఆ గదికి ఆ లైటింగ్ సరిపోతుంది. లైట్ల ఫోకస్ ఎక్కువగా లేకుండా ప్రశాంతమైన భావన కలుగుతుంది.
ఇక కిచెన్‌లోనూ లైటింగ్ ప్రకాశవంతంగా ఉండాల్సిందే! అయితే దీంతో పాటు క్యాబినెట్స్, అరల్లో స్పాట్ లైట్లను ఏర్పాటుచేసుకుంటే.. అక్కడి వస్తువులు సులభంగా వాడుకోవడానికి వీలుగా ఉంటుంది.. కంఫర్టబుల్‌గానూ అనిపిస్తుంది. ఇది పరోక్షంగా మానసిక ప్రశాంతతనూ పెంచుతుంది.

**గోడలకు.. 'డోపమైన్' టచ్!**

ఇంటి అలంకరణ అనగానే చాలామంది గోడల పైనే తమ దృష్టి కేంద్రీకరిస్తారు. తమకు నచ్చిన చిత్రాల్ని గోడలకు తగిలించడం లేదంటే చక్కటి వాల్ ఆర్ట్ వేయించుకోవడం, వాల్‌పేపర్‌ని అతికించుకోవడం.. ఇలా ఎవరి స్టైల్ వారిది! అయితే అందులోనూ 'అబ్‌స్ట్రాక్ట్ పెయింటింగ్ (వాస్తవికతకు సంబంధం లేకుండా గీసే చిత్రకళ)', 'పర్సనలైజ్‌డ్ ఆర్ట్ (వ్యక్తిగత అభిరుచులు, జ్ఞాపకాలతో చిత్రాల్ని రూపొందించడం)'.. వంటివి మనసుకు ఎక్కువ సంతోషాన్ని, ప్రశాంతతను అందిస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. అందుకే వీటిని 'డోపమైన్ డెకార్'గా నిపుణులు పేర్కొంటున్నారు. కాబట్టి ఇలాంటి అలంకరణ వస్తువులతో గోడలకు హంగులద్దితే ఇటు ఇంటికి అందం తీసుకురావచ్చు.. అటు మనసునూ ప్రశాంతంగా ఉంచుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

# జాతీయ గర్వం అహంకారంగా మారితే.. గెలుపుకు ప్రాధాన్యత ఉండదు:

## భారత్ ట్రోఫీ నిరాకరణపై మహమ్మద్ యూసఫ్

**ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల జట్టు**

**నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ స్వీకరించేందుకు నిరాకరించిన టీమ్**

**వినయం లేని దేశం గెలిచినా ఓడిపోయినట్టే అన్న యూసఫ్**



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా కప్ 2026 విజేతగా నిలిచిన భారత మహిళల క్రికెట్ జట్టు.. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్థాన్ మంత్రి మోహ్సిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించేందుకు నిరాకరించడం తీవ్ర దుమారం రేపుతోంది. గత ఏడాది పురుషుల ఆసియా కప్ సమయంలోనూ భారత పురుషుల జట్టు నఖ్వీ నుంచి ట్రోఫీని తీసుకోకుండా సంచలన నిర్ణయం తీసుకుంది. తాజాగా భారత మహిళల జట్టు కూడా అదే బాటలో పయనించి నఖ్వీకి షాక్ ఇచ్చింది.దుబాయ్‌లో జరిగిన ఫైనల్ పోరులో శ్రీలంకపై 72 పరుగుల తేడాతో విజయం సాధించి భారత మహిళల జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. అయితే నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీ తీసుకోకూడదనే నిర్ణయం వెనుక బీసీసీఐ ముందస్తు వ్యూహం ఉంది.

ఈ ట్రోఫీ నిరాకరణ ఘటనపై పాకిస్థాన్ మాజీ దిగ్గజ క్రికెటర్ మహమ్మద్ యూసఫ్ సోషల్ మీడియా వేదికగా తీవ్రంగా స్పందించాడు. "జాతీయ గర్వం కాస్తా అహంకారంగా మారినప్పుడు, గెలుపునకు ఏమాత్రం ప్రాధాన్యత ఉండదు. జట్టు గెలవవచ్చు, కానీ వినయం లేని దేశం ఓడిపోయినట్టే" అని ట్వీట్ చేశాడు.మోహ్సిన్ నఖ్వీని ప్రశంసిస్తూ యూసఫ్ చేసిన ఈ వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ట్రోఫీ తీసుకోకపోవడంపై బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా స్పందిస్తూ ఇది బోర్డు తీసుకున్న సంస్థాగత నిర్ణయమని స్పష్టం చేశారు. వేడుకల్లో పాల్గొనకూడదనే విషయాన్ని ఏసీసీకి ముందే అధికారికంగా తెలియజేశామని ఆయన వెల్లడించారు. గత ఏడాది పహల్గామ్ ఉగ్రదాడి, ఆ తర్వాత చోటుచేసుకున్న సైనిక ఉద్రిక్తతల దృష్ట్యా దేశప్రజల భావోద్వేగాలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇది ఆటగాళ్లకు లేదా క్రీడకు వ్యతిరేకంగా తీసుకున్న నిర్ణయం కాదని, ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలోని వ్యూహాత్మక నిర్ణయమని పేర్కొన్నారు.

# ఫ్రాంచైజీల విజ్ఞప్తి.. ఇకపై ఇండియాలోనే ఐపీఎల్ మినీ వేలం


**స్వదేశానికి తిరిగి రానున్న ఐపీఎల్ మినీ వేలం**

**ఫ్రాంచైజీల విజ్ఞప్తితో పాలకమండలి నిర్ణయం**

**2024 నుంచి దుబాయ్, జెడ్డా వంటి నగరాల్లో వేలం**

**వేదికపై ఇంకా రాని స్పష్టత**

**ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌పై కొనసాగుతున్న చర్చ**




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మినీ వేలాన్ని తిరిగి భారత్‌లోనే నిర్వహించాలని ఐపీఎల్ పాలకమండలి (జీసీ) కీలక నిర్ణయం తీసుకుంది. గత కొన్నేళ్లుగా విదేశాల్లో నిర్వహిస్తున్న ఈ సంప్రదాయానికి స్వస్తి పలకాలని మంగళవారం జరిగిన పాలకమండలి సమావేశంలో తీర్మానించారు. 2024 నుంచి ఐపీఎల్ వేలాన్ని దుబాయ్, జెడ్డా, అబుదాబి వంటి విదేశీ నగరాల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే, మినీ వేలం కోసం తమ బృందాలను విదేశాలకు తరలించడం రవాణా పరంగా, నిర్వహణాపరంగా సవాలుగా మారుతోందని ఫ్రాంచైజీలు ఆందోళన వ్యక్తం చేశాయి. వారి విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకున్న గవర్నింగ్ కౌన్సిల్, 2027 మినీ వేలాన్ని భారత్‌లోనే నిర్వహించాలని నిర్ణయించింది. అయితే, వేలం నిర్వహించే నగరాన్ని ఇంకా ఖరారు చేయలేదు. పెళ్లిళ్ల సీజన్ దృష్ట్యా హోటల్ గదుల లభ్యతను బట్టి వేదికను ఖరారు చేయనున్నారు. మినీ వేలాన్ని భారత్‌కు మార్చినప్పటికీ, ఆ తర్వాతి ఏడాది జరిగే మెగా వేలాన్ని మాత్రం విదేశాల్లోనే నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఇదే సమావేశంలో 'ఇంపాక్ట్ ప్లేయర్' నిబంధనపై కూడా పాలకమండలి సుదీర్ఘంగా చర్చించింది. ఈ నిబంధనపై ఫ్రాంచైజీల నుంచి అభిప్రాయాలను స్వీకరించి, తదుపరి సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనుంది.

# 2027 ప్రపంచకప్ గెలవాలంటే ఆ తప్పులు చేయొద్దు.. టీమిండియాకు యువరాజ్ కీలక సలహా



**హైదరాబాద్ పెన్ పవర్:** 2027 వన్డే ప్రపంచకప్‌ను లక్ష్యంగా చేసుకుని భారత జట్టు యాజమాన్యానికి మాజీ ఆల్-రౌండర్, 2011 ప్రపంచకప్ హీరో యువరాజ్ సింగ్ కీలకమైన సలహాలు ఇచ్చాడు. టోర్నమెంట్‌కు ముందు చివరి నిమిషంలో జట్టులో భారీ మార్పులు చేయడం మానుకోవాలని, ఇప్పటి నుంచే ఒక కోర్ జట్టును గుర్తించి వారిపై నమ్మకం ఉంచాలని సూచించాడు. దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వెళితేనే విజయం సాధ్యమవుతుందని స్పష్టం చేశాడు.క్రిక్ఇన్ఫోతో మాట్లాడుతూ యువరాజ్ సింగ్ తన అభిప్రాయాలను పంచుకున్నాడు. "భారత జట్టు కీలక టోర్నీలలో విఫలమైన ప్రతీసారి, దానికి కారణం చివరి నిమిషంలో భారీ మార్పులు చేయడమే. కాబట్టి 2027 ప్రపంచకప్ గెలవగలదని మనం నమ్మే జట్టును ఎంచుకుని, టోర్నీ వరకు వారికే అండగా నిలవడం చాలా ముఖ్యం. వారు గెలిచినా, ఓడినా జట్టుపై నమ్మకం ఉంచాలి" అని యువరాజ్ వివరించాడు.ప్రస్తుతం టీ20 ఫార్మాట్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్న తరుణంలో 50 ఓవర్ల మ్యాచ్‌ల సంఖ్య తగ్గిపోయిందని యువీ గుర్తుచేశాడు. అందువల్ల ఎంపిక చేసిన ఆటగాళ్లకు తగినంత మ్యాచ్ ప్రాక్టీస్ లభించాలంటే, రాబోయే ఏడాది కాలంలో వారికే స్థిరంగా అవకాశాలు కల్పించాలని అన్నాడు. 12 నుంచి 14 మందితో కూడిన అత్యుత్తమ జట్టును ఎంపిక చేసుకుని, మైదానం, పరిస్థితులకు అనుగుణంగా తుది జట్టులో ఒకటి రెండు మార్పులు చేయవచ్చని తెలిపాడు.గతంలో ఆస్ట్రేలియా జట్టు ప్రపంచకప్‌లు గెలవడానికి కారణం వారి జట్టులో మ్యాచ్ విన్నర్లు ఉండటమేనని యువరాజ్ ఉదహరించాడు. ఒంటిచేత్తో మ్యాచ్‌ను గెలిపించగల సత్తా ఉన్న ఆటగాళ్లను గుర్తించి, వారిని ప్రోత్సహించాలని సూచించాడు.

ఇటీవల టీ20 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టు కూడా ఇదే విధానాన్ని అనుసరించిందని, స్థిరమైన జట్టుతో బరిలోకి దిగడం వల్లే విజయం సాధ్యమైందని యువీ విశ్లేషించాడు. 2027 ప్రపంచకప్ కోసం కూడా ఇదే తరహా వ్యూహంతో ముందుకు సాగాలని జట్టు యాజమాన్యానికి సలహా ఇచ్చాడు.

# ట్రెండీ టాక్: 50 ప్లస్ హీరోలకు 'ఇరుముడి' నేర్పిన పాఠం





సినిమా రంగంలో స్టార్ హీరోల వయసు మారుతున్న కొద్దీ వారి పాత్రల ఎంపికలోనూ పరిణతి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని మరోసారి ప్రూవ్ అయింది. తమ వయసుకు తగిన పాత్రలు చేస్తేనే ఎంత పెద్ద హీరోనైనా ప్రేక్షకులు తెరపై ఆదరిస్తారని.. లేదంటే ప్రేక్షకుల నుంచి ఘోరమైన తిరస్కారం తప్పదని గత పరిణామాలు స్పష్టం చేసాయి. రవితేజ 'ఇరుముడి' ఇప్పుడు బిగ్ డిబేట్ కి కారకం. పెళ్లీడుకొచ్చిన కూతుళ్లు ఉన్నప్పటికీ ఇంకా యువ హీరోయిన్లతో రొమాంటిక్ లవ్‌స్టోరీల్లో నటిస్తున్న 60 ప్లస్ హీరోలకు ఇదొక పెద్ద కనువిప్పు లాంటి పరిణామం. మన పరిశ్రమలో ఉన్న 50 ప్లస్ హీరోలు ఇకపై రొమాంటిక్ పాత్రలను పక్కన పెట్టి.. కథకు బలమైన డాడీ పాత్రల్లో.. బాధ్యతాయుతమైన రోల్స్‌లో నటించాల్సిన సమయం ఆసన్నమైంది.ఇప్పటివరకు ఇద్దరేసి హీరోయిన్లతో ప్రేమలో నిండా మునిగి, రొమాన్స్ చేయడంలో బిజీగా ఉన్న మాస్ మహారాజా రవితేజ ఇటీవల -ఇరుముడి- చిత్రంలో మొదటిసారి కూతురిని అమితంగా ప్రేమించే బాధ్యతాయుతమైన తండ్రి పాత్రలో నటించారు. తెరపై ఆయనలోని ఈ విప్లవాత్మక మార్పును ప్రేక్షకులు ఎంతో మనసారా స్వాగతించారు. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా కథా బలం ఉన్న తండ్రి పాత్రను ఎంచుకోవడం వల్ల ఆ సినిమా ఘనవిజయం సాధించడమే కాకుండా.. నటుడిగా అతడి మరింత గౌరవాన్ని తెచ్చిపెట్టింది.ఈ విజయంతో 50 ప్లస్, 60 ప్లస్ హీరోలందరూ ఇకపై తమ వయసుకు తగిన పాత్రలనే ఎంచుకోవాల్సి ఉంటుందనే సూచన స్పష్టంగా కనిపిస్తోంది. ఇండస్ట్రీ దిగ్గజ హీరోలైన చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్‌లు ఇప్పటికే చాలావరకు తమ వయసుకు తగినట్లు పరిణతి ఉన్న విభిన్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ దూసుకెళుతున్నారు. నాగార్జున సైతం ప్రయోగాత్మక కంటెంట్‌తో ప్రేక్షకులను అలరిస్తున్నారు. 'ఇరుముడి' తరహాలో భావోద్వేగాలతో కూడిన తండ్రి పాత్రలు ఈ సీనియర్ హీరోలందరికీ కూడా వందశాతం సూటబుల్ ఆప్షన్‌గా మారుతున్నాయి.



అలా కాకుండా పాత పద్ధతిలోనే ఇంకా హీరోయిన్లతో లవ్వాయణాలు, రొమాంటిక్ కామెడీలు చేస్తూ పోతే నేటి ప్రేక్షకులు నిర్ధయంగా తిరస్కరిస్తున్న ఉదాహరణలు చూస్తూనే ఉన్నాం. నేటి మాస్ ఫ్యాన్స్ కూడా ఓటీటీలు, వెబ్ సిరీస్‌లు, హాలీవుడ్ సినిమాలు, లైవ్ సిరీస్ లు విపరీతంగా చూస్తూ పూర్తిగా అప్‌గ్రేడ్ అయ్యారు. వారి అభిరుచులు మారడంతో రొటీన్ కమర్షియల్ ఫార్ములా సినిమాలు బెడిసికొడుతున్నాయి. కేవలం టాలీవుడ్‌లోనే కాకుండా బాలీవుడ్‌లోనూ సల్మాన్ ఖాన్, అమీర్ ఖాన్, షారూఖ్ ఖాన్ వంటి దిగ్గజాలు కూడా గ్లామర్ పాత్రలను పక్కన పెట్టి తమ వయసుకు తగ్గ పరిణతి ఉన్న తండ్రి లాగానో లేదా వయసుకు తగ్గ పాత్రల్లోను నటిస్తుండటం గమనార్హం.మొత్తానికి ఏజ్ పెరుగుతున్న కొద్దీ స్టార్ హీరోలు తమ పంథాను మార్చుకోవాల్సిన టైమ్ వచ్చేసింది. హాలీవుడ్ హీరోల మాదిరిగా మారుతున్న కాలానికి తగినట్లు తమ ఇమేజ్‌ను అప్‌గ్రేడ్ చేసుకుంటూ.. వైవిధ్యమైన పాత్రలతో మైలేజ్ పెంచుకోవడమే సీనియర్ హీరోలకు సరైన మార్గం. కేవలం డ్యాన్సులు, రొమాన్స్ చుట్టూ తిరగకుండా బలమైన భావోద్వేగాలు ఉన్న క్యారెక్టర్లను ఎంచుకుంటేనే బాక్సాఫీస్ వద్ద విజయం సొంతమవుతుందని నిరూపణ అయింది. ఇరుముడి నేర్పిన పాఠం టాలీవుడ్ 50 ప్లస్ హీరోలకు నిజంగానే కలిసి వస్తుందని ఆశిద్దాం.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965